

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA
హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 37 • పేజీలు:12+16 • వెల: రూ.6 ఆదివారం • 7-1-2018 www.manamnews.com /manamnews



పాక్‌ను ఎలా డీల్ చేయాలో

తెలుసు

అన్ని రకాల ప్రత్యామ్నాయాలున్నాయి

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాల్సిందే

మరోసారి అమెరికా ఘాటు హెచ్చరిక

7లో..

దుర్గగుడి ఈవోపై వేటు

విధుల నుంచి సూర్యకుమారి రిలీవ్

పరిపాలనా పరమైన లోపాలపై సీఎం ఆగ్రహం

దేవాదాయ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు



ఇది.. మీ ఇంటి నేస్తం!

వీధి కుక్కలను దత్తత తీసుకోండి.. వాటితో మీ ఇంటికి సెక్యూరిటీ

మంత్రి తారక రామారావు పిలుపు

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (మనం న్యూస్):

ఆఫీసు నుంచి ఇంటికి పోతుంటే రాత్రిళ్లు వీధిలో కుక్కలు వెంటపడుతున్నాయా? ఈ

మిగతా 6లో..

‘స్థూల విచ్ఛిన్న రాజకీయం’ దెబ్బ

దేశ ఆర్థిక వ్యవస్థపై రాహుల్ గాంధీ వ్యాఖ్య

ప్రధాని మోదీ, జైట్లీలపై ట్విట్టర్‌లో విమర్శ

‘మందగమనం’ భయాలు నిజమవుతున్నాయి

కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఆందోళన



7లో..

ఫిబ్రవరి 15లోగా

మిడ్‌మానేరు పూర్తి

పునరావాస చర్యలు వేగవంతం చేయాలి

ఆర్ అండ్ ఆర్ పనులకు 65 కోట్లు విడుదల

ఇప్పటివరకు రూ. 1200 కోట్ల చెల్లింపు

బోగస్ అఫిడవిట్లు ఇచ్చినవారిపై చర్యలు

జూన్‌లోపు చనకా - కొరటా పనులు

పనుల నత్తనడకపై మంత్రి అసంతృప్తి

ఏజెన్సీలపై చర్యలకు వెనుకాడేది లేదు

అధికారుల సమీక్షలో మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, జనవరి 6:

మిడ్ మానేరు ప్రాజెక్టు గేట్ల బిగింపు సహా సివిల్, మెకానికల్, సాంకేతిక పనులన్నీ ఫిబ్రవరి 15లోపు పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు ఊపందుకున్నందున ఆ ప్రాజెక్టులో భాగమైన మిడ్ మానేరు పూర్తికావడం అత్యంత కీలకమన్నారు. శనివారం జలసౌధలో మిడ్ మానే రు పనుల పురోగతిని, భూ

మిగతా 6లో..

ఇదీలోకం!



మీరన్నట్టు.. వయసు, ఆరోగ్యం రీత్యా ఈ రాజకీయాలతో నిరంతరం టెన్షన్ పడేకన్నా ఇదే బెస్టేమో సార్..!

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలోనూ స్వల్ప మార్పు చోటుచేసుకుంటుంది. రాత్రిపూట చలి గాలులు వణికిస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 14 డిగ్రీలు

గాలిలో తేమ: 47 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి సా.4.04 తదుపరి సప్తమి; నక్షత్రం: ఉత్తర రా.1.07 తదుపరి హస్త; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: సా.4.25-5.09; రాహుకాలం: సా.4.30-5.53; అమృతఘడియలు: సా.6.01-7.37; శుభసమయం: ఉ.7.00-9.00, ఉ.11.00-12.00.

సూర్యోదయం: 6.52

సూర్యాస్తమయం: 5.53

రంగు పడింది!

చిన్న వయసులోనే తెల్ల జుట్టు

బాల నెరుపుతో బోలెడు బాధలు

మనం సండే స్పెషల్

మెలనిన్ లోపమే అసలు కారణం

హెయిర్ డై వాడకంలో జర భద్రం

తెల్లటి డై.. సరికొత్త ఫ్యాషన్

రంగుల్లో రసాయనాలతో చేటు

కేన్సర్‌కు దారితీసే ప్రమాదం

రంగు వేయడంలోనూ జాగ్రత్త

సహజ పద్ధతులైతే సురక్షితం

వైద్యులు.. బ్యూటీషియన్ల సలహా



అప్పటివరకు నల్లగా నిగనిగలాడిపోయే జుట్టు ఉండి.. అందులో వెండి తునకలా ఒక్కటే ఒక్క తెల్ల వెంట్రుక కనపడితే చాలు.. భూప్రళయం విరుచుకుపడినట్లుగా ఆందోళన చెందుతారు. ఆ ఒక్క తెల్ల వెంట్రుకను అత్యంత జాగ్రత్తగా పట్టుకుని, దాని మూలాల వరకు వెళ్లి మరీ కత్తిరించి పారేస్తారు. కానీ వారం రోజులకే మరో నాలు గైదు పుట్టుకొస్తాయి. అంతలోనే టీవీలో ప్రముఖ నటుడొకరు వచ్చి జుట్టుకు రంగు వేసుకోవడం ఎంత సులువో చెబుతారు. అప్పటివరకు తెల్లజుట్టుతో కాస్త వంగి కనిపించేవాళ్లు కూడా జుట్టుకు రంగు పడగానే.. నిటారుగా నిలబడి చకచకా వెళ్లిపోతారు. కానీ... రంగు వేయడం ఎంతవరకు మంచిది? శాశ్వతంగా ఉండిపోయే రంగులైతే మాత్రం చాలా ప్రమాదకరమట. ఎంతగా అంటే చివరకు కేన్సర్లు కూడా వచ్చేంత!! కాబట్టి తెల్లవెంట్రుక కనపడగానే రంగు వేసేయడం కాకుండా.. ఒక్కసారి తమిళ హీరో అజిత్‌కుమార్‌ను గుర్తు తెచ్చుకోండి.

6లో..



లాలూకు జైలు

మూడున్నరేండ్ల శిక్ష... 10 లక్షల జరిమానా

తీర్పు చెప్పిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం

వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా విన్న మాజీ సీఎం

బీజేపీ మార్కు రాజకీయం... ఆర్జేడీ అధినేత

రాంచీ, జనవరి 6:

బిహార్‌లో పశుదాణా కుంభకోణానికి సంబంధించిన రెండో కేసులో మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు మూడున్నరేండ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా పడింది. ఈ మేరకు జార్ఖండ్ రాజధాని రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి శివపాల్ సింగ్ శనివారం వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా తీర్పు ప్రకటించగా జైలులో ఉన్న లాలూ విన్నారు. దేవ్‌గఢ్ జిల్లా ఖజానా కార్యాలయం నుంచి 21 ఏళ్ల కిందట రూ.89.27 లక్షలు అక్రమంగా తీసుకున్న ఉదంతంపై ఈ కేసు విచారణ సాగింది. నిరుడు డిసెంబరు 23న విచారణ పూర్తికాగా, లాలూసహ

మిగతా 6లో..

ఆత్మస్థైర్యంతో ‘అడుగులు’



వైకల్యం వెక్కిరిస్తేనేం... గుండె బలంతో గెలుపు సాధించే సత్తా వారి సొంతం. అగ్రదేశం అమెరికా సైన్యంలో చేరి ఉగ్రవాదంతో పోరులో తీవ్రంగా గాయపడిన సైనికులు వీరు. విధి నిర్వహణలో కాళ్లు, చేతులు పోగొట్టుకున్న 44 మంది వీర జవాన్ల మారథాన్ ఇది. ఫ్లోరిడాలోని ఓ వంతెనపై ఏడు కిలోమీటర్ల దూరం సైకిళ్లపై ముందుకు సాగారు. ఊండెడ్ వారియర్ ప్రాజెక్టు ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. అమెరికా సైన్యంలో తీవ్రంగా గాయపడిన వారికి సాయంగా నిలవాలని పిలుపునిస్తూ ఈ మారథాన్ సాగింది.

జర మా గోస సూడండి సారూ...

ఏపీలోని తెలంగాణ ఉద్యోగుల ఆవేదన



సొంత రాష్ట్రానికి తీసుకురావాలని విజ్ఞప్తి

సచివాలయం ఎదుట ఉద్యోగుల ఆందోళన

హైదరాబాద్, జనవరి 6 (మనం ప్రతినిధి):

నాలుగేండ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో అనేక ఇబ్బందులు పడుతున్నామని, ముఖ్యమంత్రి కేసీఆర్ తమ బాధను గుర్తించాలని తెలంగాణకు చెందిన ఉద్యోగులు తమ గోడు చెప్పుకున్నారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన 200 మందికి ఉద్యోగులు

మిగతా 6లో..


కనీస వేతనం 18 వేలు చేయాలి: సీఐటీయూ



హైదరాబాద్, జనవరి 6(మనం న్యూస్): కాంట్రాక్టు వ్యవస్థను కొన సాగిస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్షను ప్రదర్శిస్తోందని సీఐ టీయూ ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబా అన్నారు. తెలంగాణ మున్సి పల్ ఉద్యోగుల(సీఐటీయూ) రాష్ట్రస్థాయి రెండో మహాసభలు హైదరా బాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సభలో సాయిబాబు మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా జిల్లాల్లో ఉన్న మునిసిపల్ కార్మికుల జీతాలు పెంచకుండా ప్రభుత్వం కాలం గడుపు తోందన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీతో మోడీ రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే, బీజేపీకి కేసీఆర్ వత్తాసు పలుకుతూ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తమ హక్కుల కోసం మునిసిపల్ కార్మికులు తెగించి పోరాడాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నేత పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. మహాసభల నేపథ్యంలో నగరంలోని గోల్కొండ క్రాస్‌రోడ్స్ నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకూ కార్మికులు భారీ ర్యాలీ తీశారు.

కడియం శ్రీహరిని కలిసిన ఐలయ్య

హైదరాబాద్, జనవరి 6 (మనం ప్రత్యేక ప్రతినిధి): కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా ప్రభుత్వం తనను నామినేట్ చేయడంతో వరంగల్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఐలయ్య రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.





బాధ్యత బరువెక్కింది.. బంధం రోడ్డెక్కింది

- తల్లిదండ్రులను బైటికి పంపి ఇంటికి తాళం వేసిన కొడుకు

దమ్మపేట, జనవరి 6 (మనం న్యూస్): వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండగా నిలబడాల్సిన కొడుకు వారిని రోడ్డుపై నిలబెట్టాడు. కాయకష్టం చేసి 37 ఎకరాల సాగుభూమిని కూడబెట్టి పిల్లలకు అందించిన ఆ తండ్రి ఇప్పుడు ఉండడానికి చోటు లేక రోడ్డున పడ్డాడు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఖమ్మం జిల్లా దమ్మపేట మండలం మల్కారం గ్రామానికి చెందిన అంకత నాగయ్య, గంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగయ్య తనకున్న 37 ఎకరాల వ్యవసాయ భూమిని ఇద్దరు కొడుకులకు తలో 13 ఎకరాలు చొప్పున పంచి, భార్య పేరు మీద 11 ఎకరాలు ఉంచాడు. నాగయ్య పెద్ద కూతురు అశ్వారావుపేట మండలం వినాయకపురంలో నివసిస్తోంది. పెద్దకుమారుడు బ్రహ్మయ్య మల్కారం లోనే వేరే ఇల్లు కట్టుకొని జీవిస్తున్నాడు. రెండో కుమారుడు వెంకటేశ్వరరావు తన భార్యా పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంట్లో నివాసముంటున్నాడు. చిన్నకూతురు కుమారి తల్లిదండ్రులతో ఉంటుంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగయ్య ఆరునెలల క్రితం పెద్ద కూతురు ఇంటికి వెళ్లాడు. ఆరోగ్యం మెరుగుపడడంతో తిరిగి శనివారం స్వగ్రామానికి వచ్చాడు. నాగయ్య, అతని భార్య, కూతురు ఇంటి బయట పనులు చేసుకుంటుండగా వెంకటేశ్వరరావు, కోడలు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. ఏమి చేయాలో పాలుపోని నాగయ్య తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించాడు.

3 నెలల్లో 500 కోట్ల పనులు

మార్చి 31లోగా పూర్తిచేయాలి.. కూలీల వంద రోజుల పని..

- ఇంటింటికీ మరుగుదొడ్డి.. ప్రభుత్వ లక్ష్యం
- ఉపాధి పనులపై సమీక్షలో మంత్రి జూపల్లి



హైదరాబాద్, జనవరి 6 (మనం ప్రతినిధి): ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రాష్ట్రంలో రూ.500 కోట్ల విలువైన పనులు పూర్తిచేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పించే లక్ష్యంతో ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఈమేరకు శనివారం నాడు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఉపాధి పనులపై సమీక్షా సమావేశంలో డీఆర్వోడీవోలకు సూచించారు. ఈ సందర్భంగా 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కింద చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. రాబోయే 3 నెలల కాలంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాలు, వైకుంఠదామాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఫాంపాండ్స్ వంటి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఈ ఏడాది చివరి నాటికి ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు సంబంధించి సస్పెండ్ అకౌంట్స్‌లో జమైన డబ్బులను బ్యాంకులు, పోస్టాఫీస్‌లలో ఖాతాలు తెరిచి కూలీల ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ఉపాధి కింద పండ్ల తోట పెంపకం లక్ష్యాలను పూర్తిచేయాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల గురించి మైక్ ద్వారా ప్రచారం చేపట్టాలన్నారు. హరితహారం లో నాటిన మొక్కలను సంరక్షించటంతో పాటు వచ్చే ఏడాది నాటే మొక్కలకోసం అవసరమైన నర్సరీల కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. నర్సరీల ఏర్పాటు కోసం అవసరమైన స్థలాలను ముందస్తుగా సేకరించాలన్నారు. రూరల్, అర్బన్ పథకం కింద మంజూరైన అన్ని క్లస్టర్లలో పనులు ప్రారంభించటంతో పాటు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో చేపట్టాల్సిన పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ నీతూకుమారి ప్రసాద్, అధికారులు సైదులు, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే కేసీఆర్ ప్రభుత్వం

- వికేంద్రీకరణపై అవగాహన ఉంది
- కేసులను ఎత్తివేస్తాం: జగదీష్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 6(మనం ప్రతినిధి): పాత నల్లగొండ జిల్లాలో ఉన్న కొన్ని ముఖ్యమైన సమస్యలను తీర్చాలని నల్గొండ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, నేతలు శనివారం మంత్రి జగదీష్ రెడ్డిని కలిశారు. అనంతరం మునుగోడు నియోజకవర్గంలోని ఘట్టుప్పల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి జగదీష్ రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక శాసన సభ్యులు కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు కర్నే ప్రభాకర్‌లు ఉమ్మడి నల్గొండ జిల్లా నుండి విడిపోయిన గూండాలను యాదాద్రి జిల్లాలో కలపాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కృషి చేస్తా హమి ఇచ్చారు. జిల్లా ఏర్పాట్లు సమయంలో కొత్త మండలాల ఏర్పాటులో ఘట్టుప్పల్ గ్రామాన్ని మండలంగా ప్రతి పాదించానన్నారు. ప్రకటన వెలువడిన రోజున ఘట్టుప్పల్ పేరు లేకపోవడంతొ మొదట కొంత బాద పడ్డనని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల పరిపాలనా సౌలొబ్యత కోసమే కొత్త జిల్లాలు, రేవిన్యూ డివిజన్‌లను మండలాలుగా ఏర్పాటు చేశామన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో కొద్ది మంది పెదవి విరిచారన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందని జగదీష్ రెడ్డి స్పష్టంచేశారు. కాగా, ఘట్టుప్పల్ మండలం ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో నమోదైన కేసులు ఎత్తివేస్తామని జగదీష్ రెడ్డి వారికి హమి ఇచ్చారు.



24 గంటల విద్యుత్ టీఆర్ఎస్ ఘనతే

- మూడన్నరేళ్లలో చరిత్ర తిరగరాశాం
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

వరంగల్, జనవరి 6 (మనం న్యూస్): వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తోన్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. వరంగల్ జిల్లా పరిషత్‌లో శనివారం ఉదయం జరిగిన సర్వసభ్య సమావేశంలో కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ విద్యుత్ కోసం గత ప్రభుత్వాల హయాంలో ధర్నాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర తిరగరాసిందన్నారు. ఆటోస్టార్టర్‌ల వల్ల కలిగే ముప్పును ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు వివరించి మీటర్లు అమర్చుకునేలా చేయాలన్నారు. గ్రామాల్లో అస్తవ్యస్తంగా విద్యుత్ తీగల వ్యవస్థను నరిచేయాలని ఆదేశించారు. 24 గంటల విద్యుత్ సరఫరాకు ఎదురైన సమస్యల పరిష్కారానికి, నెట్‌వర్క్ ఏర్పాటుకు రెండు జిల్లాలో కలిపి రూ.104 కోట్లు ఖర్చు చేశామని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఈ సందర్భంగా తెలిపారు. ఉమ్మడి జిల్లాలో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని మార్చి 31లోగా పూర్తిచేయాలని కడియం పశు సంవర్ధకశాఖ అధికారులకు సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ రూ.1.80 కోట్ల ఎస్‌డిఎఫ్ నిధుల నుంచి ఇస్తామని కడియం ప్రకటించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దల పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ ఆమ్రాపాలి, ఎంపీలు సీతారాంనాయక్, పసునూరి దయాకర్, ప్రభుత్వ విప్ బి.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఎన్డీ దళ కమాండర్ అరెస్టు

- తప్పించుకున్న ఇద్దరు నేతలు
- జనజీవనంలోకి రండి: ఎస్పీ



బయ్యారం, జనవరి 6 (మనం న్యూస్): బయ్యారం ఏరియా ఎన్డీ దళ కమాండర్ రాంబాబును పోలీసులు అరెస్టు చేశారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్పీ ఎన్.కోటిరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు శనివారం తెలియజేశారు. మండల పరిధిలోని కోయగూడేనికి చెందిన సూర్నపాక భద్రయ్య అలియాస్ రాంబాబు, అతని భార్య రాధ అలియాస్ రాధక్కతో కలిసి పదేళ్ల క్రితం అప్పటి బయ్యారం ఏరియా దళ నాయకుడు జగన్న దళంలో చేరారు. రాంబాబు భార్య రాధ కొన్నేళ్లుగా దళం నుంచి బయటకొచ్చి జీవిస్తుందని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. క్రమక్రమంగా బయ్యారం ఏరియా దళనాయకుడిగా ఎదిగిన రాంబాబు ఏడాదిగా పార్టీ పేరుతో కాంట్రాక్టర్లు, వ్యాపారుల నుంచి బలవంతపు వసూళ్ళకు పాల్పడ్డాడని చెప్పారు. మరి కొన్ని కేసుల్లో కూడా రాంబాబు నిందితుడని ఎస్పీ తెలిపారు. అయితే ఖమ్మం, వరంగల్ ఏరియా కార్యదర్శి కురుసం




వజ్జయ్య అలియాస్ అశోక్, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి రాజు అలియాస్ రామన్న కోయగూడెంలోని రాంబాబు ఇంట్లో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంపై సమాచారం అందుకున్న పోలీసులు రాంబాబు ఇంటిపై దాడి చేశారు. రాంబాబు పోలీసులకు చిక్కగా అశోక్, రామన్న పరారయ్యారు. రాంబాబు నుంచి మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం, ఓ డైరీని స్వాధీనం చేసుకున్నామని, రాంబాబుకు చెందిన 8ఎంఎం పిస్టల్‌ను అశోక్ తీసుకుని పోయాడని వారు తెలిపారు. దళ కమాండర్ రాంబాబుపై 2015లో తులిసిబంధం తండాలో ఆయుధాలతో బెదిరించిన కేసు, 2017లో కిష్టాపురంలో సోమ్లాసాధు అనే వ్యక్తి ఎన్డీ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నాడని ఆయుధాలతో వచ్చి గుండు కొట్టించిన కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. ఎన్డీ దళాలకు చెందిన నాయకులు, సభ్యులు పోలీసులకు లొంగిపోయి, జన స్రవంతిలో చేరాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా, రాంబాబును అరెస్టు చేసిన సిబ్బందిని ఆయన ప్రశంసించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్.గిరిధర్, డీఎస్పీ ఏ.నరేష్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం ఆర్మూర్ డిక్లరేషన్

- అధికారంలోకి వస్తే రైతులకు అండగా ఉంటాం
- కాంగ్రెస్ నేత మల్లు రవి

హైదరాబాద్, జనవరి 6 (మనం ప్రతినిధి): రైతుల సంక్షేమం కోసమే టీపీసీసీ ఆర్మూర్ డిక్లరేషన్‌ను ప్రకటించిందని ఆ పార్టీ నేత మల్లు రవి తెలిపారు. ఈ మేరకు శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడున్నరేండ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతును అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఆర్మూర్ డిక్లరేషన్ -2019ను టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల వరకు ఉన్న రైతు రుణాలను మాఫీ చేస్తామని తెలిపారు. పంటల కొనుగోలు కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్టు తెలిపారు. ప్రతి ఏడాది రూ.5 వేల కోట్లు మార్కెట్ ఫండ్ కింద ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఒక్కో పంటకు కనీసం రూ. 500ల నుంచి రూ. 2వేల వరకు ధర పెంచుతున్నట్టు వివరించారు. రైతులకు ప్రీమియం భారం లేని పంట బీమా పథకం తీసుకువస్తామన్నారు.



టీఆర్ఎస్ ఓటమి ఖాయం

- కాంగ్రెస్ నేతలు ఉత్తమ్, షబ్బీర్‌అలీ


సదాశివనగర్, జనవరి 6 (మనం న్యూస్) : వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓటమి ఖాయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలు ఉత్తమ్‌కుమార్, షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మండలంలోని పద్మజీవాడి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తీగల నాగగౌడ్ ఏర్పాటు చేసిన పార్టీ జెండాను శనివారం వారు ఎగురవేశారు. ఆర్మూర్ మండలంలోని ఏలూరు గ్రామంలో జరగనున్న రైతు సమావేశానికి వెళ్తున్న ఉత్తమ్, షబ్బీర్ మండల కాంగ్రెస్ కార్యకర్తల వినతి మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మధుయాష్కీ, నల్లమడుగు సురేందర్, వడ్డెపల్లి సురేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీలో మార్పుల్లేవ్ :ఏఐసీసీ

హైదరాబాద్, జనవరి 6 (మనం ప్రతినిధి): ఊహాగానాలకు తెరపడింది. రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత టీపీసీసీలో భారీగా మార్పులుంటాయని కొంతకాలంగా నాయకులతో పాటు కార్యకర్తల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌ను మార్చే అవకాశం ఉందంటూ ఆ పార్టీలోని కొందరు నాయకులు బహిరంగంగానే ప్రకటించిన దాఖలాలున్నాయి. ఈ క్రమంలో శనివారం ఏఐసీసీ కీలక ప్రకటనను విడుదల చేసింది. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి కొనసాగనున్నారు.ఈ ప్రకటనతో గాంధీభవన్‌లో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మీడియా కమిటీ చైర్మన్, పార్టీ ఉపాధ్యక్షులు మల్లు రవి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్, నాయకులు కుమార్‌రావ్, ప్రేమ్‌లాల్, అఫ్జలుద్దీన్ పాల్గొన్నారు.

గవర్నర్ అధికార పార్టీకి అమ్ముడు బోయిండు

- కులాల చిచ్చుతో ఓట్లు దండుకునే యత్నం
- రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన సాగుతోంది
- కేసీఆర్! కొడుకును అదుపులో పెట్టుకో
- కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావ్



హైదరాబాద్, జనవరి 6 (మనం ప్రతినిధి): రాష్ట్ర గవర్నర్ అధికార పార్టీకి అమ్ముడుపోయారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావ్ (వీహెచ్) విమర్శించారు. గాంధీభవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. రాష్ట్రంలో సాగుతున్న అప్రజాస్వామిక పాలనపై ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా గవర్నర్ పట్టించుకోవడం లేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గవర్నర్ వద్దకు పోవడం కాదు, ప్రజల్లోకి పోవాల్సిన అవసరం ఉందని టీపీసీసీకి చెప్పానని తెలిపారు. కులాల్లో చిచ్చు పెట్టి ఓట్లు దండుకునేందుకు సీఎం కేసీఆర్ పథకం పన్నారన్నారు. కేసీఆర్ కుట్రలకు బలి కాకుండా బీసీ నేతలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మరో 16 నెలల్లో ఎన్నికలు ఉండడం వల్లే ఆయనకు బీసీలు గుర్తుకు వచ్చారన్నారు. బీసీలకు రూ. 2,500 కోట్లతో సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తానంటున్నారన్నారు. నయీం డైరీ కేసు, మియాపూర్ భూములు, ఇసుక మాఫియా, రై తులకు బేడీలు, మద్దతు ధర వంటి అంశాలపై ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌పై కేటీఆర్ అవాకులు, చెవాకులు పేలుతున్నారని, కేసీఆర్ తన కొడుకును అదుపులో పెట్టుకోవాలని సూచించారు.

28 బస్తాల అంబర్ ప్యాకెట్ల పట్టివేత

కురవి, జనవరి 6 (మనం న్యూస్): అక్రమంగా తరలిస్తున్న 28 బస్తాల అంబర్ ప్యాకెట్లను కాంపెల్లి వద్ద శనివారం పోలీసులు పట్టుకున్నారు. గన్నారపు వాసుదేవ్, గురువారెడ్డి, లక్క నవీన్‌లు ఖమ్మం నుంచి మహబూబాబాద్‌కు 28 బస్తాల అంబర్ ప్యాకెట్లను తరలిస్తున్నారు. కాగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు వీరు పట్టుబడ్డారు. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ రూ.3.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.





కేఎల్ఎం షోరూంను ప్రారంభించిన 'అర్జున్ రెడ్డి'

ఎల్బీనగర్, జనవరి 6(మనంన్యూస్): దిల్‌సుఖ్‌నగర్‌లోని కేఎల్ఎం బట్టల షోరూంను శనివారం అర్జున్‌రెడ్డి ఫేం హీరో విజయ్‌దేవరకొండ, అజ్ఞాతవాసి హీరోయిన్ అనూఇమాన్యూఎల్‌లు ప్రారంభించారు. ప్రారంభానికి వచ్చిన సీనిమా హీరో, హీరోయిన్‌ను చూడటానికి పెద్దెత్తున యువత తరలి వచ్చారు. ఈ సందర్భంగా కేఎల్ఎం షోరూం యజమానులు మాట్లాడుతూ వినియోగదారులకు అతితక్కువ ధరలలో నాణ్యమైన డిజైన్‌లతో దుస్తులను అందిస్తామని తెలిపారు. అన్యూఇమాన్యూఎల్ మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు ఆదరించినంత వరకు సీనిమాలో నటిస్తానని రానున్న రోజులలో మంచి అవకాశాలతో మరింతగా మెప్పిస్తానని తెలిపారు.



అజ్ఞాతవాసికి రండి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు త్రివిక్రమ్ ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 6(మనం ప్రతినిధి): రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను అజ్ఞాతవాసి సినిమా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణ శనివారం సచివాలయంలో కలిశారు. ఈనెల 10న విడుదల కానున్న అజ్ఞాతవాసి చిత్రాన్ని చూసేందుకు రావాలని వారు మంత్రిని కోరారు. వారి వెంట తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ రామ్మోహన్‌రావు ఉన్నారు.

24 గంటల విద్యుత్ భేష్!

- రైతుల తరపున ధన్యవాదాలు
- కేసీఆర్‌కు ఎంఎస్ స్వామినాథన్ లేఖ

హెదరాబాద్, జనవరి 6(మనం న్యూస్): రైతులకు 24 గంటల పాటు విద్యుత్ అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తూ హరితవిప్లవ పితామహులు ప్రొఫెసర్ ఎమ్ఎస్ స్వామినాథన్ ముఖ్యమంత్రికి ఓ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, నిరంతర విద్యుత్ వారికి వరంలాంటిదని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్ అందిస్తున్న ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి రైతులందరి తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. 2018 సంవత్సరంలో తెలంగాణ ప్రజలందరి కలలు సాకారం కావాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. 24 గంటల విద్యుత్‌ను కొనియాడుతూ ఎమ్ఎస్ స్వామినాథన్ పంపిన లేఖను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్విటర్‌లో పోస్ట్ చేసి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మందకృష్ణ మాదిగ అరెస్టు దారుణం

- బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 6 (మనం న్యూస్) : ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను అరెస్టు చేసి జైలులో పెట్టడం దారుణమని బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి అన్నారు. 25 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఆయన శాంతియుతంగా పోరాటం చేస్తున్నారన్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మందకృష్ణను కిషన్ రెడ్డి శనివారం పరామర్శించారు. వర్గీకరణపై సీఎం ఇచ్చిన మాట నిలబెట్టులేకపోయారని, మందకృష్ణకు బెయిల్ రాకుండా ప్రభుత్వమే అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఆయనపై పెట్టిన కేసులను ఉపసంహరించుకొని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి అన్నారు.

టీఎన్‌జీఓలు ప్రభుత్వంలో భాగం

టీఎన్‌జీఓకు 70 ఏళ్ల చరిత్ర ఉంది ఉద్యమంలో వారిదే కీలక పాత్ర



- 610 జీఓ ఘనత టీఎన్జీఓ సంఘానిదే!
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ కవిత

హైదరాబాద్, జనవరి 6(మనం ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వంలో టీఎన్‌జీఓలు కుటుంబ సభ్యులని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. శనివారం నిజామాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జరిగిన టీఎన్‌జీఓ డైరీ అవిష్కరణ, స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఎంపీ కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో నూతన సంవత్సరం- 2018 డైరీ, క్యాలెండర్‌లను కవిత ఆవిష్కరించారు. అనంతరం ఎంపి కవిత మాట్లాడుతూ...ప్రభుత్వం - ఉద్యోగం వేర్వేరు కాదన్నారు. దీపం వెలుతురును విడదీయలేమన్నట్లే...ఉద్యోగులు,ప్రభుత్వంను కూడా విడదీయలేమన్నారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను అమలు చేసేది ఉద్యోగులేనన్నారు. ఎంప్లాయీస్...ఫ్రెండ్లీ గవర్నమెంట్ మాదని సిఎం కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపీ కవిత గుర్తుచేశారు. 70 ఏళ్ల చరిత్ర కలిగిన టీఎన్జీవో సంఘం ఉద్యోగులకోసం పోరాటం చేస్తూనే తెలంగాణ సమాజం కోసం పనిచేస్తున్న సంస్థ అని ఆమె కొనియాడారు.1969లో ఉద్యమం వచ్చి వెనక్కి పోయింది. 2001లో మళ్ళి ఉద్యమం మొదలయ్యిందన్నారు. కొందరు రాజకీయ నాయకుల ఆలోచన విధానం మారినప్పటికి ఉద్యమంలో తమ వంతు పాత్రను పోషించిన సంఘంలో టీఎన్జీవోది కీలక పాత్ర అన్నారు. 610 జీఓ సాధించిన ఘనత కూడా టిఎన్జీఓ సంఘందేనని కవిత అన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి, జిల్లాల్లో కలెక్టర్ల ముందు ఉండి కూడా ఉద్యమం చేసిన తీరు తెలంగాణ సమాజం మరచిపోదన్నారు. 14 ఏళ్ల నిప్పును చేత్తో పట్టుకుని ఉద్యమం చేశారు కాబట్టే... ముఖ్యమంత్రి కెసిఆర్‌కు టిఎన్జీఓలంటే ఎనలేని ప్రేమ ఉందన్నారు. కేంద్రం ప్రభుత్వ స్కీంల నుంచి కేంద్ర ప్రభుత్వం వైదొలుగుతూన్నా ...రాష్ట్ర ప్రభుత్వం వాటిని కొనసాగిస్తోందంటూ అంగన్ వాడీ వర్కర్లను ఆదుకున్న తీరును ఎంపి కవిత గుర్తుచేశారు. అంగన్ వాడీలకు కొన్ని సమస్యలు మిగిలి పోయాయని వాటిని సీఎం దృష్టికి తీసుకెళతనని ఆమె చెప్పారు. హరిత హారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కార్యక్రమాలను అందరూ హాజరవుతారన్నారు. కానీ, సిఎం దీక్ష చేసిన రోజున నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి టిఎన్జీఓలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని ఆమె తెలిపారు. ఇది సీఎం కేసీఆర్ అన్నా... టీఆర్ఎస్ ప్రభుత్వం అన్నా వారికి ఎంత ప్రేమ ఉందో దీన్ని బట్టే తెలియజేసిందన్నారు. నిజామాబాద్‌లో రూ.1కోటితో టీఎన్జీవో భవన్ నిర్మాణానికి నిధులు మంజురయ్యేలా చూస్తానని ఎంపీ కవిత చెప్పారు. అలాగే జర్నలిస్టులు, ఉద్యోగుల వైద్య సదుపాయాల కోసం నిజామాబాద్‌లో వెల్నెస్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.




ఇసుక మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయి

- సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించండి
- సాయిలు కుటుంబాన్ని ఆదుకోవాలి
- ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 6 (మనం ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్రంలో ఇసుకు మాఫియా ఆగడాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐసీసీ నాయకుడు, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి శనివారం ఆయన పిర్యాదుచేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను ఆయన సీఎస్‌కు వివరించారు. రెండు రోజుల క్రితం ఇసుక మాపియా చేతిలో హత్యకు గురైన సాయిలు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఇసుక మాఫియా విషయంలో కింది స్థాయి ఉద్యోగి నుంచి పైస్థాయి అధికారి వరకు అందరూ భాగస్వామ్యులుగా ఉన్నార ని పొంగులేటి ఆరోపించారు. గోదావరి,కృష్ణ తీరాప్రాంతాల్లో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందన్నారు. గతంలో నెరేళ్ల దాడికి సంబంధించి కోర్టులు హెచ్చరించిన బాధితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సుధాకర్ రెడ్డి టీఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.



మేము సైతం

- పులులు, వన్యప్రాణుల గణనకు ముందుకొచ్చిన వాలంటీర్లు

హైదరాబాద్, జనవరి 6(మనం న్యూస్): అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుంచి పలులు, వన్యప్రాణుల గణన కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు అటవీ శాఖ ఇచ్చిన పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో వాలంటీర్లు శనివారం అరణ్య భవన్‌కు తరలివచ్చారు. విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారులు, సీనియర్ సిటిజన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందుకొచ్చారు. అటవీ శాఖ, వైల్డ్ లైఫ్ అధికారులు వాలంటీర్లుకు గణనపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో ఉన్న మూడు వేలకు పైగా ఉన్న అటవీ బీట్‌లలో స్థానిక అధికారుల బృందంతో కలిసి వాలంటీర్లు గణనలో పాల్గొంటారు.

ఎన్నికల సంఘాన్నే ఏమార్చారు

- ముమ్మాటికీ మున్నాభాయ్ ఎంబీబీఎస్సే
- యూనివర్సిటీకి అనుమతిలేకున్నా డిగ్రీ ఇస్తుందా?
- మంత్రి లక్ష్మారెడ్డిపై రేవంత్ రెడ్డి ఫైర్



హైదరాబాద్, జనవరి 6(మనం ప్రతినిధి): విద్యార్హతలకు సంబంధించి మంత్రి లక్ష్మారెడ్డి ఎన్నికల సంఘాన్నే ఏమార్చారంటూ కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఈమేరకు గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ.. లక్ష్మారెడ్డి ముమ్మాటికీ మున్నాభాయ్ ఎంబీబీఎస్సేనని పేర్కొన్నారు. తన మెడికల్ డిగ్రీకి సంబంధించి ఆయన చూపించిన పత్రాలన్నీ బోగస్ అని మండిపడ్డారు. ఈ విషయంలో ఒక్కో ఎన్నికల సందర్భంగా ఒక్కో ధ్రువపత్రాన్ని ఈసీకి సమర్పించారని తెలిపారు. 2004లో ఎన్నికల సంఘానికి ఇచ్చిన అఫిడవిట్‌లో గుల్బర్గా యూనివర్సిటీ నుంచి 1988లో బీహెచ్ఎంఎస్ పూర్తి చేసినట్టుగా సర్టిఫికెట్‌ను జతపర్చారని రేవంత్ చెప్పారు. అయితే, ఈ యూనివర్సిటీకి 1990లో ప్రభుత్వ అనుమతి లభించిందని పేర్కొన్నారు. అంటే వర్సిటీకి అనుమతి లేకున్నా డిగ్రీలు ప్రధానం చేస్తుందా అని ప్రశ్నించారు. ఇక, 2014లో ఎన్నికల సంఘానికి కర్ణాటక, హైదరాబాద్ ఎడ్యుకేషన్ సొసైటీ నుంచి 1987లో బీహెచ్ఎంఎస్ పూర్తిచేసిన ట్టుగా సర్టిఫికెట్ జతపర్చారని రేవంత్ వివరించారు. హైదరాబాద్, కర్ణాటక సొసైటీకి 1985లో అనుమతి లభించిందని రేవంత్ తెలిపారు. ఈ క్రమంలో మంత్రి లక్ష్మారెడ్డి 1987లో పాస్ అయ్యారా 1988లోనా అనే విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆవాంచ గ్రామంలో ప్రాక్టీస్ చేసినట్టుగా పేర్కొన్న మంత్రి తెలంగాణ బోర్డ్ ఫర్ హోమియోపతి నుంచి అనుమతి పొందిన పత్రాన్ని బహిర్గతం చేయాలని కోరారు. హైదరాబాద్, కర్ణాటక సొసైటీకి మంత్రికి సంబంధించిన పత్రాలను, ఆయన చేరిన, ఉత్తీర్ణత సాధించిన వివరాల కోసం ఆర్టీఐ కింద దరఖాస్తు చేసినా జవాబివ్వడానికి జాప్యం చేస్తున్నారన్నారు. సొసైటీ కళాశాల ప్రిన్సిపాల్ మంత్రి ఇద్దరు క్లాస్‌మేట్స్ అని తెలిపారు. మంత్రి కేటీఆర్ భార్య ఎస్టీ రిజర్వేషన్‌తో చదువుకున్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఆయన మామ తప్పుడు పత్రాలతోనే పింఛన్ పొందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతున్న వారిని మానసికంగా ఇబ్బంది పెట్టే క్రమంలో అసభ్యకరంగా, అసహ్యకరమైన మాటలు, పాటలతో అధికార పార్టీ నేతలు తమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని అన్నారు. కృష్ణానగర్‌లో మంత్రి కేటీఆర్ వేస్తున్న వేషాలు అందరికీ తెలుసన్నారు. మంత్రి లక్ష్మారెడ్డి గొడవలొద్దని మధ్యవర్తులను పంపుతూ కేటీఆర్ సూచనల మేరకే తాను ఆరోపణలు చేస్తున్నానని చెబుతున్నారని రేవంత్ రెడ్డి వివరించారు. ప్రతిపక్ష సభ్యులు, వారి కుటుంబాలపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని రేవంత్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లు రవి, రవీందర్‌నాయక్, సూర్యానాయక్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరి అభ్యంతరాలు తెలుసుకోవాలి: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 6: భూసేకరణ చేయదలిచ్చినప్పుడు రైతులే కాకుండా భూసేకరణ వల్ల ఉపాధి కోల్పోయే వారి అభ్యంతరాలను కూడా అధికారులు తెలుసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. సిద్దిపేట జిల్లా తోగుట మండలం వేములఘాట్ గ్రామంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం జరిపే భూసేకరణలో అధికారులు తమ అభ్యంతరాలను తెలుసుకోవడం లేదంటూ ఎల్లవ్వ మరో పాతిక మంది హైకోర్టులో రిట్ వేశారు. రైతులు/ప్రభావితులైన వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే భూపరిహార చెల్లింపుపై విచారణ చేయాలని, ముందే భూపరిహార చెల్లింపుపై విచారణ చేయడానికి వీల్లేదని న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువుల విలీనంపై తొందరొద్దు

హైదరాబాద్, జనవరి 6: నిజామాబాద్ జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో కొండం, ముంచిప్ప చెరువులను విలీనం చేసే చర్యలను అడ్డుకోవాలని హైకోర్టులో దాఖలైన రిట్‌పై న్యాయమూర్తి స్పందించారు. రెండు చెరువుల్ని విలీనం చేస్తే రైతులవే కాకుండా అటవీ భూములు కూడా మునిగిపోతాయని ముంచిప్ప గ్రామస్తులు 60 మంది హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ ఆరోపణల విషయంలో అధికారులు వేగంగా పనిచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశిస్తూ ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ 18కి వాయిదా పడింది.

హైకోర్టు విభజనకు కమిటీల ఏర్పాటు


హైదరాబాద్, జనవరి 6: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజనకు రెండో అడుగు పడింది. అమరావతిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఏర్పాట్లు, భవనాల పరిశీలనకు అయిదుగురు న్యాయమూర్తులతో ఒక కమిటీతోపాటు మరో రెండు కమిటీలు శనివారం ఏర్పాటయ్యాయి. ఉద్యోగుల విభజన, రికార్డుల డిజిటలైజేషన్లకు మరో రెండు కమిటీలను కూడా ఏర్పాటు చేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల విభజన కమిటీలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తితోపాటు ఇతర న్యాయమూర్తులు సురేష్ కుమార్కైత్, రాజశేఖర్‌రెడ్డి, శంకరనారాయణ, షమీమ్ అక్తర్ ఉన్నారు. రికార్డుల డిజిటలైజేషన్ కమిటీలో న్యాయమూర్తులు సీవీ నాగార్జునరెడ్డి, సంజయ్‌కుమార్, నవీన్‌రావు, ఎస్వీ భట్, దుర్గాప్రసాదరావులున్నారు.

'పల్లెపల్లెకూ టీడీపీ'ని జయప్రదం చేయండి

హైదరాబాద్, జనవరి 6 (మనం న్యూస్): ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్లె పల్లెకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పల్లెపల్లెకు టీడీపీ నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భవన్‌లో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో భాగంగా చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా స్థానిక నేతలతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. టీటీడీపీ, జాతీయ పార్టీకి సమన్వయకర్తగా శాసనమండలి సభ్యుడు టీడీ జనార్ధన్‌ను నియమించారు. అనంతరం ఎల్ రమణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో. సమస్య పరిష్కారానికి ప్రజలకు అండగా ఉంటూ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి శ్రమించాలన్నారు. పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలందరి పైన ఉందని పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. కాగా, తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ టీఆర్ఎస్ ప్రభుత్వానికి అంబాసీడర్‌గా మారారని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆరోపించారు.

దేశంలోనే నెంబర్ 1గా నిలపాలి

- సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ పిలుపు



హైదరాబాద్, జనవరి 6(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం డిసెంబర్ నెలలో జాతీయ స్థాయిలో 4వ స్థానాన్ని సాధించడం పట్ల సింగరేణి సిఎం.డి. శ్రీ ఎన్.శ్రీధర్ అభినందనలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్లో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి విద్యుత్ కేంద్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. డిసెంబర్ నెలలో ఎస్.టి.పి.పి.లోని యూనిట్-1 ప్లాంటు 100 శాతం పి.ఎల్.ఎఫ్, యూనిట్-2 ప్లాంటు 99 శాతం సాధించడం హర్షనీయమన్నారు. డిసెంబర్ నెలలో స్టేషన్ సాధించిన 99.5 శాతం పి.ఎల్.ఎఫ్. వలన ఈ ఆర్థిక సంవత్సరంలో గడచిన 9 నెలల కాలానికి 90 శాతం సగటు పి.ఎల్.ఎఫ్.కు ఎస్.టి.పి.పి. ఎదిగిందని అన్నారు. దీంతో దేశంలోని అత్యుత్తమ 25 ప్లాంటుల జాబితాలో 4వ స్థానం సాధించటం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 3 నెలల్లో కూడా మంచి సామర్థ్యంతో పనిచేసి అత్యుత్తమ పి.ఎల్.ఎఫ్.తో దేశంలోనే నెంబర్-1 స్థానానికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

ఎస్.టి.పి.పి.లో సోలార్ ప్లాంటు..

సింగరేణి వ్యాప్తంగా నెలకొల్పనున్న సోలార్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన సమీక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టులో 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

మిఠాయి పండుగ

- వెబ్‌సైట్ ప్రారంభించిన రమణాచారి



హైదరాబాద్, జనవరి 6: ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ కు సంబంధించిన వెబ్ సైట్ మరియు మొబైల్ అప్లికేషన్‌ను సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డా కె వి రమణ చారి, తెలంగాణ టూరిజం మరియు సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో కలసి ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ ప్రతిష్టాత్మకంగా జనవరి 13 నుండి 15 వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న 3వ అంతర్జాతీయ కైట్ పెస్టివల్‌తో పాటు అనుబంధంగా మొదటి అంతర్జాతీయ స్థాయి స్వీట్ పెస్టివల్ ప్రచారంలో భాగంగా వెబ్ సైట్ తోపాటు మోబైల్ ఆప్ ను రూపొందించి నేడు సచివాలయంలో ఆవిష్కరించారు. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా స్వీట్ పెస్టివల్ కు హైదరాబాద్ నగరం వేదిక కాబోతుందన్నారు తెలంగాణ టూరిజం కార్యదర్శి బుర్రా వెంకటేశం. ఈ స్వీట్ పెస్టివల్ లో 15 దేశాల పాటు 25 రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రం తో పాటు హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వివిధ సంస్కృతి సాంప్రదాయాలు కలిగిన ప్రజలు తయారు చేసిన స్వీట్లు 1000 పైగా ఈ ప్రధర్శనలో ప్రదర్శించ బోతున్నామన్నారు. ప్రజలందరు స్వచ్ఛందంగా పాల్గోనాలని పిలుపునిచ్చారు.

ఈ ప్రధర్శన ను తిలకించటానికి ఎలాంటి ప్రవేశ రుసుం లేదన్నారు. ఇలాంటి స్వీట్ పెస్టివల్ ను నిర్వహించటం ద్వారా రాష్ట్రానికి పర్యాటకులను ఆకర్షించవచ్చునా్నరు. హైదరాబాద్ నగరం స్వీట్స్ హబ్ గా నిలుస్తుందన్నారు.



సమయమంత్రి
చంద్రశేఖర శర్మ

మననం



నదీమతల్లీ.. వందనం

> ఢిల్లీలో వాతావరణ కాలుష్యం గురించి చాలాకాలంగా సుప్రీం కోర్టు, ఢిల్లీ హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లాంటివి ఆందోళన వ్యక్తంచేస్తూనే ఉన్నాయి. గాలి కాలుష్యం, వ్యర్థాల నిర్మూలనతో పాటు యమునా నదిలో కాలుష్యాల గురించి పలు సందర్భాల్లో కోర్టులు సర్కారు తీరును తీవ్రంగానే తప్పుబట్టాయి. అధికారులకు తలంటాయి. కానీ ఒక వ్యక్తి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాడని అతడికి శిక్ష విధించడం, అదికూడా పర్యావరణ అంశాలను పెద్దగా చూడని స్థానిక కోర్టులు స్పందించడం మాత్రం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి. హరియాణాకు చెందిన పనీర్ భండార్ అనే దుకాణంలో స్వీట్లు, ఇతర తినుబండారాలు తయారుచేస్తారు. వాళ్లు తమ దుకాణంలోంచి వచ్చే వ్యర్థజలాలను ఏమాత్రం శుద్ధి చేయకుండా అలాగే యమునానదిలోకి వదిలేస్తారు. ఇది చాలా సంవత్సరాలుగా జరుగుతోంది.

నది.. ప్రాణప్రదాత. మనుషులకే కాదు పశు పక్ష్యాదులు, సకల జీవరాశులతో పాటు పంటలకు సైతం జీవాన్ని అందించే జలరాశుల నిలయం నదీమతల్లి. అలాంటి ప్రాణప్రదాతలు అయిన నదులను కలుషితం చేస్తామంటే చూస్తూ ఊరుకుంటారా ఎవరైనా? మనకే ఎక్కడలేని కోపం వస్తుంది .. ఇక కోర్టులు సహిస్తాయా! దేశ రాజధాని ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టుకు కూడా ఇలాగే పట్టలేని ఆగ్రహం వచ్చింది. యమునానదిని కలుషితం చేసినందుకు ఓ వర్తకుడికి రెండేళ్ల జైలుశిక్ష విధించింది. సాధారణంగా హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు- ఇలాంటి కేసుల్లో అయితే కోర్టు తీవ్రంగా స్పందించి వెంటనే శిక్షలు వేయడం మనం చూశాం. కానీ ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనట్లుగా నదిని కలుషితం చేసినందుకు జైలుశిక్ష వేయడం చాలామందిని ఆశ్చర్యచకితులను చేసింది.

ఢిల్లీలో వాతావరణ కాలుష్యం గురించి చాలాకాలంగా సుప్రీం కోర్టు, ఢిల్లీ హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లాంటివి ఆందోళన వ్యక్తంచేస్తూనే ఉన్నాయి. గాలి కాలుష్యం, వ్యర్థాల నిర్మూలనతో పాటు యమునా నదిలో కాలుష్యాల గురించి పలు సందర్భాల్లో కోర్టులు సర్కారు తీరును తీవ్రంగానే తప్పుబట్టాయి. అధికారులకు తలంటాయి. కానీ ఒక వ్యక్తి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాడని అతడికి శిక్ష విధించడం..అదికూడా పర్యావరణ అంశాలను పెద్దగా చూడని స్థానిక కోర్టులు స్పందించడం మాత్రం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి.

హరియాణాకు చెందిన పనీర్ భండార్ అనే దుకాణంలో స్వీట్లు, ఇతర తినుబండారాలు తయారుచేస్తారు. వాళ్లు తమ దుకాణంలోంచి వచ్చే వ్యర్థజలాలను ఏమాత్రం శుద్ధి చేయకుండా అలాగే యమునా నదిలోకి వదిలేస్తారు. ఇది చాలా సంవత్సరాలుగా జరుగుతోంది. దీని గురించి దాదాపు 18 ఏళ్ల క్రితం..అంటే 2000 సంవత్సరం జూన్ నెలలో ఢిల్లీ కాలుష్య నియంత్రణ మండలి వాళ్లు కేసు నమోదు చేశారు. ఇన్ని సంవత్సరాల పాటు విచారణ సుదీర్ఘంగా కొనసాగిన తర్వాత సదరు దుకాణ యజమాని నదీజలాలను కలుషితం చేస్తున్నందుకు, సరైన అనుమతులు లేకుండా దుకాణం నడుపుతున్నందుకు మూడేళ్ల కారాగార శిక్షతో పాటు రూ. 2 లక్షల జరిమానా కూడా విధిస్తూ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. దీనిపై అతడు పై కోర్టులో అప్పీలు చేసుకోగా.. ఒక్క నేరంలో మాత్రం శిక్షను నిలిపివేసి, మిగిలిన నేరాలకు యథాతథంగా కొనసాగించారు. దాంతో రెండేళ్ల జైలుశిక్ష, లక్షరూపాయల జరిమానా పడ్డాయి. దాంతోపాటు.. ఇన్నాళ్ల బట్టి సమాజానికి చేటు చేసినందుకుగాను ప్రధానమంత్రి సహాయ నిధికి మరో రూ. 2.5 లక్షలు చెల్లించాలని కూడా జడ్జి ఆదేశించారు.

ఢిల్లీలో ఉన్న ఈ ఒక్క మిఠాయి దుకాణమే కాదు.. మన కళ్లెదురుగా ఉన్న చాలామంది చాలా రకాలుగా నదీ జలాలను కలుషితం చేస్తూనే ఉన్నారు. చెరువులను చెరబడుతున్నారు కూడా. నీళ్లు లేనిదే ఒక్క రోజు కూడా గడపలేని మనం.. అదే నీళ్లను మనకు వరప్రసాదంలా అందించే జలవనరులను మాత్రం పట్టించుకోకపోవడం దారుణాతి దారుణం. పారిశ్రామిక వ్యర్థాలు, మాంసం దుకాణాల నుంచి వెలువడే కలుషితాలు, కబేళాల నుంచి వచ్చే వ్యర్థాల దగ్గర నుంచి ఇంట్లో పేరుకుపోయే చెత్త వరకు దేన్ని పడితే దాన్ని ఇలా నదీజలాల్లో కలిపేయడం, చెరువు గట్ల మీద పారేయడం సర్వసాధారణంగా చూస్తూనే ఉంటాం. వాటివల్ల భూగర్భ జలాలు సైతం కలుషితం అయిపోతాయని మనకు తెలిసినా.. సామాజిక బాధ్యతను గాలికి వదిలేసి దాన్ని అలాగే కొనసాగనిస్తుంటాం. మనలాంటి చైతన్యరహితులందరికీ ఢిల్లీ కోర్టు తీర్పు చెంపదెబ్బలాంటిదే.

రంగవల్లులూ భూమికి హాని చేసేవే!

ఏదో చిన్న వ్యాపారం చేసుకుంటున్న వాళ్లను ఇలా కాలుష్యం పేరుతో జైల్లో పెట్టడం ఏంటని ఆ చుట్టుపక్కల ఉన్నవాళ్లు సానుభూతి చూపించవచ్చు గాక. మురుగు నీళ్లను కాలువలోకి కాకుండా ఇంకెక్కడికి వదలాలంటూ వితండ వాదం కూడా చేయొచ్చు. కానీ అసలు నియమ నిబంధనలు ఏం చెబుతున్నాయన్న విషయాన్ని ఒక్కసారైనా గమనించుకోవాలి కదా! యమునా నది సహా పలు జలవనరులను ఇలా చాలామంది దుకాణదారులు, ఇళ్ల యజమానులు, ఇతరులు చాలాకాలంగా కలుషితం చేస్తూనే ఉన్నారు. ఇలా ఒక ప్రవాహాన్ని గానీ, బావిని గానీ, భూమిని గానీ కలుషితం చేయడం 1974 నాటి నీటి చట్టం ప్రకారం నేరం. నీటిచట్టం ఎప్పటి నుంచో అమలులో ఉన్నా.. దాన్ని ఇంతవరకు కచ్చితంగా అమలుచేసి, దాని ప్రకారం ఇలా జైలుశిక్ష విధించడం మాత్రం చాలా అరుదు. దాంతో కలుషితం చేయడం తప్పు కాదన్న భావన ఒకటి మనకు సుదీర్ఘకాలంగా ఏర్పడిపోయింది. భూమిని కలుషితం చేయడం అంటే.. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం, రసాయన రంగులు విరజిమ్మడం, చివరకు రసాయన రంగులతో ముగ్గులు పెట్టడం కూడా!! అవును, అందమైన రంగవల్లులు తీర్చిదిద్దుకోవాలంటే సహజంగా లభించే పసుపు, కుంకుమ, పూలు బాగానే ఉంటాయి. కానీ ఆకర్షణీయంగా కనిపించాలన్న ఉద్దేశంతో రసాయన రంగులు తీసుకుని వాటితో భూమాతకు తిలకం దిద్దుతున్నామన్న సంబరంలో వాటివల్ల వచ్చే కాలుష్యం గురించి మనం ఏమాత్రం పట్టించుకోము. కానీ చట్టపరిధిలో చూస్తే అలా ముగ్గులు వేసేవాళ్లంతా కూడా నేరం చేసినట్లే!

చట్టాలు సరే... అమలులోనే లోపం

జాతీయ నేర రికార్డుల బ్యూరో లెక్కల ప్రకారం, 2016 సంవత్సరంలో నీటి చట్టం కింద ఆరు కేసులు ఓ కొలిక్కి వచ్చాయి. వాటిలో ముగ్గురిని దోషులుగా తేల్చగా, మరో ముగ్గురిని నిర్దోషులన్నారు. మనదేశంలో జలవనరులను కలుషితం చేస్తున్న వారి సంఖ్యతో పోలిస్తే ఇది చాలాచాలా తక్కువే. అందుకు ప్రధాన కారణం.. తగిన యంత్రాంగం లేకపోవడమే తప్ప చట్టాలు లేకపోవడం కాదు. ఉన్న చట్టాలను పటిష్ఠంగా అమలుచేయడానికి కావల్సినంతమంది సిబ్బంది లేకపోవడం, ఉన్నవాళ్లు సైతం అవినీతికి, అలసత్వానికి అలవాటు పడిపోయి ఉండటంతో నీటిచట్టం ఇన్నాళ్లుగా సరిగా అమలైన పాపాన పోవడం లేదు. వాస్తవానికి ప్రవహించే నీటిలోకి ఏ పదార్థమైనా వేసి.. దాని ప్రవాహాన్ని కొంతమేర ఆటంకపరచడం అయినా నీటిచట్టం ప్రకారం నేరమే అవుతుంది. ఆ లెక్కన నదుల్లో విగ్రహాల నిమజ్జనాలు కూడా నేరమే అవుతాయి. వాటిని కూడా కట్టడి చేయాల్సి ఉంటుంది.

పరిశ్రమలు నదులలోకి ప్రత్యక్షంగా లేక పరోక్షంగా వ్యర్థాలను వదిలిపెట్టడం నిషేధం అని సుప్రీంకోర్టు ఎప్పుడో చెప్పింది. అయినా ఇప్పటికీ అనేక పరిశ్రమలు తమ పరిసరాల నుంచి వెలువడే వ్యర్థాలను ఏమాత్రం శుద్ధి చేయకుండా వాగుల ద్వారా నదుల్లోకి వదిలేస్తూనే ఉన్నారు.

కనుమరుగైన నక్కవాగు

పఠాన్ చెరువు ప్రాంతంలోని నక్కవాగు ఇలాగే పూర్తిగా 'చచ్చిపోయింది'. ఒక వాగును సమూలంగా నిర్మూలించిన ఘనత కొంతమంది స్వార్థపరులైన పారిశ్రామిక వేత్తలకే దక్కింది. ఈ వాగుల ద్వారా కలుషిత జలాలను బయటకు వదిలిపెట్టడం, అవన్నీ చివరకు మూసీనదిలోకి, హుస్సేన్ సాగర్‌లోకి కూడా వెళ్లడం లాంటివి అందరికీ తెలిసిందే. ఒకప్పుడు అత్యంత ఆహ్లాదకరంగా ఉండే హుస్సేన్‌సాగర్ పక్క నుంచి వెళ్లాలంటేనే ఎంత దుర్భరంగా ఉంటుందో మనకు తెలుసు. ఇప్పుడు దాన్ని మళ్లీ ప్రక్షాళన చేయడానికి ప్రభుత్వాలకు తల ప్రాణం తోకకు వస్తోంది.

నదీజలాలను ఇలా కలుషితం చేయడం ద్వారా సమాజానికి ఉన్న హక్కులను ఉల్లంఘించినట్లే అవుతుందని తీస్ హజారీ కోర్టు తన తీర్పులో వ్యాఖ్యానించింది. గంగ, యమునా నదులు రెండూ జీవనదులని, అందువల్ల వాటిలోని జీవాన్ని చంపేసే హక్కు ఎవరికీ ఉండబోదని గతంలో ఉత్తరాఖండ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా తీస్ హజారీ కోర్టు ఉటంకించింది.

> **మనదేశంలో జలవనరులను కలుషితం చేస్తున్న వారి సంఖ్యతో పోలిస్తే ఇది చాలాచాలా తక్కువే. అందుకు ప్రధాన కారణం.. తగిన యంత్రాంగం లేకపోవడమే తప్ప చట్టాలు లేకపోవడం కాదు. ఉన్న చట్టాలను పటిష్ఠంగా అమలుచేయడానికి కావల్సినంత మంది సిబ్బంది లేకపోవడం, ఉన్నవాళ్లు సైతం అవినీతికి, అలసత్వానికి అలవాటు పడిపోయి ఉండటంతో నీటిచట్టం ఇన్నాళ్లుగా సరిగా అమలైన పాపాన పోవడం లేదు.ఒకప్పుడు అత్యంత ఆహ్లాదకరంగా ఉండే హుస్సేన్‌సాగర్ పక్క నుంచి వెళ్లాలంటేనే ఎంత దుర్భరంగా ఉంటుందో మనకు తెలుసు. ఇప్పుడు దాన్ని మళ్లీ ప్రక్షాళన చేయడానికి ప్రభుత్వాలకు తల ప్రాణం తోకకు వస్తోంది. నదీజలాలను ఇలా కలుషితం చేయడం ద్వారా సమాజానికి ఉన్న హక్కులను ఉల్లంఘించినట్లే అవుతుందని తీస్ హజారీ కోర్టు తన తీర్పులో వ్యాఖ్యానించింది. గంగ, యమునా నదులు రెండూ జీవనదులని, అందువల్ల వాటిలోని జీవాన్ని చంపేసే హక్కు ఎవరికీ ఉండబోదని గతంలో ఉత్తరాఖండ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా తీస్ హజారీ కోర్టు ఉటంకించింది.**

దేశ పౌరులకు గట్టి సందేశం

సాధారణంగా ఇలాంటి కేసుల్లో శిక్ష పడినవాళ్లు ఎలాగోలా బెయిల్ తెచ్చుకోవడం, మళ్లీ తీర్పును హై కోర్టు లేదా సుప్రీం కోర్టులలో సవాలు చేయడం.. ఆ పేరుతో మళ్లీ బయటకు వచ్చి కాలక్షేపం చేయడం మనం చూస్తూనే ఉన్నాం. కానీ శిక్ష విధించడం ద్వారా కోర్టు భారతీయులందరికీ ఒక్క సందేశాన్ని మాత్రం గట్టిగానే పంపింది. ఎవరూ చూడట్లేదులే.. మనం ఏం చేసినా పర్వాలేదని అనుకోవడం తగదు. నీటి చట్టం అనేది ఒకటుంది. దాన్ని పాటించడం భారతీయులుగా మన బాధ్యత. ఒకవేళ ఎవరైనా ఇలా శుద్ధిచేయని కలుషిత పదార్థాలను జలవనరులలో కలుపుతున్నట్లు గమనిస్తే కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వాళ్లపై నీళ్ల చట్టం కింద కేసులు పెట్టొచ్చు. కావాలంటే ముందుగా ఆయా సంస్థలను మూసేయాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం లేదా, వాళ్లకు విద్యుత్, నీటి సరఫరా నిలిపివేయడం లాంటి చర్యలతో మరింత కాలుష్యం జరగకుండా నివారించవచ్చు. అయితే ఇలా చేయడానికి ముందుగా ఆయా సంస్థలకు పీసీబీ అధికారులు తప్పనిసరిగా షోకాజ్ నోటీసు ఇవ్వాలి. వాళ్ల నుంచి సమాధానం వచ్చిన తర్వాత దాంతో సంతృప్తి చెందకపోతే ఇలా క్లోజర్ నోటీసు ఇచ్చి మూసేయించవచ్చు.

తమకున్న ఇలాంటి అధికారాలను కాలుష్య నియంత్రణ మండళ్లు ఉపయోగించుకోవాలి. ఇంకా అవసరం అనుకుంటే కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు చేసి, వాళ్లను కోర్టుకు లాగొచ్చు. ఇలాంటి కేసులు పరిష్కారం అవడానికి చాలా కాలమే పడుతుంది. పైన పేర్కొన్న కేసులో శిక్ష పడటానికి 17 ఏళ్లకు పైగా సమయం పట్టింది. ఇన్నేళ్లలో ఇంజంక్షన్ ఉత్తర్వుల ప్రకారం ఉత్పత్తి ఆపాలని చెబితే తప్ప యథాతథంగా నీటి కాలుష్యం కొనసాగుతూనే ఉంటుంది. వ్యవస్థలో మార్పు రానంత కాలం చట్టాలు ఇలాంటి వారికి చుట్టాలే అవుతాయి. పౌరులు సైతం తమ సామాజిక బాధ్యతను గుర్తెరిగి.. నదీమ తల్లులను ఇలాంటి కాలుష్యపు చెర బారి నుంచి కాపాడాలి.



ఫ్లెమింగో పండగ

అతిథి పక్షులు

ఆంక్షల్లేని ఆకాశం కింద అతిథి పక్షులు
విశ్వసౌభ్రాతృత్వ సందేశ వాహకులు
ప్రేమ ప్రబంధాలు మోసుకొచ్చిన మహాకవులు
ప్రణయ రహస్యాలెరిగిన మన్మథులు
సంతానవితతీ సంవేదనతో
పరివార పటలి వీడివచ్చిన ప్రేమికులు
విత్తంతైనా విశాల హృదయాలు వీళ్లవి
వొత్తిలేని దీపాల్లాంటివి వీళ్ల కన్నులు
వెలుగు పంచడమే సందేశం
జీవన సందర్శనమే అభివేదం
జీవితం ఒక తపస్సు
జీవితం ఒక ఓజస్సు
జీవితం ఒక ఉషస్సు
జీవితం ఒక యోగం
జీవితం ఒక సృష్టిరాగం
తరం నుంచి తరానికి ప్రాణ పరివేష్టి
ఇహం నుంచి పరానికి పురాణ గోష్టి
జీవితం వొక అఖండ కాల ప్రవాహం!
పక్షులు కాలరాజు ఎగిరేసిన కేతనాలు!!

- పెరుగు రామకృష్ణ

అదివందనం

ఈశాధ్వానుల హిమాలయ యాత్రలా
భక్తి భాజనుల కాశీతీర్థ ప్రయాణంలా
నేలపట్టుకీ వస్తుంటాయి వలసపక్షులు

విశ్వసుందరి పోటీలకు పయనమైన సోయగాల్లా
విశ్వశాంతి చాటే ఆత్మీయ అతిథుల రాయబారుల్లా
పులికాట్ సరస్సు వొడ్డున వాలుతాయి తారాచక్షులు
ప్రేమయాత్రో ఆత్మీయ సంగమ ప్రయాణమో
తను పుట్టిన మట్టిని ముద్దాడతాయి ఫెలికాన్లు
సుదూర తీర ప్రయాణ ప్రయాస తీర్చుకుంటూ ఫ్లెమింగోలు
దండయాత్రకు తరలివచ్చిన సముద్ర సైన్యంలా
నారాయణ పక్షి, నీటికాకి, పాలపిట్ల, కళ్లకంకణాయకి
వంత పాడుతాయి ఎర్రకాళ్ల కొంగ, నీటికొంగ, చెకుముకి పిట్ట

వొకనాడు అలెగ్జాండరు జయించాడు జంబూద్వీపాన్ని
ఈనాడు విదేశీ పక్షులు ముద్దాడుతున్నాయి ఈ నేల పాదాలు
సముద్రాల పైనుండి అలవోకగా కదిలే సైన్యం యిది
కాలంతో పాటు మెదిలే సామూహిక ధైర్యం యిది
వారి ప్రేమయాత్ర బృందావనమేమో ఈ నేలపట్టు
చెట్టుకి ప్రాణమిచ్చిన మట్టికి వందనం
మట్టిని మెత్తగా మలచిన చెట్టుకి వందనం
చెట్టుకీ మట్టికీ వునికి నిచ్చిన సముద్రానికి వందనం
చెట్టు మట్టి సముద్ర త్రయానికి స్థానమిచ్చిన
నేలపట్టుకి వందనం
ఈ పులికాట్‌కి వందనం.

- ఈతకోట సుబ్బారావు

(నెల్లూరు జిల్లాలో నేటి నుంచి 9వ తేదీ వరకు ప్రభుత్వం ఫ్లెమింగో పక్షుల పండుగ నిర్వహిస్తున్న సందర్భంగా)


ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily, D.No. 6-3-864/4/B, SBN Acrade 4th & 5th floor, Green lands, opp. Green park Hotel, Hyderabad, 500016, Telangana.

అది చిల్లుల బిల్లు

ముస్లిం మహిళల వైవాహిక హక్కుల రక్షణ బిల్లు-2017లోని అంశాలు లోపభూయిష్టమని ఇస్లామిక్ అంశాల పరిశోధకులు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు 'ఇస్లామిజం అండ్ కౌంటర్ రాడికలైజేషన్ ఇనిషియేటివ్' పేరిట అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని మధ్యప్రాచ్య మీడియా పరిశోధన సంస్థ నిర్వహిస్తున్న పరిశోధనలో సీనియర్ సభ్య భాగస్వామిగా ఉన్న తుఫైల్ అహ్మద్ వెల్లడించిన అభిప్రాయాలివి...

ఎలాంటి సంవాదం, చర్చ లేకుండానే డిసెంబరు 28న ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. అయితే, రాజ్యసభలో ప్రతిపక్షాలు దీన్ని అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎగువ సభ దీన్ని సంస్కరించాలి. లేదా ప్రస్తుత రూపంలో అది బుట్టదాఖలుకు మాత్రమే అర్హం. 'తలాక్-ఎ-బిద్దత్' (తక్షణ ముమ్మారు తలాక్)పై నిషేధం వల్ల ముస్లిం కుటుంబాలకు నష్టమే తప్ప ప్రయోజనం ఉండదు. తక్షణ ముమ్మారు తలాక్ చెల్లదంటూనే అది అమలులోకి వచ్చినట్లు పరిగణించడమే ఈ బిల్లులోని అతిపెద్ద తప్పిదం. అంతేగాక ముమ్మారు తలాక్ శిక్షార్హనేరం. అంటే- అరెస్టు చేయడానికి వారంట్ అవసరం లేదు. ముస్లిం మహిళే ఫిర్యాదు చేయాలన్న నిబంధన కూడా లేదు. ముస్లిం భర్తపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. దాని ఆధారంగా పోలీసులు అరెస్టు కూడా చేయొచ్చు. ఈ విషయంలో తాజాబిల్లు పూర్తి ఏకపక్షంగా ఉంది. ఇక ఇలా భార్యకు విడాకులిచ్చే భర్త ఆమెకు భరణం ఇవ్వాలన్నది ఈ బిల్లు ప్రతిపాదనలలో ఒకటి. కానీ, ఇతరత్రా పద్ధతుల్లో విడాకులిస్తే భరణం సంగతిని అందులో ప్రస్తావించలేదు. ప్రధానంగా ఓ ముస్లిం మహిళ కోరుట ద్వారా విడాకులు పొందితే భరణం కోరడం గురించి వివరించలేదు. పై గా ఇలా విడాకులు పొందితే భరణం కోరే హక్కు ఉండదని రాజీవ్ గాం.దీ ప్రధానిగా ఉన్నపుడు 1986లో తెచ్చిన 'షాబానో చట్టం' పేర్కొంటోంది. దీన్ని రద్దుచేసే ప్రస్తావన కూడా తాజా బిల్లులో లేదు. అంతే కాకుండా బిల్లులోని అనేక అంశాలపై కొన్ని సమంజస సందేహాలున్నాయి. సెక్యూరిటీ గార్డుగా పనిచేసే ఓ ముస్లిం పురుషుడు నెలకు రూ.10 వేలు ఆర్జిస్తున్నాడని భావిద్దాం. అతడు భార్యకు తక్షణ తలాక్ చెబితే జైలు పాలవుతాడు. అక్కడ అతడు 'ఏడాదికి సంపాదించగలిగేది రూ.8 వేలు' మాత్రమే (బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ జైల్లో ఉండగా ఐదేళ్లలో ఇలా రూ.38 వేలు ఆర్జించాడు). ఈ 'ఏడాది ఆర్జన' (రూ.8 వేలు) మొత్తం ఇచ్చేశాడని భావించినా బాధిత మహిళకు అది ఏ మేరకు ప్రయోజనకరమన్నది అన్నది తొలి ప్రశ్న. ఇక విశ్వవిద్యాలయ లెక్చరర్‌గా పనిచేసే వ్యక్తి రూ.60 వేలు ఆర్జిస్తున్నాడని భావిద్దాం. ఆయన భార్య కూడా అదే ఉద్యోగం లేదా హెచ్చుజీతం లభించే మరేదైనా పని చేస్తున్నట్లయితే ఆమెకు భరణం హేతుబద్ధమేనా అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఒకవేళ ఆమె భరణం కోరినా- రాజ్యాంగ నిబంధన 14 ప్రకారం సమానత్వ ప్రాథమిక హక్కు కింద దాన్ని సవాలుచేసే వీలుంది. హిందూ వివాహ చట్టంకింద ఇటువంటి ఉదంతంలో విద్యాధికురాలైన భార్యకు భరణాన్ని కోర్టులు నిరాకరించాయి. అంతేకాదు... భర్త నిరుద్యోగిగా ఉండి, భార్య ఉద్యోగి అయిన పరిస్థితుల్లో ఆమె చేతనే భరణం ఇప్పించేలా ఆదేశాలిచ్చిన ఉదాహరణలూ ఉన్నాయి.

ముస్లింలలోని అల్పాదాయ వర్గాలలోనే తక్షణ తలాక్ కేసులు ఎక్కువ. చాలామంది పురుషులు మెకానిక్, కూలీ, దర్జీ తదితర వృత్తుల్లో ఉంటారు. వీరు మౌఖికంగా తలాక్ చెబితే భార్య కోర్టులో దాన్ని రుజువు చేయాల్సిరావడం పెద్ద సమస్య. ఇలాంటి సందర్భాల్లో తమకు భర్త తలాక్ చెప్పినట్లు రుజువు చేయడం దాదాపు అసాధ్యం. కానీ, అంతిమంగా అతడు నిర్దోషిగా తేలేవరకూ జైల్లో మగ్గాల్సి వస్తుంది. ఈ విధంగా చూస్తే ముస్లిం పురుషులను జైల్లో వేయడమే తప్ప మహిళలకు సహాయపడటం ఈ బిల్లు ప్రధాన లక్ష్యంగా కనిపించడం లేదు. ఇక తక్షణ ముమ్మారు తలాక్ చెల్లదని సుప్రీం కోర్టు ఆగస్టు 22న ఆదేశాలిచ్చింది. మరి భారత చట్టాల కింద విడాకులే చెల్లుబాటు కానప్పుడు ముస్లిం పురుషులను జైల్లో పెట్టడం ఎలా సమంజసం? పెళ్లి-విడాకులు అన్నది పౌర చట్టం కింద ఉండాలి. ఈ నేపథ్యంలో తాజా బిల్లు ఉద్దేశం మరో గృహహింస చట్టాన్ని సృష్టించడమే అయితే, తలాఖ్ అంశాన్ని 'గృహ హింస చట్టం-2005' కిందకు చేరిస్తే సరిపోతుంది. ఈ బిల్లు ముస్లిం కుటుంబ చట్టానికి సంస్కరణ ఎంతమాత్రం కాబోదు. భర్త ఏకపక్షంగా విడాకులిచ్చే సంప్రదాయాన్ని ఇది పరిగణనలోకి తీసుకోలేదు. ఇది చట్టంగా రూపొందినా ముస్లిం భర్త తన ఏకపక్ష విడాకుల అధికారాన్ని మరో రెండు రూపాల్లో ప్రయోగించే వీలుంది. ఒకటి, అతడు భార్యకు తలాక్ పంపి, అది అమలులోకి వచ్చే 'మూడు నెలల వ్యవధి' ముగిసే దాకా వేచి ఉండవచ్చు. రెండు, నెలకు ఒకటి వంతున మూడు నెలలు విడివిడిగా



తలాక్ పంపి అది అమలులోకి వచ్చేలా చూసుకోవచ్చు. అందువల్ల ఏకపక్ష విడాకులు చెల్లవన్న నిబంధన లేని ఈ బిల్లు సంస్కరణ దిశగా తొలి అడుగు కూడా కాబోదనడంలో సందేహం లేదు.

ఇస్లాం ప్రకారం ముస్లిం పురుషులు విడాకుల కోసం కోర్టులను ఆశ్రయించే వీల్లేదన్నది చాలామంది ముస్లిమేతరులకు తెలియని ప్రధానమైన వాస్తవం. విడాకులు కోరుతూ కోర్టుకెళ్లడం లేదా మత బోధకులు లేదా మత పెద్దలను ఆశ్రయించే అవకాశం మహిళలకు మాత్రమే ఉంది. కాబట్టి పురుషులు కోర్టుకు వెళ్లే వీలుకల్పిస్తూ ఈ చట్టాన్ని రాజ్యసభ సవరించాలి లేదా కొత్త బిల్లు తేవాలి. ట్రిపుల్ తలాఖ్‌పై వాదనల సందర్భంగా ఈ పద్ధతిని న్యాయస్థానం కొట్టేస్తే- ముస్లింలలో 'పెళ్లి-విడాకుల నియంత్రణ'కు ప్రభుత్వం కొత్త చట్టం తెస్తుందని నిరుడు మే 15న అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ కోర్టుకు నివేదించారు. కానీ, లోక్‌సభ ఆమోదించిన బిల్లులో ఈ అంశం లేనేలేదు. సుప్రీం కోర్టుకు ప్రభుత్వం తానిచ్చిన మాటను తానే నిలబెట్టుకోలేదు. ముస్లిం భర్తలు ఏ రూపంలోనైనా ఏకపక్షంగా విడాకులివ్వడాన్ని నిషేధిస్తూ బిల్లుతేవాలి. అలాగే 'మెహర్, హలాలా, బహు భార్యత్వం, ఇద్దరు మహిళల సాక్ష్యం ఒక పురుషుడి సాక్ష్యానికి సమానం, బాలురతో పోలిస్తే బాలికల వారసత్వ హక్కు 50 శాతం, మహిళకు పురుష సంరక్షణ అవశ్యం' వగైరా.. వగైరా సంప్రదాయాలను కూడా నిషేధించాలి.

◆ ఐ. కృష్ణమోహన్

మనం మూవీ+
manammovie
ఆదివారం, 7 జనవరి 2018 | హైదరాబాద్ | 5

ఐదేళ్ల క్రితం వరకు మన హీరోలు సంవత్సరానికో సినిమా చేసేవారు. ఆ సమయంలో పరభాషా చిత్రాలు వచ్చి ఇక్కడ సక్సెస్‌లు సాధించాయి. ఆ హీరోలకు ఇక్కడ మార్కెట్ క్రియేట్ అయ్యింది. కానీ ఇప్పుడు మన హీరోలు వరుస సినిమాలు చేస్తున్నారు. దీంతో వేరే భాషకు చెందిన హీరోల మార్కెట్ కంట్రోల్‌లోకి వచ్చింది. అలా హీరోలు ఎక్కువ సినిమాలు చేయడానికి ముందుకు రావాలని అంటున్నారు నిర్మాత సి.కల్యాణ్. సంక్రాంతికి విడుదలవుతున్న తన సినిమా 'జై సింహా' గురించి, ఇండస్ట్రీలోని ప్రస్తుత పరిస్థితుల గురించి పాత్రికేయులతో ముచ్చటించారు...



టెక్నాలజీ వల్ల వ్యవస్థకు భంగం వాటిల్లకూడదు

– సి.కల్యాణ్

ముందు అనుకున్న కథ వేరు...

రత్నంగారు కాస్త నెగిటివ్ టచ్ ఉన్న హీరో క్యారెక్టర్‌తో ఓ కథను తయారు చేశారు. కానీ నాకు బాలయ్యను నెగిటివ్‌గా చూపించడం ఇష్టం లేదు. అందుకని 'వేరే కథతో సినిమా చేద్దామ'ని రత్నంగారితో అన్నాను. ఆయన సరేనని మంచి ఎమోషనల్ సబ్జెక్ట్‌తో 'జై సింహా' కథ రెడీ చేశారు. తర్వాత బాలయ్యగారిని కలిసి ఆయన కథ చెప్పడం, ఆయనకు నచ్చడంతో సినిమా ప్రారంభమైంది.

దాని కంటే ముందుగానే..

మా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలో ఇప్పటికే మూడు సినిమాలు చేశాం. వినాయక్, సాయిధరమ్‌తో నాలుగో సినిమాగా 'ఇంటెలిజెంట్' చేస్తున్నాం. ఐదో సినిమా 'జై సింహా' 'ఇంటెలిజెంట్' కంటే ముందుగా, సంక్రాంతికి జనవరి 12న విడుదలవుతుంది. ఈ చిత్రం మంచి సక్సెస్ సాధిస్తుందని నమ్మకంగా ఉన్నాం.



ఆన్‌లైన్‌లో సినిమాలు..

సినిమా విడుదలైన వారం రోజుల్లోనే సినిమాలు అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్‌ల్లో సినిమా అందుబాటులోకి వచ్చేస్తుంది. నిజానికి సదరు సంస్థలకు పలు వ్యాపారాలుంటాయి. అలాంటి వ్యాపారాల్లో సినిమాలు కూడా ఒకటి. అంతే తప్ప వారికి పెద్దగా ఒరిగేదేమి ఉండదు. ఇప్పుడు సినిమా విడుదలైన వారం పది రోజులకు ఆన్‌లైన్‌లో సినిమా దొరుకుతుంది. రేపు సినిమా విడుదలైన రోజే ఆన్‌లైన్‌లో అధికారికంగా సినిమా అందుబాటులోకి వచ్చేస్తుంది. దాంతో ప్రేక్షకుడు ఆన్‌లైన్‌లోనే సినిమా చూడటానికి ఆసక్తిని చూపుతాడు. ఇలాంటి వాటి వల్ల ఓ రకంగా నిర్మాతకే నష్టం వాటిల్లుతుంది.

వాళ్లు ఒప్పకోకుంటే..

'జై సింహా'లో నయనతార, ప్రకాష్‌రాజ్ పాత్రలు కూడా చాలా కీలకం. కథ రాసుకున్నప్పుడే ఆ రెండు క్యారెక్టర్స్‌కు వారిద్దరైతేనే న్యాయం చేస్తారని..వారిద్దరూ సినిమా చేయమంటే ఈ సినిమా చేయకూడదని అనుకున్నాం. ముందు ప్రకాష్ రాజ్‌ని అడిగితే తన దగ్గర డేట్స్ లేవన్నారు. అయితే 'వీడు సామాన్యుడు కాదు'తో నేను ప్రకాష్‌రాజ్‌ని హీరోగా ఇంట్రడ్యూస్ చేశాననే అభిమానంతో ఈ సినిమాలో నటించారు. డైరెక్టర్ రవికుమార్ కథని ఫోన్‌లో ప్రకాష్‌రాజ్‌కి చెప్పడంతో వెంటనే ఫ్లైట్‌లో వచ్చి డైరెక్టర్‌ని కలిసి పూర్తి కథ విన్నారు. సినిమా చేస్తానని చెప్పి లుక్ పరంగా, కాస్ట్యూమ్స్ పరంగా చాలా కేర్ తీసుకుని నటించారు ప్రకాష్‌రాజ్. అలాగే నయనతార కూడా ముందుగా డేట్స్ లేవనే అంది. అయితే కథ విని నచ్చడంతో సినిమా చేయడానికి అంగీకరించింది. సెకండ్ హీరోయిన్‌గా ముందు వేరే అమ్మాయిని అనుకున్నాం. కానీ కొన్ని కారణాలతో హరిప్రియను సెలెక్ట్ చేశాం. అలాగే నటాషా దోషి ఇందులో ఎన్నారై పాత్రలో నటించింది.

తమిళంలో రీమేక్..

'జై సింహా' తమిళ డబ్బింగ్ రైట్స్ కావాలని చాలా మంది అడిగారు. కానీ డైరెక్టర్ కె.ఎస్.రవికుమార్‌గారు 'తమిళంలో ఈ సినిమాను స్టార్ హీరోతో చేద్దామనుకుంటున్నాను. కాబట్టి కొన్ని రోజులు ఆగండి' అని అన్నారు. అన్ని కుదిరితే ఈ చిత్రాన్ని తమిళంలో కూడా నేనే నిర్మిస్తాను.



యువ కథానాయకులకు పోటీగా..

డైరెక్టర్ కె.ఎస్.రవికుమార్‌గారు సినిమాను చాలా చక్కగా తెరకెక్కించారు. ఎమోషన్స్ కలగలిసిన డ్రామాగా సినిమా ఆద్యంతం ప్రేక్షకులను మెప్పిస్తుంది. అలాగే చిరంతన్ భట్ సంగీతం, సి.రాంప్రసాద్ సినిమాటోగ్రఫీ సహా అన్ని చాలా చక్కగా కుదిరాయి. ముఖ్యంగా డాన్సుల విషయానికి వస్తే గత ఏడెనిమిది సినిమాల్లో చేయనటువంటి .. ఇప్పుడున్న యంగ్ హీరోస్‌కి ఏమాత్రం తీసిపోనివిధంగా డ్యాన్స్ చేశారు బాలయ్య. ఈయన చాలా సినిమాలు సంక్రాంతి హిట్స్‌గా నిలిచాయి. ఆ రేంజ్‌లో మా 'జైసింహా' సినిమా ఉంటుంది.



బడ్జెట్ పెరిగిన మాట వాస్తవమే..

ఈ సినిమా ప్రారంభంలో అనుకున్న బడ్జెట్ వేరు. కానీ అనుకున్నదానికన్నా సినిమాకి ఎక్కువ బడ్జెట్ అయిన మాట వాస్తవమే. అయితే మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాకూడదనుకున్నాను. ఉదాహరణకు కుంభకోణంలో 2000 మంది పురోహితుల సమక్షంలో ఒక ధర్నా ఎపిసోడ్ చిత్రీకరించాం. ప్రతి మహిళ ఇలాంటి ప్రేమికుడు, ఇలాంటి మొగుడు వుంటే బాగుండు అనుకునేలా సినిమా ఉంటుంది.

మార్చి 1న బంద్..

క్యూబ్, యు.ఎఫ్.ఒ పై పోరాడాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగా మార్చి 1న సౌతిండియా ఫిల్మ్ ఇండస్ట్రీ మొత్తం బంద్ చేయాలని నిర్మాతలందరం కలిసి గట్టి నిర్ణయం తీసుకున్నాం. ఆరోజున థియేటర్లు, షూటింగ్స్ అన్నీ బంద్ చేస్తున్నాం. ఈ విషయం నాలుగు నెలల ముందే అందరికీ చెప్పడం జరిగింది. క్యూబ్, యు.ఎఫ్.ఒ డిజిటల్ సిస్టం మారాలి. రేట్స్ తగ్గించాలి. దానిపైనే మా పోరాటం. ఈ విషయంలో గ్యారెంటీగా సక్సెస్ అవుతాం. ఇప్పుడు క్యూబ్, యు.ఎఫ్.ఒలు ఒకటయ్యారు. ఎవరైనా కొత్త టెక్నాలజీతో ముందుకొస్తుంటే ఆ సంస్థలు ఒప్పుకోవడం లేదు. టెక్నాలజీ రావడంలో తప్పులేదు కానీ దాని వల్ల వ్యవస్థకు భంగం వాటిల్ల కూడదు. పెద్ద నిర్మాతల కంటే చిన్న నిర్మాతలే క్యూబ్, యు.ఎఫ్.ఒలను బ్రతికిస్తున్నారు. చివరకు కష్టాలు కూడా చిన్న నిర్మాతలే ఫేస్ చేస్తున్నారు. కాబట్టి చిన్న నిర్మాతలు ముందుకొచ్చి సినిమాలు తీయడం ఆపేస్తే..సమస్యతో ఇబ్బంది పెడుతున్నవారే దారికొస్తారు.

ఇంటెలిజెంట్‌గా..

వినాయక్, దిల్ రాజు కాంబినేషన్‌లో 'దిల్' సినిమా ఎంతటి పెద్ద హిట్ అయ్యిందో తెలిసిందే. అలా వినాయక్‌సాయిధరమ్ తేజ్‌ల 'ఇంటెలిజెంట్' నాకు నిర్మాతగా అంత పేరు తెస్తుంది. మ్యూజిక్, యాక్షన్, ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ చిత్రం వుంటుంది. చిరంజీవిగారికి 'ఖైది' ఎలాగో సాయిధరమ్ 'ఇంటెలిజెంట్' అలాంటి ఇమేజ్ తెస్తుంది. ప్రస్తుతం క్లైమాక్స్ షూటి ంగ్ జరుగుతోంది. జనవరి 10తో షూటింగ్ కంప్లీట్ అవుతుంది. మూడు సాంగ్స్‌లో ఒకటి పబ్, ఒకటి డ్యూయెట్ సాంగ్ ఉంది. వీటి కోసం కోటిన్నర రూపాయల ఖర్చుతో మూడు ఫ్లోర్లలో భారీ సెట్స్ వేస్తున్నాం. జనవరి నెలాఖరుకు సెన్సార్ పూర్తి చేసి, ఫిబ్రవరి 9న చిత్రాన్ని పక్కాగా రిలీజ్ చేయబోతున్నాం.

నిర్మాతగా బిజీ బిజీ..


ఎప్పటి నుండో చేద్దామని అనుకున్న సినిమాలన్నీ అటు ఇటుగా మారి ఈ ఏడాది వచ్చి చేరాయి. అందుకే ఈ ఏడాది నిర్మాతగా నేను బిజీగా కనపడుతున్నాను. తదుపరి నా బ్యానర్‌లో రానా, రెజీనా కాంబినేషన్‌లో బ్రహ్మానందం, సప్తగిరి, నాజర్, సత్యరాజ్ ముఖ్యపాత్రధారులుగా '1945' సినిమా చేయబోతున్నాను. శివ దర్శకుడు. ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో చేస్తున్నాం. తెలుగు వెర్షన్‌కు నేను నిర్మాత..హిందీలో రానా, తమిళంలో కె ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నారు. ఈ వేసవికి సినిమాను రిలీజ్ చేయాలని అనుకుంటున్నాం. అలాగే భారీ బడ్జెట్‌తో 'సంఘమిత్ర' చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించి ఆర్.ఎఫ్.సిలో వర్క్ జరుగుతోంది. మా 'లోఫర్' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన దిశా పటానిని హీరోయిన్‌గా అనుకుంటున్నాం. ఇంకా ఫైనలైజ్ కాలేదు.





అందుకే థియేటర్స్ సమస్య..

డిజిటల్ సిస్టమ్ వచ్చిన తర్వాత సినిమా రన్నింగ్ స్క్రీన్స్ పెరిగిపోతున్నాయి.థియేటర్స్ యాజమాన్యం కూడా పెద్ద సినిమాల వైపే మొగ్గు చూపుతున్నాయి. మరో పక్క పెద్ద సినిమాలను ఎక్కువ స్క్రీన్స్‌లో విడుదల చేయడానికి ముఖ్య కారణం పైరసీ. సినిమాలు మాగ్జిమమ్ రెండు వారాలు మాత్రమే ఆడుతున్నాయి. కాబట్టి పెద్ద సినిమా నిర్మాతలు ఎక్కువ స్క్రీన్స్‌లో సినిమాను విడుదల చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. అందువల్ల చిన్న సినిమాలకు థియేటర్స్ దొరకడం లేదు. ముందు పైరసీని అడ్డుకుంటే చాలా సమస్యలు తీరుతాయి.



19 చుక్కలు ఒకటి వద్ద నిలిపితే వచ్చే ఈ అందమైన రంగవల్లిక బోగినాడు మీ ఇంటికి మరింత కళ తెస్తుంది. ముత్యాల ముగ్గుతోపాటు చుట్టూ ఉన్న బార్డర్ తో మీ ముగ్గుకు మరింత అందమొస్తుంది. చూడచక్కని కాంబినేషన్లు కనిపించేలా రంగులతో ఈ ముగ్గును నింపితే సరి.

జిఎస్‌టి మనకు సరిపడదు..

కార్పొరేట్ ఆఫీసులుండి నాలుగైదు వ్యాపారాలు చేసుకునే పారిశ్రామిక వేత్తలకు జి.ఎస్.టి చెల్లు బాటు అవుతుంది. కానీ సినిమా పరిశ్రమకు చెల్లుబాటు కాదు. ఉత్తరాదిన కార్పొరేట్ సంస్థలు సినిమా నిర్మాణ రంగంలో ఉండటం వల్ల వారికి ఏమీ కాదు. వారి మార్కెట్ కూడా మన కంటే చాలా పెద్దది. ఇక మన విషయానికి వస్తే మన దగ్గర రెగ్యులర్ ప్రొడ్యూసర్సే ఎక్కువగా ఉంటారు. మనపై జిఎస్‌టి ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. కాబట్టి అందరూ కూర్చొనే మాట్లాడుకోవాలి. అప్పుడే సమస్య పరిష్కారం అవుతుంది.





ఫిబ్రవరి 15లోగా మిడ్‌మానేరు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వాసితుల నష్టపరిహారం, పునరావాస కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. మిడ్ మానేరు భూనిర్వాసితుల నష్టపరిహారం కోసం తప్పుడు అఫిడవిట్లు సమర్పించిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు ఆదేశించారు. అలాంటి అఫిడవిట్లు జారీచేసిన మండల అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. నిర్వాసితుల నష్టపరిహారం చెల్లింపుల సందర్భంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ఫిజికల్‌గా వెరిఫై చేయాలని కోరారు. ముంపునకు గురయ్యే స్ట్రక్చర్ల అంచనాలు రూపొందించడంలో అవకతవకలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్పిల్ వే పనుల పురోగతి..

మిడ్ మానేరు స్పిల్ వే పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. 25 గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులు, బిగింపు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. రివిట్ మెంట్ పనులుకూడా వేగంగా జరుగుతున్నాయని, 24 గేట్ల ఫ్యాబ్రికేషన్ కూడా పూర్తయిందని ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని ఆర్ అండ్ ఆర్ పనులను వేగవంతం చేయాలని హరీశ్ రావు ఆదేశించారు. మిడ్ మానేరులో భాగంగా నిర్వాసితులైన వారికి స్ట్రక్చర్ల నష్టపరిహారం కింద 40 కోట్లు, వారి రీ సెటిల్మెంట్, రిహాబిలేషన్ కోసం మరో 25 కోట్లు మంజూరు చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని మంత్రి కోరారు. ఇప్పటి వరకు ఆర్ అండ్ ఆర్ కింద 1200 కోట్లు చెల్లించినట్టు మంత్రి హరీశ్ రావు తెలియజేశారు. మిడ్ మానేరు కింద ముంపునకు గురవుతున్న 7419 ఇండ్లలో ఇప్పటికే 3 వేలకు పైగా ఇండ్లు నిర్మించి ఇచ్చినట్టు సిరిసిల్ల రాజన్న జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ మంత్రికి వివరించారు. మరో 1500 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నట్టు కలెక్టర్ చెప్పారు. మిగతావాటిని కూడా త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. మొత్తంగా కూల్చిన 7419 ఇండ్లకుగానూ 7159 ఇండ్లకు పరిహారం చెల్లించినట్లు మంత్రి వివరించారు. మిగతా 260 ఇండ్ల పరిహారాన్ని వారంలో చెల్లించాలని కలెక్టర్‌కు సూచించారు.

మిడ్ మానేరుకు సంబంధించిన మొత్తం ఆర్ అండ్ ఆర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. మిడ్ మానేరు రికార్డు వ్యవధిలో పూర్తిచేసినా ఆర్ అండ్ ఆర్ సమస్యలు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఆర్ అండ్ ఆర్ పనులలో జాప్యం చేసినా, అలక్ష్యం చేసినా సహించేదిలేదని మంత్రి హెచ్చరించారు.. మిడ్ మానేరు కింద ముంపునకు గురికానున్న గ్రామాల్లో పరిస్థితిని మంత్రి సమీక్షించారు. కొన్నిచోట్ల ప్రజలు ఇంకా ఖాళీ చేయలేదని అధికారులు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పనులను సమీక్షిస్తున్నారని చెప్పారు. మిడ్ మానేరు పరిధిలో ముంపునకు గురయ్యే చింతల్ ఠాణా, కొదురుపాక, శాబాసుపల్లి, కొడి ముంజ, చీర్లవంచ, అనుపురం, ఆరేపల్లి, సంకేపల్లి, రుద్రవరం, వరదవెల్లి గ్రామాల నిర్వాసితులకు ఇప్పటివరకు జరిగిన పరిహారం చెల్లింపులను మంత్రి హరీశ్ రావు సమీక్షించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో 12 గ్రామాలకు చెందిన నిరాశ్రయులైన కుటుంబాలకు పరిహారం చెల్లింపులు వెంటనే జరపాలని కలెక్టర్ కృష్ణ భాస్కర్, జేసీ యాస్మిన్ బాషాకు మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. 13 ఆర్ అండ్ ఆర్ కాలనీలలోనూ యుద్ధ ప్రాతిపదికన కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కొన్నిచోట్ల పెండింగ్‌లో ఉన్న రోడ్లు నిర్మించాలని మంత్రి హరీశ్ రావు కోరారు. నిర్వాసితుల ఇళ్ళకు ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద నిధులు మంజూరు చేయాలని హౌసింగ్ ఎం.డి.చిత్రా రామచంద్రన్ ను మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జోషి, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వికాసరాజ్, కలెక్టర్ కృష్ణ భాస్కర్, జె.సి.యాస్మిన్ బాషా, ఇ.ఎన్.సి.మురళీధరరావు, సి.ఈ లు అనిల్, ఓ.ఎస్.డి.దేశ్ పాండే పాల్గొన్నారు.

పదేళ్లలో 50 శాతం.. మూడేళ్లలో మిగతా పనులు..

ఈ ప్రాజెక్టును 2006లో ప్రారంభించగా పదేళ్ళలో యాభై శాతం పనులు పూర్తి అయితే మిగతా యాభై శాతం పనులు 12 నెలల్లో పూర్తిచేసి రికార్డు నెలకొల్పారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో మొత్తం కాంక్రీటు వర్కు 4.8లక్షల క్యూబిక్ మీటర్లు పదేళ్లలో 65 వేల 200 క్యూబిక్ మీటర్లు పనిచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత 3.49 లక్షల క్యూబిక్ మీటర్లు కాంక్రీటు పనులు జరిగాయి. గత పన్నెండు నెలల్లో 1.30 లక్షల క్యూబిక్ మీటర్లు కాంక్రీటు పనులు జరిగాయి.

అంచనా వ్యయం 639 కోట్లు

మిడ్ మానేరు ప్రాజెక్టు అంచనా వ్యయం 639 కోట్లు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు దాదాపు పదకొండేళ్లలో 107 కోట్లు ఖర్చు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 358 కోట్లు ఖర్చు చేయగా గత 12 నెలల్లోనే 251 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అలాగే ఎం.ఎం.ఆర్‌లో మొత్తం ఎర్త్ వర్కు 1.28 కోట్ల క్యూబిక్ మీటర్లు జరగవలసి ఉండగా 80 లక్షల క్యూబిక్ మీటర్ల ఎర్త్ వర్క్స్ మూడేళ్లలో జరిగాయి. గత 12 నెలల్లోనే 59 లక్షల క్యూబిక్ మీటర్లు ఎర్త్ వర్కు జరిగింది. అంతకుముందు పదేళ్లలో కేవలం 41 లక్షల క్యూబిక్ మీటర్ల పనిమాత్రమే పూర్తయింది.

పనులు వేగవంతం చేయాలి

చనాకా – కొరటా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతుండటంతో నీటి పారుదల శాఖ అధికారులు, ఏజెన్సీల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి రోజూ 1000 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు జరగని పక్షంలో ఏజెన్సీని మార్చేస్తామని హెచ్చరించారు. చనాకా – కొరటా పనులపైనా ఆయన జలసౌధలో సమీక్షించారు. 15 రోజులలో పనుల పురోగతి లేకపోతే సంబంధిత ఏజెన్సీలపై అగ్రిమెంటు క్లాజు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చనాకా –కొరటా బ్యారేజి, పంపు హౌజ్, గ్రావిటీ కెనాల్, సబ్ స్టేషన్లు, టవర్ల నిర్మాణం, గేట్ల బిగింపు లాంట పనులపై ఆయన సమీక్షించారు. ఈ ప్రాజెక్టు పనులు అనుకున్నంత వేగంగా జరగకపోవడం పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి నెలాఖరులోపు బ్యారేజి పియర్స్‌ను బ్రిడ్జి లెవల్ వరకు లేపాలని, ఈ లోగా గేట్ల తయారీ పూర్తి చేయాలన్నారు. వెనువెంటనే గేట్లను బిగించాలని కోరారు. జనవరి 15 లోపు సర్జ్ పూల్ డిజైను, డెలివరీ సిస్టమ్, ప్రెజర్ పైపులైను వ్యాలీ క్రాసింగు డిజైన్లను పూర్తి చేయాలని సి.డి.ఓ. సీఈని ఆదేశించారు. మిగిలిన పైపులైను నిర్మాణాన్ని మార్చి చివరిలోగా పూర్తి చేయాలని హరీశ్‌రావు కోరారు. పవర్ లైన్స్ ఏర్పాటుకు 11 ప్రాంతాల్లో భూయజమానులతో ఇబ్బందులు ఉన్నట్టు ట్రాన్స్ కో డైరెక్టర్ సూర్యప్రకాశరావు మంత్రికి తెలిపారు. దీనిపై ఆదిలాబాద్ జిల్లా మంత్రి జోగు రామన్నతో హరీశ్ రావు ఫోన్‌లో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

రంగు పడింది!



నెరిసిన జుట్టుతో నలుగురిలోకి రావడం కాస్తంత ఇబ్బందికరమే. కానీ హెయిర్ డైల మీదే ఆధారపడితే మాత్రం వాటి దుష్ప్రభావాలతో ఆరోగ్య సమస్యలు తప్పవు. ఒంటికి గానీ, జుట్టుకు గానీ రంగును కలిగించేది మెలనిన్ అనే పదార్థం. అది తగ్గితే జుట్టు తెల్లగా మారుతుంది. ఒంట్లో మెలనిన్ ఉత్పత్తి తగినంతగా ఉండాలంటే.. లేత సూర్యకిరణాలు తగలాలి. అయితే ఇప్పుడు చాలామందివి షిఫ్టు ఉద్యోగాలు కావడంతో ఆ అవకాశమే ఉండటం లేదు. అందుకే 20లలోనే తెల్ల వెంట్రుకలు కనిపిస్తున్నాయి. ఇలా చిన్నవయసులో జుట్టు నెరిసిపోవడాన్ని వైద్య పరిభాషలో 'ప్రీ మెచ్యూర్ గ్రేయింగ్ ఆఫ్ హెయిర్' అంటారు. రసాయనాల పాళ్లు అధికంగా ఉన్న షాంపూలు, హెయిర్ డైలు, కండిషనర్లు, సమతుల ఆహారమైన ఆకుకూరలు, బీకాంప్లెక్స్, జింకు, సిలేనియం వంటి పోషకాలు తగ్గడం, మానసిక ఒత్తిళ్ల వల్ల కూడా జుట్టు తెల్లబడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

(మనం సెంట్రల్ డెస్క్)

చిన్న వయసులోనే తెల్ల జుట్టు

వైట్ డై పెద్ద ట్రెండ్

వైట్ హెయిర్ డై కూడా ఉందని మీకు తెలుసా? ఇటీవలి కాలంలో వివిధ రంగుల్లో కనిపిస్తున్న డైల్లో, యువతను విపరీతంగా ఆకట్టుకుంటున్న ఈ వైట్ డైకి పాశ్చాత్య దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మన బాలీవుడ్ సెలబ్రిటీలకు కూడా ఈ వైట్ హెయిర్ డై ఫ్యాషన్ పిచ్చి పట్టుకుంది. కాబట్టి మీ తల నెరుస్తుంటే అదికూడా ఓ స్టైల్ అనుకునే ప్రయత్నం చేసి చూడండి. హీరో అజిత్ లాంటివాళ్లు తెల్ల జుట్టుతో పెద్ద ట్రెండే సృష్టిస్తున్నారు. తెలుగులో జగపతిబాబు కూడా తెల్లజుట్టుతో క్యారెక్టర్లు పోషిస్తూ.. సెకండ్ ఇన్నింగ్స్‌లో చెలరేగిపోతున్నారు. కాబట్టి వీరిని ఫాలో అయ్యే ప్రయత్నం చేస్తే మరీ మంచిది.

డైలో ఏముంటుంది?

సాధారణంగా ఏ బ్రాండు హెయిర్ డై అయినా వాటిలో ఉండేవి పీపీడీ (పారాఫినైల్‌డైమైన్), హైడ్రోజెన్ పెరాక్సైడ్, అమోనియా, పారాబెన్స్, లెడ్ అసిటేట్, రెసార్సినల్ లాంటి రసాయనాలే. కాకపోతే కొన్ని డైలలో మాత్రం అమోనియా తక్కువ పాళ్లలో ఉండటం లేదా అసలు లేకుండా ఉంటుంది. టెంపరరీ డైలు.. షాంపూలు, స్ప్రేల రూపంలో లభిస్తున్నాయి. రెండుమూడు సార్లు తలస్నానం చేస్తే ఈ రంగు పోతుంది. వీటిలో అతి తక్కువశాతం రసాయనాలుంటాయి కనుక ఇవి పెద్ద ప్రమాదకరం కాదు. సెమీ పర్మనెంట్ డైలు 5–10 సార్లు తలస్నానం చేస్తే కొట్టుకుపోయే రంగు కావడంతో కాస్త ఎక్కువగానే కెమికల్స్ ఇందులో ఉంటాయి. జుట్టు కుదుళ్లలోకి పోయి, ఎక్కువకాలం మీ జుట్టును అంటిపెట్టుకుని ఉండే కృత్రిమమైన నలుపురంగు డైలను... పర్మినెంట్ హెయిర్ డైలంటారు. వీటిలో అత్యధికంగా రసాయనాలు ఉండటం వల్ల వీటి దుష్ప్రభావం చాలా ఎక్కువగా ఉండే ప్రమాదముంది. కాబట్టి వీటిలో ఏ డై వాడాలో మీరే నిర్ణయించుకోండి.

సైడ్ ఎఫెక్ట్స్ ఇవే..

జుట్టుకు తరచు రంగు వేసేవారు దీంతో సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయన్న విషయాన్ని తెలుసుకుని తీరాలి. వీటిని వాడటం వల్ల జుట్టు, చర్మ సంబంధిత వ్యాధులు తలెత్తే ప్రమాదమున్నందున దీనిపై అవగాహన పెంచుకోవడం అత్యవసరం. మిగతా కాస్మెటిక్స్‌లానే జుట్టుకు వేసే రంగులతో కేన్సర్ వచ్చే ప్రమాదమున్నట్టు వైద్యులు హెచ్చరిస్తున్నారు. డై ఉపయోగించినప్పుడు ఎక్కువగా జుట్టు రాలడం, ఊపిరితిత్తుల్లో ఇరిటేషన్, ఇతరత్రా ఎలర్జీలు, తలపై దురదలు, గొంతులో గరగర, చర్మం రంగు మారడం (పిగ్మెంటేషన్ వంటివి), ముఖం, మెడ దగ్గర చర్మం ఎర్రబడటం, దద్దుర్లు రావడం, కళ్లు దురద పుట్టి వాటిలోంచి నీరు కారడం, జుట్టు పొడిబారి జీవం లేకుండా పోవడం.... ఇలాంటి మార్పులు ఏమైనా గమనిస్తే... మీరు వాడుతున్న హెయిర్ డై వల్ల సమస్యలు వస్తున్నాయని గుర్తించండి. డైలోని పీపీడీతోనే అలర్జీలన్నీ వస్తాయి.

ప్రత్యామ్నాయాలూ ఉన్నాయి...

ప్రకృతిసిద్ధమైన హెన్నాతో జుట్టుకు పోషకాలు లభిస్తాయి. కండిషనర్‌గా కూడా పనిచేసే హెన్నాతో వెంట్రుకలకు సరికొత్త జీవం లభిస్తుంది. తక్కువ ధరకే లభించే ఈ హెన్నాను ఇంట్లోనే తయారుచేసి, రెగ్యులర్‌గా వాడితే తెల్ల జుట్టు సమస్య చాలావరకు తీరినట్టే. సమపాళ్లలో తేనె, నిమ్మరసాన్ని తీసుకుని తలకు పట్టిస్తే జుట్టు రంగు సరికొత్తగా అందంగా కనిపిస్తుంది. కాఫీ పొడి పిప్పిని, టీ పొడిని తలకు పట్టించి, ఆరాక తలస్నానం చేస్తూ పోతే ఇది తరచూ చేస్తూనే ఉండాలి. బీట్‌రూట్ జ్యూస్ తీసి జుట్టుకు పట్టిస్తే, కాపర్ రెడ్‌లో మీ జుట్టు మెరిసిపోతుంది. బ్లాక్ వాల్‌నట్స్‌ను నీళ్లలో 20 నిమిషాలపాటు బాగా ఉడికించి, చల్లబడ్డాక మీరు తలకు రాసుకునే నూనెలో కలుపండి. తల స్నానానికి కొన్ని గంటల ముందు దీన్ని రాసుకుంటే ఫలితం మీకు నిగనిగలాడే నల్లని జుట్టు సొంతమవుతుంది!



జాగ్రత్తలు తప్పనిసరి

హెయిర్ డైలతో కేన్సర్ వస్తుందని పూర్తిస్థాయిలో రుజువు కాకున్నా... ఇది కేన్సర్‌కు దారి తీస్తుందని మాత్రం శాస్త్రవేత్తలు కచ్చితంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డైల విషయంలో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

- హెయిర్ డై వేసేవారు తప్పనిసరిగా చేతులకు గ్లోవ్స్ ధరించాలి
- మీరు వాడుతున్న డైలో కెమికల్స్ అతితక్కువగా ఉండేలా ఎంచుకోండి
- ఇందుకు ఎక్కువగా టెంపరరీ లేక సెమీ–పర్మినెంట్ డైలవైపే మొగ్గుచూపండి
- వయసు మరీ పెద్దగా ఉంటే డై జోలికి పోకపోతే అన్ని విధాలా మంచిది
- సహజసిద్ధంగా తయారైన హెర్బల్ డైల వైపే మొగ్గుచూపడం అత్యుత్తమం
- కేన్సర్ లక్షణాలున్నవారు డైలకు శాశ్వతంగా దూరంగా ఉండాలి
- పొరపాటున కూడా మీ కనుబొమలకు, ఐ ల్యాష్‌లకు డై వేయకండి
- చిన్నవయసులోనే తెల్ల జుట్టు వస్తే, దీనికి కారణాలు ఏమిటో వైద్యుడిని సంప్రదించి తెలుసుకోండి. ఒకవేళ సమతుల ఆహారలేమితో వస్తే.. తగిన తిండి తింటే ఈ సమస్యను అధిగమించవచ్చు
- బ్లీచింగ్ కూడా కొంతవరకు సురక్షితమైన మార్గం,ఆక్సిడేషన్ ద్వారా సహజమైన మీ జుట్టు రంగును తగ్గించడమే బ్లీచింగ్. కానీ పదేపదే బ్లీచ్ చేయడంతో జుట్టు దెబ్బతినే ప్రమాదముంది
- గర్భిణులు ఎటువంటి బ్లీచ్‌లు, డైలు అస్సలు వేసుకోకూడదు. కడుపులోని శిశువుకు ఇది ప్రాణాంతకం
- హెయిర్ డైలోని పర్సల్ఫేట్స్, ఆస్తమా ఉన్నవారికి ప్రమాదకరం. శ్వాస సమస్యలతోపాటు దగ్గు, లంగ్ ఇన్‌ఫ్లమేషన్ కూడా వీరిలో తీవ్రమవుతుంది.

నూనె... తలస్నానం ఏవీ

ఇటీవలి కాలంలో అసలు ఎవరూ తలకు నూనె పెట్టుకోవడం లేదని, అలాగే తల స్నానాలకు కూడా షాంపూలు తప్ప ఇతర ఉత్పత్తులేవీ వాడటం లేదని హైదరాబాద్ నగరానికి చెందిన బ్యుటీషియన్ ఉషా రాణి తెలిపారు. శీకాకాయ పౌడర్ గానీ, కుంకుడు కాయల రసంతో గానీ తలంటు పోసుకుంటే జుట్టు ఆరోగ్యవంతంగా ఉంటుందని, త్వరగా రాలడం.. తెల్లబడటం లాంటి సమస్యలు కూడా ఉండవని ఆమె వివరించారు. తన వద్దకు వచ్చే కస్టమర్లకు కూడా డై వద్దని ఎంత చెప్పినా వాళ్లు తమకు తక్షణం రంగు కావాలని పట్టుబడతారన్నారు. అందుకే తప్పనిసరిగా తాము కూడా వాళ్లకు డైలు వాడాల్సి వస్తోందని చెప్పారు. కొద్దిపాటి సంరక్షణ తీసుకుంటే జుట్టు నల్లగా నిగనిగలాడటంతో పాటు ఆరోగ్యవంతంగా కూడా ఉంటుందన్నారు.

లాలూకు జైలు



(మొదటి పేజీ తరువాయి)

మరికొందరిని న్యాయస్థానం దోషులుగా తేల్చింది. దీంతో పోలీసులు ఆయనను వెంటనే అరెస్ట్ చేసి జార్ఖండ్‌లోని బిర్సాముండా జైలుకు తరలించారు. అటుపైన లాలూసహా మరో ఐదుగురు దోషులకు శిక్ష ఖరారుపై వాదనలు శుక్రవారంతో ముగిశాయి. లాలూ 70 ఏళ్ల వయోభారం, అనారోగ్యం దృష్ట్యా తక్కువ శిక్ష విధించాలని ఆయన తరపు న్యాయవాది విజ్ఞప్తి చేయడం గమనార్హం. వాస్తవానికి లాలూకు కోర్టు ఏడేళ్ల శిక్ష విధించింది. అంటే... దాణా కుంభకోణం కేసులో భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ల కింద మూడున్నరేళ్ల శిక్ష, రూ.5 లక్షల జరిమానా పడింది. దీంతోపాటు అవినీతి నిరోధక చట్టం (పీసీఏ) కింద మరో మూడున్నరేళ్ల శిక్ష, రూ.5 లక్షల జరిమానా వేసింది. అయితే, ఈ రెండు శిక్షలూ ఏకకాలంలో అనుభవించాలని, జరిమానాగా మొత్తం రూ.10 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. అందువల్ల ఈ కేసులో మూడున్నరేళ్ల శిక్షాకాలం ముగిశాక ఆయన బయటపడవచ్చు. కాగా, ఇంతకుముందు 2013 సెప్టెంబరు 30న తొలి కేసులో లాలూకు ఐదేళ్ల కారాగార శిక్ష పడింది. అప్పట్లో అరెస్టయిన ఆయన, సుప్రీం కోర్టు బెయిల్ ఇవ్వడంతో బయటపడ్డారు. ఇప్పుడు తాజాగా రెండో కేసులో శిక్ష పడిన నేపథ్యంలో ఈ తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని లాలూ కుమారుడు తేజస్వి యాదవ్‌తోపాటు వారి తరపు న్యాయవాది ప్రకటించారు. కాగా, దాణా కుంభకోణం కేసులలో విచారణ చేపట్టాలని 1996లో పట్నా హైకోర్టు ఆదేశించింది. దీంతో 1997 అక్టోబరు 27న దేవ్‌గఢ్ ఖజానా నుంచి డబ్బు డ్రా చేయడంపై 38 మందిమీద అభియోగపత్రం దాఖలైంది. వీరిలో 11 మంది మరణించగా, మరో ముగ్గురు సాక్షులుగా మారారు. ఇద్దరు నేరాన్ని అంగీకరించడంతో 2006–07లో సీబీఐ ప్రత్యేక కోర్టు శిక్ష విధించింది. ఇక 1990 తొలినాళ్లలో చాయిబాసా ఖజానా నుంచి రూ.37.7 కోట్లు అక్రమంగా డ్రా చేసిన కేసులో 2013 సెప్టెంబరు 30న లాలూతోపాటు మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా తదితరులపై దోషనిర్ధారణ జరిగింది. ఇదే కుంభకోణానికి సంబం. దించి మరో మూడు కేసులలోనూ లాలూ నింది తుడుగా ఉన్నారు. ఆ మేరకు పశు సంవర్ధక శాఖ పేరిట దొరండా, చాయిబాసా, దుంకా ఖజానా కార్యా లయాల నుంచి రూ.184 కోట్లు, 36 కోట్లు, 3.97 కోట్లు వంతున అక్రమంగా డ్రా చేశారు.

ఇది బీజేపీ రాజకీయ కక్ష సాధింపులో భాగం

బిర్సాముండా జైలులో ఉన్న లాలూ వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ఈ తీర్పు విన్న తర్వాత– రాజకీయ కక్ష సాధింపులే ఈ పరిస్థితికి కారణమని సామాజిక మాధ్యమం ట్విట్టర్‌లో స్పందించారు. ''మా బాటలో నడవండి... లేకపోతే ఇలాగే ఇరికిస్తాం' అన్నది బీజేపీ విధానం... ఏదేమైనా సామాజిక న్యాయం, సామరస్యం, సమానత్వం కోసం సంతోషంగా కేసులలో ఇరుక్కుని చావటానికైనా నేను సిద్ధమే. కానీ, వారి బాటలో ఎట్టి పరిస్థితుల్లోనూ నడ వను'' అని వ్యాఖ్యానించారు. లాలూ కుమారుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ మాట్లా డుతూ– ''ప్రజలు ఎన్నుకున్న ఆయన జైల్లో ఉన్నారు... ఎన్నికల్లో గెలవని వ్యక్తులు రాజ్యమే లుతున్నారు. లాలూజీ అంటే అమిత్ షాకు చాలా భయం'' అన్నారు. కాగా, ''బిహార్ ప్రజలకు అంతి మంగా న్యాయం లభించింది. చట్టానికి అందరూ సమానమేనని మరోసారి రుజువైంది. చట్టానికన్నా ఎవరూ గొప్పవారు కాదన్న సందేశం మరోమారు బిగ్గరగా వినిపించింది'' అని బీజేపీ నాయకుడు షానవాజ్ హుసేన్ అన్నారు.

నాడు జాలీ... నేడు చలి!

దాణా కుంభకోణం తొలి కేసులో జైలు శిక్షపడిన నాడు జార్ఖండ్‌లో లాలూ మిత్రుడైన హేమంత్ సొరెన్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. దీంతో బిర్సాముండా జైలులో ఆయనకు వీఐపీ మర్యాదలు దక్కాయి. ఒక్కమాటలో చెబితే ఆయన జైలు గదిని లాలూ అతిథిగృహంలా మార్చేశారు. ఏకంగా ముఖ్యమంత్రి అప్పుడప్పుడూ జైలుకే వచ్చి ఆయనతో ముచ్చటించి వెళ్లేవారు. మరి నేడో... బీజేపీ అధికారంలో ఉండగా రఘువర్‌దాస్ ముఖ్యమంత్రి... శిక్ష ఖరారుకు ముందు విచారణ సందర్భంగా జైల్లో 'బాగా చలి'గా ఉందని లాలూ జడ్జితో మొరపెట్టుకున్నారు. 'అయితే... తబలా వాయించుకోండి' అని న్యాయమూర్తి హాస్యమాడుతూ సలహా ఇచ్చారు. 'యాదవ్ శ్రేయోభిలాషుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయ'ని ఇటీవల జడ్జి కోర్టులోనే ప్రకటించడానికి బహుశా ఈ నేపథ్యమే కారణమై ఉండొచ్చు.

జర మా గోస సూడండి సారూ!

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఎదుట శనివారం వారు ఆందోళన చేశారు. ఉద్యోగులను పోలీసులు లోపలికి అనుమతించకపోవడంతో కొంత రసాభాసగా మారింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెలంగాణ ఉద్యోగులను సొంత రాష్ట్రానికి తీసుకురావాలని ముఖ్యమంత్రిని కోరగా, ఆరు నెలల్లో స్వరాష్ట్రానికి తీసుకవస్తానని హామీ ఇచ్చా రన్నారు. నాలుగేండ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేకపోగా పట్టించుకున్న నాధుడే లేడన్నారు. దాదాపు ముప్పై ఏండ్లుగా ఉద్యోగం చేస్తున్న వారున్నారని, కుటుంబానికి, పిల్లలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహించడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వారం వారం రాకపోకలు సాగించడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. ఎన్ని సార్లు సచివాలయానికి వచ్చిన ఉద్యోగులు సంఘం నాయకులు స్పందిచడం లేదని, ముఖ్యంగా మా సమస్యలను కేసీఆర్ దృష్టి తీసుకెళ్లడం లేదని తెలిపారు. బాధల్లో ఉన్న తమకు ధైర్యాన్నిచ్చే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందులను ఎదుర్కొనే వారందరూ దాదాపు నాలుగో తరగతి ఉద్యోగులేనని తెలిపారు. ఇప్పటికైనా తమ గోస పట్టించుకుని తమను తెలంగాణకు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ ఆందోళనలో దాదాపు 60 మంది బాధితులు పాల్గొన్నారు.

ఇది.. మీ ఇంటి నేస్తం!

(మొదటి పేజీ తరువాయి)


బెడద తప్పించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా.. వాటిని పెంచుకుంటే సరి! ఈ మాట చెబుతున్నది ఎవరో కాదు.. సాక్షాత్తు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెరిగిపోతున్న వీధికుక్కలను నియంత్రించడానికి జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన 'మా ఇంటి నేస్తం' కార్యక్రమంలో... వీధికుక్కలను దత్తత తీసుకోవాలని మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం మియాపూర్‌లో 'మన నగరం' కార్యక్రమంలో భాగంగా మంత్రి 'మా ఇంటి నేస్తం' కార్యక్రమంలో వీధి కుక్క పిల్లలను ప్రజలకు దత్తతగా అందజేశారు. చెత్తను వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వేయడం వల్లే వీధికుక్కల సంఖ్య పెరిగిపోతుందని ఆయన చెప్పారు. అందుకే.. చెత్త బయట వేయకపోవడంతో పాటు.. కుక్కపిల్లలను పెంచుకుంటే అవి సెక్యూరిటీగా కూడా ఉపయోగపడతాయని కేటీఆర్ అన్నారు. రోడ్లపై ఆహార పదార్థాలు వేయడం ద్వారా అవి కొట్లాడి కాలనీవాసులపై కూడా దాడులకు దిగుతాయని, విశ్వనగర నిర్మాణంలో మా ఇంటి నేస్తం కూడా ఎంతో ముఖ్యమైన కార్యక్రమని మంత్రి కేటీఆర్ తెలిపారు.

గోడ కడ్తాం... నిధులివ్వండి

1800 కోట్లు డాలర్లు కేటాయించాలి

అమెరికన్ కాంగ్రెస్‌కు ట్రంప్ విజ్ఞాపన

అది ఎందుకూ కొరగాదు.. డెమోక్రాట్లు



వాషింగ్టన్, జనవరి 6: మెక్సికో సరిహద్దులో మహా కుడ్యం నిర్మాణానికి నిధులివ్వాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికన్ కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం రాబోయే పదేళ్లలో 1800 కోట్ల డాలర్ల కేటాయింపునకు ఆమోదం తెలపాల్సిందిగా కోరారు. ఈ మేరకు 2016నాటి అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో తానిచ్చిన హామీ నెరవేర్చే దిశగా ప్రతిపాదన చేశారు. ''మెక్సికో నుంచి అక్రమ వలసలతోపాటు మాదకద్రవ్యాల రవాణా నిరోధం కోసం అమెరికా నుంచి ఆ దేశాన్ని వేరుచేసేలా అతిపెద్ద, అందమైన గోడ కట్టిస్తాం'' అని అప్పట్లో ఆయన వాగ్దానం చేశారు. ఇందులో భాగంగా కొత్త సరిహద్దు వ్యయం కింద 3300 కోట్ల డాలర్లు అవసరమని, ఇందులో 1800 కోట్ల డాలర్లు గోడ నిర్మాణానికి వెచ్చిస్తామని కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ పత్రం ప్రతిపాదించింది. అలాగే సాంకేతిక సామగ్రి కోసం 570 కోట్లు, రోడ్డు నిర్మాణం–నిర్వహణకు 100 కోట్లు, 2,500 మంది ఇన్స్‌పెక్టర్లు, 5 వేల మంది సరిహద్దు భద్రత దళంతోపాటు ఇతర సిబ్బంది నియామకానికి 850 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేసింది. ఈ ప్రతిపాదనను డెమొక్రటిక్ పార్టీ తక్షణమే స్పందిస్తూ– పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఇలా వృథా చేయడం తగదని కరాఖండీగా ప్రకటించింది. ''ఎందుకూ కొరగాని సరిహద్దు గోడ కోసం 1800 కోట్ల డాలర్లు వృథా చేయడాన్ని మేం ఎంతమాత్రం అనుమతించం'' అని సభలో డెమొక్రాట్ సెనేటర్ల చైర్మన్ జో క్రోలీ స్పష్టం చేశారు

కశ్మీర్‌లో ఉగ్రపంజా

- భారీ పేలుడుకు నలుగురు పోలీసుల మృతి



శ్రీనగర్, జనవరి 6: జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. శనివారం బారాముల్లా జిల్లాలో పెట్రోలింగ్ పోలీసులను లక్ష్యంగా చేసుకుని దాడి చేశారు. భారీ పేలుడు పదార్థాన్ని రిమోట్ కంట్రోల్‌తో పేల్చడంతో నలుగురు పోలీసులు మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రద్దీగా ఉండే ఓ మార్కెట్ సముదాయం వద్ద ఉగ్రవాదులు దాడి చేశారు. పేలుడు దాటికి ఓ షాపు పూర్తిగా కుప్పకూలిపోయిందని.. తీవ్రత చాలా దూరం ప్రభావం చూపిందని అధికారులు వెల్లడించారు. ఆ ప్రాంతంలో భారీగా మోహరించిన సైన్యం.. ఉగ్రవాదుల కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టింది.

మంచుచరియల కింద
11 మంది సమాధి

- కశ్మీర్‌లో రోడ్డు ప్రమాదం

శ్రీనగర్, జనవరి 6: జమ్ముకశ్మీర్‌లో మంచు చరియల కింద చిక్కుకుపోయి ప్రయాణికులు వాహనంలోని 11 మంది మరణించారు. శుక్రవారం సాయంత్రం ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా నుంచి కర్నాహ్ వెళ్తుండగా.. ఓ ప్రయాణికుల వాహనం హిమపాతం కారణంగా ప్రమాదానికి గురైంది. ఆర్మీ సహా స్థానికులు తక్షణం సహాయ చర్యలు మొదలుపెట్టారు. శుక్రవారం రాత్రి సరిహద్దు రహదారి సంస్థ ఇంజనీర్ ఎంపీ సింగ్ మృతదేహాన్ని వెలికితీశారు. మరో 10 మంది ప్రయాణికుల మృతదేహాలను శనివారం ఉదయం గుర్తించారు. మృతుల్లో ఏడాది చిన్నారి కూడా ఉంది. కాగా, ముగ్గురిని సురక్షితంగా ప్రాణాలతో కాపాడ గలిగామని కుప్వారా డిప్యూటీ కమిషనర్ ఖలీద్ జహంగీర్ తెలిపారు.

11 మంది సౌదీ రాకుమారుల అరెస్టు

దుబాయ్, జనవరి 6: సౌదీ అరేబియాలో రాజ వంశానికి చెందిన 11 మంది రాకుమారులను అరెస్ట్ చేసినట్లు అక్కడి న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. రియాద్‌లో సౌదీ రాజుకు చెందిన ఓ రాజభవ నం ఎదుట మద్దతుదారులతో కలిసి వీరు ఆందోళనచేసే ప్రయత్నం చేశారు. అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించినప్పటికీ వెళ్లకపోవడంతో వారిని అరెస్ట్ చేశారు. ఈ 11 మంది రాకుమారులను అత్యంత భద్రత ఉండే హైర్ జైలుకు తరలించారు. రాజ కుటుంబానికి చెందిన భద్రత బలగాలు వారి అరెస్ట్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు న్యూస్ వెబ్‌సైట్లో తెలిపింది. తమ బంధువుకు సంబంధించిన ఓ కేసు తీర్పులో పరిహారం ఇవ్వాలని, రాజ వంశీయులకు నీటి, విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించడాన్ని రద్దు చేస్తూ రాజు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో వారీ ఆందోళనకు పూను కున్నట్లు సమాచారం.

రూ.10 కోట్ల డ్రగ్స్ పట్టివేత

- కశ్మీర్‌లో రూ. 7 కోట్ల హెరాయిన్ స్వాధీనం
- 10 మంది అరెస్ట్.. పాకిస్థాన్ నుంచి రవాణా

జమ్ము, జనవరి 6: జమ్ముకశ్మీర్, మణిపూర్ రాష్ట్రాలలో ఒకే రోజు 10 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం జమ్ముకశ్మీర్‌లోని జమ్ము, సాంబా జిల్లాల్లో పోలీసులు 7 కోట్ల రూపాయల విలువైన 7 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పదిమంది డ్రగ్ స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ నుంచి హెరాయిన్‌ను రవాణా చేస్తున్న ఐదుగురిని సరిహద్దుల వద్ద అరెస్ట్ చేసినట్టు ఐజీ ఎస్‌డీ సింగ్ జమ్‌వాల్ చెప్పారు. జమ్ములో మాజీ సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుల్ సహా నలుగురిని, సాంబా జిల్లాలో మరొకరిని పోలీసులు అరెస్ట్ చేశారు.

మణిపూర్‌లో రూ.3 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

మణిపూర్‌లో పోలీసులు 3 కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇంఫాల్‌లో ఓ మినీ ట్రక్‌లో డ్రగ్స్‌ను తరలిస్తుండగా పట్టుకున్నారు. వీటిని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. సంచుల్లో డ్రగ్ ప్యాకెట్లను తీసుకెళ్తున్నట్టు పోలీసులు చెప్పారు. భారత్-మయన్మార్ సరిహద్దులోని మోరె నుంచి వీటిని తీసుకువచ్చినట్టు పోలీసులు తెలిపారు.

లాలు కుమార్తె, అల్లుడిపై
ఈడీ రెండో చార్జిషీట్

న్యూఢిల్లీ, జనవరి 6: మనీలాండరింగ్ కేసులో ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి, అల్లుడు శైలేష్ కుమార్‌పై ఈడీ రెండో చార్జిషీట్ దాఖలు చేసింది. ఇద్దరిని నిందితులుగా పేర్కొంటూ ఢిల్లీ కోర్టులో అభియోగాలు నమోదు చేసింది. కాగా ఎన్ని సప్లిమెంటరీ చార్జిషీట్‌లను దాఖలు చేస్తారని, ఈడీ ప్రాథమిక దర్యాప్తు సంస్థేనని, ఇలా వ్యవహరించడం సరికాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. వచ్చే నెల 5న కోర్టు విచారణ చేయనుంది.

యూపీలో మహిళపై గ్యాంగ్‌రేప్

- తుపాకీతో బెదిరించి అఘాయిత్యం

బందా, జనవరి 6: ఒక మహిళను అపహరించి తుపాకీతో బెదిరించి ముగ్గురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని భద్వాల్ గ్రామం సమీపంలో ఈ ఘటన జరిగింది. చిత్రకూట్ జిల్లాకు చెందిన మహిళ శుక్రవారం తన భర్త, బావతో కలిసి గౌరీఖాన్‌పూర్ గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి తిరుగు ప్రయాణమైన వీరిని భద్వాల్ సమీపంలో ముగ్గురు దుండగులు తుపాకులతో చుట్టుముట్టి కిడ్నాప్ చేశారు. సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లి తుపాకీతో బెదిరించి ఆ మహిళపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. అనంతరం ఆ ముగ్గురూ అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు జరుపుతున్నారు.

సర్పంచ్ దారుణహత్య

- గొంతుకోసి చంపిన మావోయిస్టులు
- ఛత్తీస్‌గఢ్‌లోని బస్తరులో ఘాతుకం

రాయ్‌పూర్, జనవరి 6: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తరు జిల్లాలో మావోయిస్టులు సర్పంచ్‌ను హత్య చేశారు. శుక్రవారం రాత్రి మావోయిస్టులు చిండుగూర్ గ్రామంలో సర్పంచ్ పండ్రు (45) ఇంటికెళ్లి ఆయన గొంతు కోసి చంపినట్టు డీఐజీ సుందరరాజ్ తెలిపారు. అటవీప్రాంతంలోని మారుమూలన ఈ ఘటన జరిగినట్టు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఛత్తీస్‌గఢ్‌లో కొండ్‌గావ్ జిల్లాలో పోలీసులు ముగ్గురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 10 కిలోల టిఫిన్ బాంబును స్వాధీనం చేసుకున్నారు.

దుర్గగుడి ఈవోపై వేటు

- విధుల నుంచి సూర్యకుమారి రిలీవ్
- పరిపాలనా పరమైన లోపాలపై సీఎం ఆగ్రహం
- దేవాదాయ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు

అమరావతి, జనవరి 6: బెజవాడలోని కనకదుర్గమ్మ ఆలయ ఈవో సూర్యకుమారిని ప్రభుత్వం విధుల నుంచి తప్పించింది. ఆమె స్థానంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధకు అదనపు బాధ్యతలను అప్పగించింది. ఆలయంలో తాంత్రిక పూజలపై కమిటీ విచారణకు సంబంధించిన ప్రాథమిక నివేదిక సీఎం చంద్రబాబు శనివారం అందింది. దీనిని పరిశీలించి ఆయన దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు, విజయవాడ పోలీసు కమిషనర్ సవాంగ్‌తో సమావేశమయ్యారు. ఆలయంలో పూజలపై ప్రస్తుతానికి నిర్ధారించనప్పటికీ బయటి వ్యక్తులు రాత్రి వేళ లోపలికి వచ్చినట్లు నివేదిక స్పష్టం చేసింది. దీంతో ఆలయంలో పరిపాలన పరమైన లోపాల సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవో సూర్యకుమారి తన బాధ్యతల నిర్వహణలో విఫలమయ్యారని తేటతెల్లమైందన్నారు. ఆమె విధుల్లో కొనసాగితే తాంత్రిక పూజలపై జరుగుతున్న విచారణకు ఆటంకం కలుగుతుందని, ఆమెను విధుల నుంచి తొలగించాలని సీఎం ఆదేశించారు. సూర్యకుమారిని తక్షణం రిలీవ్ చేయాలని సూచించారు. ఆమె స్థానంలో దేవాదాయ కమిషనర్ అనురాధకు అదనపు బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించారు. తాంత్రిక పూజలపై విచారణ చేపట్టేందుకు



ప్రత్యేకంగా నియమించిన కమిటీతో పాటు, పోలీసులు తమ దర్యాప్తు నివేదికలను వీలైనంత త్వరగా అందజేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. కాగా, సీఎంతో సమావేశం అనంతరం మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ.. ఈవో నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించి ఆమెపై వేటు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దుర్గగుడిలో అర్ధరాత్రి పూజల వ్యవహారంపై విచారణ కొనసాగుతుందని మంత్రి అన్నారు. పాలనా పరమైన లోపాల వల్లే సూర్యకుమారిని తొలగించామని, ఆలయంలో ఎటువంటి పూజలు జరగలేదని నమ్ముతున్నామని అన్నారు. రాష్ట్రంలోని ఇతర దేవాలయాల భద్రతపైనా సీఎం చంద్రబాబు సమీక్షించినట్లు చెప్పారు.

‘స్థూల విచ్ఛిన్న రాజకీయం’ దెబ్బ

- దేశ ఆర్థిక వ్యవస్థపై రాహుల్ గాంధీ వ్యాఖ్య
- ప్రధాని మోదీ, జైట్లీలపై ట్విట్టర్‌లో విమర్శ
- ‘మందగమనం’ భయాలు నిజమవుతున్నాయి
- కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఆందోళన

న్యూఢిల్లీ, జనవరి 6: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ‘విచ్ఛిన్న రాజకీయం’ దెబ్బకు దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శనివారం విమర్శించారు. బ్యాంకు రుణ లభ్యతలో వృద్ధి 63 ఏళ్లనాటి దిగువస్థాయికి దిగజారడం, ఉపాధి కల్పనలోనూ ఎనిమిదేళ్ల కిందటి స్థాయికి పతనం కావడం ఇందుకు నిదర్శనాలని పేర్కొన్నారు. అలాగే ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ‘మేధస్సు’, ప్రధాని ‘స్థూల విచ్ఛిన్న రాజకీయం’ (జీడీపీ) కలగలసిన ఫలితంగా దేశంలోకి ‘కొత్త పెట్టుబడులు’ కూడా 13 ఏళ్ల అత్యల్ప స్థాయికి పడిపోయాయని ట్విట్టర్‌లో ఎద్దేవా చేశారు. అంతేకాకుండా ద్రవ్యలోటు పెరిగిపోయిందని, ప్రాజెక్టులు స్తంభించాయని ఆరోపించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ‘స్థూల దేశీయోత్పత్తి’ (జీడీపీ) వృద్ధి అంచనాలను ప్రభుత్వం 6.5 శాతానికి తగ్గించిందన్న వార్తా కథనాలను ఈ సందర్భంగా రాహుల్ ఉటంకించారు.



వైఫల్యాలు అన్నీఇన్నీ కావు

కాంగ్రెస్ సీనియర్ నేత, ఆర్థికశాఖ మాజీమంత్రి చిదంబరం కూడా ఇదే అంశంపై ఒక ప్రకటనలో విమర్శలు గుప్పించారు. దేశ ఆర్థిక మందగమనంపై భయాలు నిజమవుతున్నాయని జీడీపీ వృద్ధి అంచనాలు నిరూపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ‘‘ప్రభుత్వ లెక్కల ప్రకారమే... 2015-16లో జీడీపీ వృద్ధిరేటు 8 శాతం కాగా, 2016-17లో కేవలం 7.1 శాతంగా నమోదైంది. ఇక 2017-18 అంచనాల్లో అది 6.5 శాతానికి పడిపోయింది. ఆర్థిక మందగమనానికి ఇంతకన్నా రుజువులు ఏముంటాయి?’’ అని ప్రశ్నించారు. ఆర్థిక కార్యాచరణ, వృద్ధిలో క్షీణత అంటే... లక్షలాది ఉద్యోగాలు నష్టపోవడమేనని వివరించారు. తాజా పెట్టుబడులు, ప్రాజెక్టుల విషయంలోనూ క్షీణత స్పష్టమవుతున్నదని, పెద్దనోట్ల రద్దు దుష్ప్రభావం ఫలితంగా అనియత రంగం ఇంకా కొట్టుమిట్టాడుతున్నదని తెలిపారు. ఉపాధి సృష్టి అట్టడుగుకు పడిపోయిందని, ఎగుమతులు దిగజారాయని, తయారీ రంగ వృద్ధి మందగించిందని వివరించారు. ఇక వ్యవసాయం రంగానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని, గ్రామీణ రంగంలో నిస్పృహ నిండిపోయిందని పేర్కొన్నారు. ‘‘బీజేపీ పాలనలో ఉపాధి సృష్టిలో పతనం అత్యంత భారీ వైఫల్యం’’ అని చిదంబరం అభివర్ణించారు. బ్యాంకు రుణ లభ్య త వృద్ధి అధమ స్థాయికి దిగజారడం దేశ ఆర్థిక వ్య వస్థకు శుభ సంకేతం కాదని వ్యాఖ్యానించారు. ‘‘మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ పదాడంబరం, పతాక శీర్షికల పటాటోపం తదితరాలతో ఎంత తీపిపూత పూసినా కళ్లెదుట కనిపిస్తున్న చేదు నిజాలు దాగవని ప్రస్తుత పరిస్థితులే నిరూపిస్తున్నాయి’’ అని పేర్కొన్నారు.

రాహుల్ ఉల్లంఘనకు ఆధారాలు

- హక్కుల నోటీసును స్పీకర్‌కు పంపిన వెంకయ్య

న్యూఢిల్లీ, జనవరి 6: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై రాజ్యసభలో వచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసును ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు శనివారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు పంపారు. రాహుల్ లోక్సభ సభ్యుడు కావడంతో దీనిపై తదుపరి చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. బీజేపీ ఎంపీ భూపీందర్ యాదవ్ ఇచ్చిన ఈ నోటీసులో ఆరోపణలకు ‘ప్రాథమిక ఆధారాలు’న్నాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజ్యసభ నాయకుడి హోదాలో మంత్రి జైట్లీ చేసిన ఓ ప్రకటనను విమర్శిస్తూ ట్వీట్ చేసిన రాహుల్.. అందులో ఆయన పేరును వక్రీకరించారని తన హక్కుల నోటీసులో యాదవ్ పేర్కొన్నారు. దీనిపై తీసుకున్న చర్యలేమిటో తెలపాలని ఆయన కోరగా అది తన పరిశీలనలో ఉన్నట్లు వెంకయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో దాన్ని పరిశీలించిన అనంతరం స్పీకర్‌కు పంపారు. కాగా, రాహుల్‌పై వచ్చిన ఒక ఫిర్యాదును స్పీకర్ ఇప్పటికే లోక్‌సభ నైతికవిలువల కమిటీ చైర్మన్ అద్వానీకి పంపారు.

శరీరంలో కొవ్వు పేరుకుపోతే
హార్ట్ ఫెయిల్యూర్

వాషింగ్టన్, జనవరి 6: హృదయ కండరాలలో పేరుకుపోయిన కొవ్వు హార్ట్ ఫెయిల్యూర్ ముప్పును రెండు నుంచి ఐదు రెట్లు పెంచుతుందని తాజా అధ్యయనంలో తేలింది. వాస్తవానికి గుండె పనితీరుపై ప్రభావం చూపే శక్తి కొవ్వుకు ఉందనే విషయం గతంలోనే వెల్లడైంది. అయితే, లోవా యూనివర్సిటీ పరిశోధకులు దీనిపై మరింత లోతుగా పరిశోధనలు నిర్వహించి ఓ కొత్త విషయాన్ని కనుగొన్నారు. మన శరీరం మొత్తంలో అత్యధిక శక్తిని వినియోగించుకునేది హృదయమేనని, ఈ క్రమంలో అవసరమైన శక్తిని తయారుచేసుకోవడానికి ఇంధన కణాలపై ఆధారపడుతుంది. ఇలా ఉత్పత్తి అయిన శక్తిని ఉపయోగించుకుని గుండె రక్తాన్ని పంప్ చేస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం మైటోకాండ్రియాలో జరుగుతుంది. అయితే మధుమేహ బాధితులలో ఈ ప్రక్రియ సరిగా పనిచేయదని పరిశోధకులు



తెలిపారు. ఫలితంగా హృదయ కణాలు వినియోగించే కొవ్వు పరిమాణం శృతిమించి, గుండె పనితీరు మందగిస్తుందని హెచ్చరించారు. దీంతో బాధితులు హార్ట్ ఫెయిల్యూర్‌తో చనిపోయే ప్రమాదం పెరుగుతుందని వివరించారు.

కొలైన్‌తో పాపాయికి
మెదడు చురుకుదనం

న్యూయార్క్, జనవరి 6: బిడ్డ మెదడు ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే గుడ్డులోని పచ్చసొన, నట్స్, క్యాబేజీ జాతికి చెందిన కూరగాయలు వంటి పదార్థాలు విరివిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది పుట్టబోయే బిడ్డ మెదడుకు, జ్ఞాపక శక్తికి మంచి బూస్ట్ ఇస్తుందని తాజా అధ్యయనం తేల్చింది. అంతేకాదు గర్భధారణ సమయంలో విటమిన్ బి కాంప్లెక్స్ సముదాయంలోని కోలైన్ విరివిగా తీసుకోవాలని చెబుతోంది. గర్భం దాల్చిన మహిళలు ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయంపై చదువుకున్న మహిళల్లోనూ తర్జన భర్జన తప్పదు. అయితే గర్భధార ణలో చివరి 3 నెలల్లో తీసుకునే ఆహారం చాలా ముఖ్యమని తాజా అధ్యయనం చెబుతోంది. ముఖ్యంగా కొవ్వు తీసేసిన ఎర్ర మాంసం, (లీన్ రెడ్ మీట్) చేపలు, గుడ్లు, తృణధాన్యాలను ఎక్కువగా తీసుకుంటే శిశువు ఆరోగ్యంగా



ఎదుగుతుందని ఈ అధ్యయనం తేల్చింది. రోజువారీ ఈ ఆహార పదార్థాల వినియోగంతో బిడ్డల ఎదుగుదలలో వేగం, విజువల్ జ్ఞాపకశక్తి నాలుగు, ఏడు, 10, 13 నెలల వయస్సులో మెరుగుపర్చిందని ఈ అధ్యయనం సూచించింది. గర్భధారణ సమయంలో అధికంగా తీసుకోవాల్సిన కోలిన్ చాలామంది మహిళలు చాలా తక్కువ మోతాదులో తీసుకుంటున్నారనీ, రోజుకు సిఫార్సు చేయబడిన 450 మిల్లీగ్రాముల కన్నా తక్కువ వినియోగిస్తారు. కానీ, గర్భధారణ చివరి త్రైమాసికంలో ప్రతిరోజూ సిఫార్సు చేసిన కొలైన రిచ్ ఫుడ్స్ తినడం రెండుసార్లు కంటే ఎక్కువ తీసుకోవాలని తద్వారా పాపాయి ఎదుగుదల బావుంటుందని అధ్యయనం చెబుతోంది. నేర్చుకోవడం, జ్ఞాపకం చేసుకోవడం, పరిష్కారం, శ్రద్ధ వహించడం లాంటివి మెరుగుపడతాయని కార్నెల్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు.

మహారాష్ట్రలో గందరగోళ పరిస్థితి

- కుల వైరుధ్యాలతో వినాశం వైపు: శివసేన

ముంబై, జనవరి 6: రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, కుల వైరుధ్యాల ఫలితంగా మహారాష్ట్ర వినాశంవైపు పయనిస్తున్నదని శివసేన విమర్శించింది. భీమా-కోరేగావ్ హింస, తదనంతరం పరిణామాలపై దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వంమీద తన దాడిని శనివారం కూడా కొనసాగించింది. నాటి హింసను నిరసిస్తూ ఈ నెల 3న దళిత సంఘాలు నిర్వహించిన బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు విపరీతంగా నష్టం వాటిల్లడంపై ఆవేదన వ్యక్తం చేసింది. బీజేపీ సర్కారులో భాగస్వామిగా ఉన్నప్పటికీ అధికార వాణి ‘సామ్నా’ సంపాదకీయంలో ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేసింది. ‘‘దళిత సంఘాలు బంద్‌కు పిలుపునిస్తే హిందుత్వ బృందాలు వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించాయి. ఇదంతా చూస్తుంటే కుల వైరుధ్యాలతో గందరగోళంలో పడిన రాష్ట్రం వినాశం దిశగా సాగుతున్నట్లు కనిపిస్తోంది’’ అని పేర్కొంది. బంద్ ప్రశాంతంగా సాగి ఉంటే భారిపా బహుజన్ మహాసంఘ్



(బీబీఎం) నాయకుడైన ప్రకాశ్ అంబేద్కర్‌కు మంచిపేరు వచ్చి ఉండేదని పేర్కొంది. ‘‘ఆయన అనుయాయులకు సరైన మార్గదర్శకత్వం లోపించింది. కొల్హాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని కూడా ఆందోళనకారులు ధ్వంసం చేయడం ఇందుకు నిదర్శనం’’ అని విచారం వెలిబుచ్చింది. కుల వైరుధ్యాలతో రాష్ట్ర ఆత్మగౌరవం దెబ్బతినరాదన్నదే తమ లక్ష్యమని పేర్కొంది. ఈ పరిస్థితుల నడుమ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ దిశగా ఫడ్నవీస్ ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపింది. ఏదిఏమైనా రాష్ట్ర హోంశాఖ

వారంట్లపై విధానం ఏదీ?

- మహా ప్రభుత్వానికి తలంటిన హైకోర్టు

రాష్ట్రంలో వివిధ కేసులకు సంబంధించి నిందితులకు/సాక్షులకు వారంట్లు/సమన్లు పంపటానికి నిర్దిష్ట విధానం లేకపోవడంపై మహారాష్ట్ర సర్కారుకు బాంబే హైకోర్టు తలంటింది. వారంట్లు/సమన్ల జారీలో జాప్యంపై దాఖలైన ఒక ప్రజాహిత వ్యాజ్యంమీద నిరుడు సెప్టెంబరులో విచారణ నిర్వహించినపుడే ఇందుకోసం తగిన విధానాన్ని తక్షణమే రూపొందించాలని ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. అయితే, నాలుగు నెలలు దాటినా సర్కారు స్పందించకపోవడంపై శనివారం విచారణ సందర్భంగా అసహనం వ్యక్తంచేసింది. ఇకనైనా వారంట్లు/సమన్లను వేగంగా అందించే దిశగా తగిన విధానం రూపొందించాలని లేదా ప్రస్తుత చట్టాన్ని సవరించాలని ఆదేశించింది.

కమల్‌పై న్యాయవాదుల ఆగ్రహం

కొయంబత్తూర్, జనవరి 6: డబ్బుతోనే ఆర్కేనగర్ ఉపఎన్నికలో టీటీవీ దినకరన్ విజయం సాధించారంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహజ్వాలలు రేగుతున్నాయి. ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దిన కరన్ మద్దతుదారులైన పలువురు న్యాయవా దులు కమల్ చిత్రపటాలను శనివారం కోయంబ త్తూర్ జిల్లా కోర్టు ఎదుట దహనం చేసి ఆయ నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆనంద వికటన్ మేగజైన్‌లో కమల్ ఆర్కేనగర్ ఎన్నికల ఫలితాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

కేజ్రీవాల్ సభకు అనుమతి లేదు

బుల్డానా, జనవరి 6: మహారాష్ట్రలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తలపెట్టిన బహిరంగ సభకు ఆ రాష్ట్ర పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ నెల 12న విదర్భ జిల్లాలోని సింధ్‌ఖేడ్ రాజా వద్ద కేజ్రీవాల్ సభ జరగాల్సి వుంది. కాగా ప్రజలను అదుపు చేయడం కష్టమనే ఉద్దేశంతో సభకు అనుమతించలేదని విదర్భ ఎస్పీ సుశీల్ కుమార్ మీనా చెప్పారు. ఛత్రపతి శివాజీ తల్లి జిజాబాయ్ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు కేజ్రీవాల్ రాను న్నారు.

పాక్‌ను ఎలా డీల్ చేయాలో తెలుసు

- అన్ని రకాలు ప్రత్యామ్నాయాలున్నాయి
- ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాల్సిందే
- అమెరికా మరోసారి ఘాటు హెచ్చరిక

వాషింగ్టన్, జనవరి 6: పాకిస్థాన్‌కు అమెరికా మరోసారి ఘాటు హెచ్చరిక చేసింది. పాకిస్థాన్‌ను డీల్ చేయడానికి అన్ని రకాల ప్రత్యామ్నాయాలు టేబుల్‌పై సిద్ధంగా ఉన్నాయని అమెరికా వెల్లడించింది. తాలిబన్, హక్కానీ నెట్ వర్క్ విషయంలో పాక్ కఠినంగా ఉండకున్నా, వారి రక్షణ స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేయకున్నా తమ ప్రత్యామ్నాయాలను ఉపయోగిస్తామని అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ హెచ్చరించింది. ఏం చేయాలో పాక్ నిర్ణయించుకోవాలని ఓ ప్రకటన చేసింది. ఉగ్రవాదులకు పాక్ స్వర్గధామంలా ఉంటోందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. పాక్‌కు దాదాపు 2 బిలియన్ డాలర్ల సహాయాన్ని అమెరికా నిలిపేసిన అనంతరం అమెరికా మరోసారి ఈ విధంగా హెచ్చరించింది. పాక్ చెబుతున్నంత సంతృప్తి స్థాయిలో ఉగ్రవాద చర్యలను నిలువరించడం లేదనే కారణంతో ఆ దేశానికి నిధు లు ఇవ్వడం ఆపేసింది. అఫ్ఘానిస్థాన్ సరిహద్దులో ఉగ్రస్థావరాలపై పాక్ దాడులు జరపాలని అమెరికా కోరుకుంటోందని పేర్కొంది. అదే విధంగా ఉగ్రవా దులపై చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామని, అలా జరిగితే ఇరు దేశాల మధ్య తిరిగి సానుకూల పరిస్థితులు ఏర్పడతాయని స్పష్టం చేసింది. ఉగ్రవాదుల అంశంపై పాక్ త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, అమెరికా పరస్పర సహకారానికే మొగ్గు చూపుతుందని వెల్లడించింది.





జనవరి 12న సూర్య 'గ్యాంగ్'

సూర్య, కీర్తి సురేష్ జంటగా నటించిన చిత్రం 'గ్యాంగ్'. యు.వి.క్రియేషన్స్ జనవరి 12న విడుదల చేస్తోంది. ఈ చిత్రానికి విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ శుక్రవారం హైదరాబాద్‌లోని జె.ఆర్.సి. కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ ''యు.వి.క్రియేషన్స్ తెలుగులో 'గ్యాంగ్' అనే చాలా మంచి టైటిల్ పెట్టారు. అల్లు అరవింద్‌గారు మా గ్యాంగ్‌లో చాలా కీలకమైన వ్యక్తి. ఆయన సినిమా రిలీజ్‌కు ఎంతగానో సపోర్ట్ చేస్తున్నారు. జ్ఞానవేల్ రాజా కూడా ఇక్కడ నా సినిమాలను గ్రాండ్‌గా విడుదల చేసే మరో గ్యాంగ్ మెంబర్. మా గ్యాంగ్‌లో యు.వి.క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లు కూడా జాయిన్ అయ్యారు'' అన్నారు. విఘ్నేశ్ శివన్ మాట్లాడుతూ ''ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన సూర్యగారికి, జ్ఞానవేల్ రాజాగారికి, వంశీ ప్రమోద్‌లకు థాంక్స్'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ ''గజిని సినిమా నుండి నాకు, సూర్యగారికి మంచి అనుబంధం కొనసాగుతుంది. నాతో ఆయన సినిమా చేయాలని ప్రయత్నిస్తున్నారు కానీ కుదరడం లేదు. త్వరలోనే ఆ సినిమా చేస్తాం. జ్ఞానవేల్ రాజా, విఘ్నేశ్ శివన్ కలిసి చేసిన సినిమాను తెలుగులో యు.వి.క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లు విడుదల చేస్తున్నారు'' అన్నారు. కీర్తి సురేష్ మాట్లాడుతూ ''సూర్యగారితో నటించడం ఆనందంగా ఉంది. విఘ్నేశ్ శివన్ సినిమాను ఎంతో బాగా తెరకెక్కించారు'' అన్నారు. మారుతి మాట్లాడుతూ ''గ్యాంగ్‌తో మరో వండర్ ఫుల్ సినిమాను సూర్యగారు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సంక్రాంతికి పెద్ద తెలుగు చిత్రాలతో పాటు సూర్యగారి సినిమా వస్తుంది. సూర్య మన కోసం తెలుగు నేర్చుకుని డబ్బింగ్ కూడా చెప్పడం మరో గొప్ప విషయం'' అన్నారు.


ఆ ప్రాజెక్ట్‌కి గుడ్‌బై చెప్పిందా?

ఈమధ్య బాలీవుడ్‌లో, టాలీవుడ్‌లో బయోపిక్‌ల హవా ఎక్కువైందనే చెప్పాలి. వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల బయోపిక్‌లు తెరకెక్కుతున్నాయి. ఆమధ్య ఎయిర్ హోస్టెస్ నీర్జా బానోత్ జీవిత కథతో తెరకెక్కిన 'నీర్జా' సంచలన విజయం సాధించింది. ఆ చిత్రంలో టైటిల్ పాత్ర పోషించిన సోనమ్ కపూర్‌కి చాలా మంచి పేరు వచ్చింది. ఆమె కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్ మూవీగా నిలిచింది. ఈమధ్య మరో బయోపిక్‌కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రముఖ క్లాసికల్ డాన్సర్ అమృత షేర్‌గిల్ జీవిత కథతో ఆ చిత్రం రూపొందనుంది. ఈ చిత్రంలోని పాత్ర కోసం షేర్‌గిల్ కుటుంబ సభ్యులను కూడా కలిసింది సోనమ్. అయితే ఉన్నట్టుండి ఆ సినిమా నుంచి తప్పుకుందని తెలుస్తోంది. ఆ పాత్రను తాను చేయలేనని చెప్పింది. ఆ సినిమా కోసం ఎక్కువ రోజులు కేటాయించాల్సి రావడంతో ప్రాజెక్ట్ నుంచి తప్పుకుందని బాలీవుడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించిన 'ప్యాడ్‌మ్యాన్' విడుదల కోసం ఎదురుచూస్తోంది సోనమ్.



• సోనమ్ కపూర్

కమల్, విక్రమ్ కాంబినేషన్‌లో సినిమా





విలక్షణ నటుడు కమల్‌హాసన్ ఎన్నో పాత్రలకు జీవం పోశారు. తను చేసే పాత్ర కోసం ఎలాంటి సాహసం చెయ్యడానికైనా కమల్ రెడీ అయిపోతారు. ఆయన తర్వాత అంతటి పేరు తెచ్చుకున్న హీరో విక్రమ్. తను చేసే క్యారెక్టర్ కోసం ఎంత రిస్క్ తీసుకుంటారో మనందరికీ తెలిసిందే. మరి వీరిద్దరూ కలిసి ఓ సినిమా చేస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన కార్యరూపం దాల్చబోతోందని తెలుస్తోంది. కమల్‌హాసన్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ బేనర్‌లో విక్రమ్ ఓ సినిమా చేయబోతున్నారట. కమల్‌హాసన్ నటించిన 'చీకటిరాజ్యం' చిత్రానికి దర్శకత్వం వహించిన రాజేష్ ఎం.సెల్వ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. మొదట ఈ సినిమాకి నిర్మాతగానే వ్యవహరించాలనుకున్న కమల్ చిత్రంలోని ఓ ప్రధాన పాత్ర ఆకర్షించడంతో విక్రమ్‌తో కలిసి నటించడానికి ఓకే చెప్పారని తెలుస్తోంది. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందే ఈ చిత్రంలో కమల్‌హాసన్, విక్రమ్ క్యారెక్టర్లు చాలా డిఫరెంట్‌గా ఉంటాయని తెలుస్తోంది. ఈ చిత్రం గురించిన పూర్తి వివరాలు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

జూన్ నుంచి ఆర్.జె. సినిమాస్ కొత్త చిత్రం



• బి.ఎ.రాజు

డైనమిక్ లేడీ డైరెక్టర్ జయ బి. దర్శకత్వంలో 'ప్రేమలో పావని కళ్యాణ్', 'చంటిగాడు', 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ', 'వైశాఖం' వంటి సూపర్‌హిట్ చిత్రాలను నిర్మించి అభిరుచిగల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు ప్రముఖ నిర్మాత బి.ఎ.రాజు. జనవరి 7 నిర్మాత బి.ఎ.రాజు పుట్టినరోజు సందర్భంగా తమ ఆర్.జె. సినిమాస్ బేనర్‌పై మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత బి.ఎ.రాజు మాట్లాడుతూ ''మా బేనర్‌లో నిర్మించిన మొదటి సినిమా 'పేమలో పావని కళ్యాణ్'. నిర్మాతగా ఎంటర్ అయి 15 సంవత్సరాలు పూర్తయింది. మా బేనర్‌లో వచ్చిన 'ప్రేమలో పావని కళ్యాణ్', 'చంటిగాడు', 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ', 'వైశాఖం' చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇప్పుడు మా ఆర్.జె. సినిమాస్ బేనర్‌లో జయ దర్శకత్వంలో మరో చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ని నిర్మించబో తున్నాం. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన స్టోరీ డిస్కషన్స్ జరుగుతున్నాయి. జూన్‌లో ఈ సినిమాని స్టార్ట్ చేస్తాం. అలాగే మా సూపర్‌హిట్ మ్యాగజైన్ 24వ సంవత్సరంలోకి సక్సెస్‌ఫుల్‌గా అడుగుపెట్టింది. మా వెబ్‌సైట్ ఇండస్ట్రీ హిట్ డాట్ కామ్ మంచి రేటింగ్‌తో నాలుగో సంవత్సరంలోకి ఎంటర్ అయింది'' అన్నారు.

అదే ప్రత్యేకత



'అజ్ఞాతవాసి', 'జై సింహా', 'గ్యాంగ్'.. ఈ మూడు చిత్రాలకి ఉన్న కామన్ పాయింట్ ఏమిటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ సినిమాలన్నీ సంక్రాంతికే సందడి చేయనున్నాయి. అయితే వీటికి మరో కామన్ పాయింట్ ఉంది. అదేమిటంటే.. ఒక్కో సినిమాకి ఒక్కో భాషకి చెందిన నటులు డబ్బింగ్ చెప్పుకోవడం. కాస్త వివరాల్లోకి వెళితే పవన్ కల్యాణ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రానున్న సినిమా 'అజ్ఞాతవాసి'. ఈ చిత్రంలో కీర్తి సురేష్, అను ఇమాన్యుయెల్ కథానాయికలుగా నటించిన విషయం తెలిసిందే. వీళ్ళ మాతృభాష మలయాళం అయినప్పటికీ.. వారి పాత్రలకి వారే తెలుగులో డబ్బింగ్ చెప్పుకుని టాక్ ఆఫ్ టాలీవుడ్ అయ్యారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 10న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది. ఇక సంక్రాంతికి రానున్న మరో తెలుగు చిత్రం 'జై సింహా'. బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహించారు. నయనతార, నటాషా దోషి, హరిప్రియ ఇందులో కథానాయికలుగా నటించారు. వీరిలో హరి ప్రియ తన పాత్రకి తనే డబ్బింగ్ చెప్పుకుంది. హరిప్రియ మాతృభాష కన్నడ. ఇంతకుముందు తెలుగులో నటించినప్పటికీ.. ఈ సినిమా కోసమే తొలిసారిగా డబ్బింగ్ చెప్పుకుంది హరిప్రియ. ఈ నెల 12న ఈ సినిమా తెరపైకి రానుంది.
ఇదే రోజున రిలీజ్ కాబోతున్న తమిళ అనువాద చిత్రం 'గ్యాంగ్'. ఇందులో సూర్య, కీర్తి సురేష్ హీరోహీరోయిన్లు కాగా... విఘ్నేష్ శివన్ దర్శకుడు. ఈ తెలుగు అనువాద చిత్రానికి తమిళ నటుడు సూర్య తన పాత్రకి డబ్బింగ్ చెప్పుకున్నారు. ఇలా.. సంక్రాంతికి విడుదల కానున్న ఈ మూడు సినిమాల్లో కూడా డబ్బింగ్ చెప్పుకున్నవారు తెలుగేతర నటులు కావడం విశేషం. అయినప్పటికీ తెలుగులో చక్కగా వారి వారి పాత్రలకి డబ్బింగ్ చెప్పుకుని కొత్త ట్రెండ్‌కి శ్రీకారం చుట్టారు. బహుశా.. టాలీవుడ్ చరిత్రలోనే ఇలా సంక్రాంతి సీజన్‌లో .. మూడు విభిన్న భాషలకి చెందిన వారు వేర్వేరు సినిమాలకు తెలుగు పలుకులు పలకడం మొదటిసారి అనుకోవాలి. ఈ సినిమాలు సక్సెస్ అయితే.. ఓ మంచి సంప్రదాయం తెలుగునాట కొనసాగే అవకాశం లేకపోలేదు.

బాహుబలి నిర్మాత 'స్వర్ణఖడ్గం'



• సంజన

అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన 'బాహుబలి' చిత్రాన్ని నిర్మించిన ఆర్కా మీడి యా వర్క్స్ సంస్థ బుల్లి తెరపై కూడా సందడి చేయబోతోంది. 'బాహుబలి' చిత్ర నిర్మాతల్లో ఒకరైన దేవినేని ప్రసాద్ 'స్వర్ణఖడ్గం' పేరుతో ఓ భారీ జానపద సీరియల్‌ను నిర్మిస్తున్నారు. సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉండే ఈ సీరియల్‌కు వి.సత్యనారాయణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సీరియల్‌లో సంజన గల్రాని ప్రధాన పాత్ర పోషిస్తోంది. 'బుజ్జిగాడు', 'సర్దార్ గబ్బర్‌సింగ్', 'దండుపాళ్యం2' చిత్రాలతోపాటు తమిళ, కన్నడ భాషల్లో కూడా కొన్ని సినిమాల్లో నటించిన సంజన 'స్వర్ణఖడ్గం'తో బుల్లితెరకు పరిచయం కాబోతోంది. ఈ సీరియల్ కోసం కత్తియుద్ధాలు, గుర్రపు స్వారీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంది సంజన. ఈ సీరియల్ త్వరలోనే ప్రసారం కాబోతోంది.

మలేషియాలో...



• నిహారిక

హీరోల నట వారసులుగా వారి కుమారులు రావడం, వారి వారి టాలెంట్‌ని బట్టి ప్రేక్షకుల ఆదరణ పొందడం మనం చూస్తున్నాం. అయితే కుమార్తెలు వారసులుగా రావడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. కమల్ హాసన్ కుమార్తె శ్రుతి హాసన్ హీరోయిన్‌గా సక్సెస్ అయింది. ఈమధ్యకాలంలో శరత్‌కుమార్ కుమార్తె వరలక్ష్మి, ప్రియదర్శన్ కుమార్తె కళ్యాణి వంటివారు హీరోయిన్లుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఆమధ్య నాగబాబు కుమార్తె నిహారిక 'ఒక్క మనసు' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైంది. బుల్లితెరపై వ్యాఖ్యాతగా కూడా రాణించింది. తొలి సినిమా ఆశించినంత విజయం సాధించకపోవడంతో రెండో ప్రయత్నంగా తమిళ్‌లో ఎంట్రీ ఇవ్వబోతోంది. విజయ్ సేతుపతి, గౌతమ్ కార్తీక్ కీలక పాత్రల్లో నటిస్తున్న 'ఒరు నల్లనాల్ పాతు సోల్రేం' అనే చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా ఆడియోను మలేషియాలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. మలేషియాలో నడిగర్ సంఘం ఆధ్వర్యంలో జరిగే స్టార్ నైట్ కార్యక్రమంలో గ్రాండ్‌గా ఈ చిత్రం ఆడియోను రిలీజ్ చెయ్యబోతున్నారు.

ఫిబ్రవరి 9న 'పద్మావత్'



కొన్ని సినిమాలను వివాదాలు చుట్టుముట్టడం, విడుదల సమయంలో ఆ సినిమాపై నిరసనలు తెలియజేయడం మనం చూస్తుంటాం. ఈమధ్య కాలంలో ఎక్కువ వివాదాలకు తావిచ్చిన సినిమా 'పద్మావతి'. కొన్ని వర్గాల వారు ఈ సినిమా విడుదలను ఆపాలని కోర్టుకు వెళ్ళడం, వాదప్రతివాదాలు జరగడం, సినిమా రిలీజ్‌కి కోర్టు క్లియరెన్స్ ఇవ్వడం కూడా జరిగిపోయింది. అయితే ఇటీవల సెన్సార్ బోర్డ్ సినిమాకు కొన్ని మార్పులతో సెన్సార్ సర్టిఫికేట్‌ను జారీ చేసేందుకు అంగీకరించింది. చిత్రయూనిట్ కూడా సెన్సార్ సభ్యులు సూచించిన మార్పులు చేసేందుకు సుముఖంగానే ఉన్నారు. ముఖ్యంగా టైటిల్‌ను 'పద్మావత్'గా మార్చాలన్న సూచనకు దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ అంగీకరించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 'పద్మావత్' చిత్రాన్ని ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.





సమాజ ప్రగతిలో 'మనం' పాత్ర

- ప్రజాస్వామ్యంలో పత్రికలు కీలకం: అచ్చెన్న
- క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి

శ్రీకాకుళం, జనవరి 6 (మనం ప్రతినిధి): ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని, సమాజ ప్రగతిలో మనం దినపత్రిక తనదైన పాత్ర పోషిస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మనం దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్యాలెండర్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. దమ్మున్న వార్తలు ప్రచురించడంలో 'మనం' తనదైన శైలిలో ముందుకు వెళుతోందన్నారు. మరిన్ని మంచి కథనాలతో ప్రజా సంక్షేమానికి పాటు పడాలని కోరారు.

క్యాలెండర్ అద్భుతం: ధర్మాన

మనం దిన పత్రిక క్యాలెండర్ అద్భుతంగా ఉందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. తన కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. అత్యుత్తమ కథనాలు అందిస్తున్న మనం పత్రిక యాజమాన్యాన్ని అభినందించారు.

మంచి కథనాలు అందిస్తున్నారు: కలెక్టర్, ఎస్పీ

మనం దిన పత్రిక మంచి కథనాలు ప్రచురిస్తోందని కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, ఎస్పీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ పేర్కొన్నారు. క్యాలెండర్‌ను శనివారం వారు ఆవిష్కరించారు. జేసీ2 రజనీకాంతారావు, జడ్పీ సీఈవో నగేష్, మెప్మా పీడీ ఎం.రోజారాణి, ఆర్‌వీఎం పీవో ఎస్.త్రినాథరావు, డీఈవో ఎం.సాయిరాం, డీఎస్పీలు వి.భీమారావు, పెంటారావు, కృష్ణమూర్తి నాయుడు, వేణుగోపాలరావు, సీసీఎస్ ఎస్ఐ నర్సింగరావు మనం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల ఐక్యవేదిక నాయకులు శాసపు జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాల్, మనం బ్యూరో చీఫ్ జి.షణ్ముఖరావు, పాత్రికేయ బృందం పీఎస్ఎన్ఆర్ శర్మ, కృష్ణకాంత్, జి.మోహన్, దేవేందర్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



'మనం' అందరి మనసు గెలవాలి

- పార్టీలకతీతంగా నిలవడం అభినందనీయం
- పత్రిక క్యాలెండర్లు ఆవిష్కరించిన మంత్రి కాల్వ

అనంతపురం, జనవరి 6: 'మనం' దినపత్రిక అందరి మనసులు గెలవాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు ఆకాం క్షించారు. పత్రిక 2018 సంవత్సర క్యాలెం డర్‌ను రాయదుర్గంలో శనివారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాలెండర్‌ను అద్భుతంగా రూపొందించారని అభినందించారు. ప్రస్తుతం ప్రతి పత్రిక ఏదో ఒక పార్టీకి అంకితమై ప్రజలకు వాస్తవాలను అందించడంలో విఫలమవుతున్న తరుణంలో 'మనం' పార్టీలకతీతంగా ఉన్నది ఉన్నట్లు పాఠకులకు నిజాలు చేరవేయడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ ఒరవడిని ఇలాగే కొనసాగిస్తూ అందరి పత్రికగా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకోవాలని కాల్వ శ్రీనివాసులు సూచించారు. తాను కూడా ఒక జర్నలిస్టునేనని, పాత్రికేయుల కష్టాలు తెలిసిన వాడిగా సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్యూరో ఇన్‌చార్జ్ వెంకటేశ్, జిల్లా యాడ్స్ ఇన్‌చార్జ్ గోరంట్ల మస్తాన్ ఖాన్, రాయదుర్గం డివిజన్ రిపోర్టర్ మహేశ్, డివిజన్ పరిధిలోని 'మనం' సిబ్బంది పాల్గొన్నారు.



కారు దగ్ధం

- బ్యాంక్ మేనేజర్ సజీవదహనం
- విధులకు వెళ్తుండగా ఇంజన్‌లో మంటలు
- బయటకు రాలేక అగ్నికి ఆహుతి
- కర్నూలు జిల్లాలో దారుణం
- బాధితుడు విశాఖ వాసి



బనగానపల్లె, జనవరి 6 (మనం న్యూస్): కర్నూలు జిల్లా బనగానపల్లె సమీపంలో కారులో మంటలురేగి ఓ వ్యక్తి అగ్నికి ఆహుతైపోయాడు. కనీసం ఆనవాలు కూడా లేకుండా పూర్తిగా బూడిదైపోయాడు. డోన్ మండలం గార్లదిన్నె గ్రామంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజేష్ (35) శనివారం ఉదయం విధులకు హాజరయ్యేందకు కారులో వెళ్తుండగా ఈ దారుణం జరిగింది. నంద్యాలలో ఉంటున్న రాజేష్ డ్యూటీ నిమిత్తం ఉదయాన్నే కారులో గార్లదిన్నెకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బనగానపల్లె సమీపంలోని దద్దనాల ప్రాజెక్టు వద్దకు చేరగానే ఉన్నట్టుండి కారు ఇంజన్ నుంచి మంటలు రేగాయి. క్షణాల్లోనే కారంతా మంటలు వ్యాపించాయి. రాజేష్ బయటకు రాలేక మంటల్లో చిక్కుకుని కాలి బూడిదయ్యాడు. ఇంజన్‌లోని నుంచి మంటలు రాగానే కారు హ్యాండ్ బ్రేక్ వేసి బయట పడే ప్రయత్నం చేసినట్లు ఆనవాలు తెలుస్తోందని నిపుణులు చెబుతున్నారు. కానీ కారు డోర్ తీసుకుని బయట పడే సమయం కూడా లేక అందులో చిక్కుకుపోయిన రాజేష్ క్షణాల్లో అగ్నికి ఆహుతైపోయాడు. రాజేష్ విశాఖపట్నం వాసిగా తెలుస్తోంది. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదం విషయం తెలిసి వారు గుండెలవిసేలా విలపించారు. కాగా, బనగానపల్లె సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాకేశ్... క్లూస్ టీమ్‌తో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్నూలు రీజనల్ మేనేజర్ రామసుబ్బారెడ్డి, నంద్యాల రీజనల్ మేనేజరు శివశంకరెడ్డి కూడా సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

శ్రీకాళహస్తిలో తాంత్రిక పూజలపై విచారణ

- స్పెషల్ బ్రాంచ్ అధికారుల బృందం రాక
- పలు రికార్డులు.. సీడీలు స్వాధీనం

శ్రీకాళహస్తి, జనవరి 6 (మనం న్యూస్): శ్రీకాళహస్తీశ్వరాలయంలో తాంత్రిక పూజలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై స్పెషల్‌బ్రాంచ్ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ముక్కంటి ఆలయానికి అనుబందంగా ఉన్న కాళభైరవ ఆలయంలో సూపరింటెండెంట్ ధనపాల్ తాంత్రిక పూజలు చేశారనే వార్త రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ విషయమై మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు రావడంతో స్పందించిన స్పెషల్‌బ్రాంచ్ అధికారులు శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఈవో భ్రమరాంబను కలిసి పలు అంశాలపై వివరణ తీసుకున్నారు. ధనపాల్ ఎప్పటి నుంచి ఆలయంలో పనిచేస్తున్నాడు? గతంలో ఏ విధులు నిర్వర్తించాడు? అతడి పనితీరు ఎలా ఉండేది? వంటి విషయాలను తెలుసుకున్నారు. అదేవిధంగా ధనపాల్ అవకతవకలకు సంబంధించిన పలు రికార్డులు, కాళభైరవ ఆలయంలో చేసిన పూజలకు సంబంధించిన సీడీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

గ్రామాల రూపురేఖల మార్పు

- 'జన్మభూమి'తో మౌలిక వసతుల కల్పన
- మూడున్నరేళ్ల నిరంతర శ్రమ ఫలించింది
- అధికారులు వినూత్నంగా ఆలోచించాలి
- అసాధ్యం కూడా సుసాధ్యం: చంద్రబాబు



అమరావతి, జనవరి 6 (మనం ప్రతినిధి): జన్మభూమితో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. తమ ప్రభుత్వం మూడున్నరేళ్ల నిరంతర శ్రమ రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో కనిపిస్తోందని చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం తన నివాసం నుంచి జన్మభూమి- మా ఊరు కార్యక్రమంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందని.. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెరిగిందన్నారు. జన్మభూమి తొలి రోజున మూడు లక్షల మంది పాల్గొంటే... నాలుగో రోజున ఆరున్నర లక్షల మంది పాల్గొన్నారని, మిగిలిన రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతపురంలో 85శాతం ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని, మిగిలిన జిల్లాలు కూడా ఆ స్థాయికి చేరుకోవాలన్నారు. ''ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 34,060 పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఆరున్నర లక్షల పశువులకు చికిత్స అందించారు. వీటి వల్ల రైతులకు, పశు పోషకులకు ఎంతో ప్రయోజనం. అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజల ఆదరాభిమానాలు పొందాలి. కేవలం వైద్య శిబిరాలు నిర్వహణతో సరిపెట్టుకోవద్దు. ఆయా గ్రామాల్లో ఏ వ్యాధి ఎక్కువగా ఉందో పరిశీలించి అందుకు గల కారణాలు అన్వేషించాలి'' అని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

వినూత్నంగా ఆలోచిస్తే అసాధ్యమే లేదు

''మాకు మంచి జరుగుతుందనే భావన ప్రజల్లో రావడం శుభపరిణామం. బాధ్యతతో పనిచేస్తే ఊహించని ఫలితాలు వస్తాయి. సమర్థంగా పనిచేస్తే ఏదీ అసాధ్యం ఉండదు. ప్రతిదీ సాధ్యమే.'' అని చంద్రబాబు పేర్కొన్నారు. నరేగా ఎన్నో ఏళ్లుగా అమల్లో ఉన్నా సక్రమంగా వినియోగించుకోలేకపోయిన విషయం గుర్తు చేశారు. కన్వర్జన్స్‌తో నరేగా ద్వారా 22 శాఖల్లో అద్భుత ఫలితాలు సాధించామని, ప్రతిగ్రామంలో ఆస్తులు సృష్టించామని ప్రస్తావించారు. వినూత్నంగా ఆలోచిస్తే అసాధ్యాలను కూడా సుసాధ్యం చేయవచ్చన్నారు. అమరావతితో రాయలసీమ జిల్లాలకు రోడ్ కనెక్టివిటీని పెంచుతున్నామన్నారు. అమరావతి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్ వస్తుందని వెల్లడించారు.

12న మోదీతో చంద్రబాబు భేటీ

- జన్మభూమి ముగిశాక ఢిల్లీకి సీఎం

అమరావతి, జనవరి 6: ఈ నెల 12న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటకు వెళ్లనున్నట్టు సమాచారం. ప్రధాని నరంద్ర మోదీతో ఆయన భేటీ కానున్నారు. ఈ మేరకు మోదీ అపాయింట్‌మెంట్ కోరినట్టు తెలుస్తోంది. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, రావాల్సిన నిధులపై చంద్రబాబు చర్చించనున్నారు. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నెల 11 వరకూ జన్మభూమి కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత మరుసటి రోజు ఉదయమే చంద్రబాబు ఢిల్లీ వెళ్లనున్నారు.

'విక్రమ సింహపురి'కి 50 కోట్లు

- ఉత్తమ వర్శిటీగా రూపొందిస్తాం: బాబు

నెల్లూరు, జనవరి 6 (మనం న్యూస్ బ్యూరో): విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ అభివృద్ధికి రూ.50 కోట్లు వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అభివృద్ధి ఎలా చేయాలనే అంశంపై నిపుణుల కమిటీని వేసి వారి సూచనల మేరకు నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. శనివారం వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో రూ 26.1 కోట్లతో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ఏ దేశంలోనైనా ఎంత సంపద ఉందన్నది ముఖ్యం కాదని, ఎంత నాలెడ్జ్ ఉందన్నదే ముఖ్యమని అన్నారు. నెల్లూరు జిల్లా బ్రిటిషు వారి కాలం నుంచే అభివృద్ధి చెందిందని, అన్ని సౌకర్యాలతో పాటు పెన్నా, సంగం బ్యారేజీలకు నీళ్లు వచ్చాయని తద్వారా ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీలో అత్యధిక ఆదాయం కల్గినవారు మన తెలుగువారే అన్నారు. చదువు ద్వారానే అభివృద్ధి సాధించవచ్చునన్నారు. ఎక్కడ జ్ఞానం ఉంటే అక్కడ అభివృద్ధి ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. మన విద్యావిధానాల్లో మార్పులు రావాలన్నారు. తాను విదేశాల్లోని యూనివర్సిటీలను సందర్శించినపుడు అక్కడ విద్యార్థులు 4 నెలలు క్లాస్ రూముల్లో వుంటే మిగతా నెలల్లో ఫీల్డ్‌లో ఉంటారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఒక నాలెడ్జ్ హబ్‌గా తయారు కావాలన్నారు. పాత కోర్సులకు కొత్త ఓరియంటేషన్ జరగాలన్నారు. జన్మభూమి ద్వారా రోజుకో అంశం చొప్పున చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. అందరికీ నూరు శాతం గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. మార్చి 31 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ఓడిఎఫ్ చేస్తామన్నారు. విద్యా రంగంలో రాష్ట్రాన్ని దేశం మొత్తం మీద నెం.1 చేయాలన్నదే తన లక్ష్యం అన్నారు. తొలుత ముఖ్యమంత్రి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, విక్రమసింహపురి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి.వీరయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముస్లింలకు సబ్ ప్లాన్

- అధికారంలోకి వచ్చాక తీసుకొస్తాం
- చిత్తూరు పాదయాత్రలో జగన్



చిత్తూరు, జనవరి 6: వైసీపీ అధికారంలోకి రాగానే ముస్లింల కోసం సబ్ ప్లాన్ తీసుకొస్తామని ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. నవరత్నాల ద్వారా పేదలందరికీ సంక్షేమ పథకాల లబ్ధిని అందజేయటమే తన లక్ష్యమని అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా శనివారం చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం కల్లూరులో నిర్వహించిన మైనార్టీల సదస్సులో ఆయన పాల్గొన్నారు. రాబోయే ప్రజా ప్రభుత్వంలో ముస్లింల కోసం సబ్ ప్లాన్ తీసుకొస్తామన్నారు. ''ఇవాళ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఒక్కటే చెప్పదల్చుకున్నా. నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్ర అభివృద్ధి మరుగున పడిపోయింది. ఇలాంటి సమయంలో మనకు కావాల్సింది సమర్థవంతమైన పాలన. రాజకీయాలంటే విశ్వసనీయత కోల్పోయేలా చేసిన వ్యక్తి చంద్రబాబు. రాజశేఖర్ రెడ్డి వారసుడిగా ప్రజల శ్రేయస్సు కోసం ఎందాకైనా వెళ్తా. అదే నా అంతిమ లక్ష్యం'' అని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఒక్కో పేజీలో.. ఒక్కో కులానికి హామీలు ఇచ్చారని, వాటిని నెరవేర్చకపోగా, ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని విమర్శించారు.

ప్రతి ఆవాసానికీ తాగునీరు

- 22 కోట్ల నిధులు ఖర్చు: లోకేశ్



కాకినాడ, జనవరి 6 (మనం న్యూస్ బ్యూరో): వచ్చే ఏడాదికి రాష్ట్రంలో ఏ ఆవాసానికి తాగునీటి సమస్య లేకుండా రక్షిత తాగునీరు అందించేందుకు 22 వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ నియోజక వర్గం పండూరు గ్రామంలో 15 కోట్లు నాబార్డు ఆర్ఐడీఎఫ్-17 నిధులతో నిర్మించిన సూర్యారావుపేట సమగ్ర రక్షిత మంచినీటి పథకం రెండవ దశను ప్రారంభించారు. పిఠాపురం బ్రాంచి కెనాల్ ద్వారా చిత్రాడ నుంచి గోదావరి జలాలను తరలించి నియోజకవర్గంలోని సూర్యారావుపేట, మరో 15 గ్రామాల్లోని 28 ఆవాసాలకు రక్షిత తాగునీటిని ఈ పథకం ద్వారా అందిస్తున్నారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్యం వచ్చి 70 ఏళ్లు గడచినా ఇంకా పలు ఆవాసాలు తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని, ప్రజలందరికీ రక్షిత త్రాగునీరు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పం చేపట్టిందన్నారు. సూర్యారావుపేట ఫేజ్-2 పథకాన్ని ఫాస్ట్రాక్ మోడ్‌లో పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, యంత్రాగాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

కేజీబీవీ.. భరోసా ఏదీ?

- విద్యార్థినులకు కలుషిత ఆహారం వడ్డన
- 40 మందికి అస్వస్థత.. ఇద్దరి పరిస్థితి విషమం
- ఉన్నతాధికారులకు సమాచారంపై జాప్యం
- జి.సిగడాం ఎస్వోతోపాటు ఏఎన్ఎం సస్పెన్షన్

శ్రీకాకుళం, జనవరి 6 (మనం న్యూస్‌బ్యూరో): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) ఏర్పాటు వెనుకగల బాలికా విద్యాభివృద్ధి లక్ష్యం నీరుగారే పరిస్థితి ఏర్పడింది. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం గ్రామంలోని కేజీబీవీలో తమ బిడ్డలకు బంగారు భవిష్యత్తును ఆశించిన తల్లిదండ్రులకు ఆ భరోసా లభించని దుస్థితి తలెత్తింది. బాలికలకు సకల సదుపాయాలూ కల్పించి... పౌష్టికాహారం అందిస్తూ... వారి ఆరోగ్యాన్ని నిరంతరం పరిరక్షిస్తూ... పదో తరగతి వరకూ విద్యాబుద్ధులు నేర్పి పంపడం ఈ విద్యాలయాల కర్తవ్యం. కానీ, అప్పుడప్పుడూ చోటుచేసుకుంటున్న తప్పులు, పొరపాట్లు, అవాంఛనీయ సంఘటనలు ఆ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. సిబ్బంది నిర్లక్ష్యం, నిర్లిప్తత ఫలితంగా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కేజీబీవీల్లో ప్రత్యేక అధికారులదే ఇష్టారాజ్యంగా మారింది. జి.సిగడాం గ్రామంలోని కేజీబీవీలో కలుషిత ఆహారం వడ్డించడంతో 40 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో నలుగురు తీవ్ర అస్వస్థతలో ఉండగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఒకరిని రాజాం, మరొకరిని శ్రీకాకుళం ఆస్పత్రులకు తరలించారు.

విద్యాలయంలో ఇదీ పరిస్థితి


నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థులకు రోజూ కూరగాయలు, పప్పు, సాంబారు, రసంతో కూడిన వేడి అన్నాన్ని వడ్డించాలి. అయితే, జి.సిగడాం కేజీబీవీలో మెనూ ఇందుకు పూర్తి భిన్నంగా అమలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. తాజా కూరగాయలన్నది మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదు. చివరకు వంటపాత్రలను నామమాత్రంగా శుభ్రం చేస్తున్నారని స్పష్టమైంది. కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు లోనైనప్పటికీ ప్రత్యేకాధికారి శిరీష వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడం గమనార్హం. జిల్లా వైద్య-ఆరోగ్యాధికారి సనపల తిరుపతిరావు కేజీబీవీకి వెళ్లి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే వరకూ ఈ సంగతి బయటకు పొక్కలేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మరోవైపు జీసీడీవోల పనితీరుపైనా పలు సందేహాలు వినిపిస్తున్నాయి. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యతను వారు విస్మరించినట్లు ఆరోపణలు వెల్తువెత్తుతున్నాయి. కేజీబీవీలో 6 నుంచి 10వతరగతి వరకు అధిక శాతం బాలికలు చదువుకుంటున్నారు. ప్రభుత్వం అన్నీ ఉచితంగా అందజేస్తుందనే భరోసాతో తల్లిదండ్రులు తమ పిల్లలను వదిలి వెళ్తున్నారు.




ఈ నేపథ్యంలో కలుషిత ఆహారంవల్ల వారు అనారోగ్యం బారినపడ్డారని తెలిసి వారు తల్లడిల్లారు.

ఏమిటీ నిర్లక్ష్యం: పీవో ఆవేదన

ఈ ఘటనపై పీవో త్రినాథరావు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. సమాచారం తెలియగానే జి.సిగడాం వెళ్లి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్వోతోపాటు ఏఎన్ఎం కుమారిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులపై చర్యలు చేపడతామని చెప్పారు.





'పొరపాట్లు దిద్దుబాటలో నీలేకని'

ఇన్ఫోసిస్ కొత్త సి.ఇ.ఓ. పరేఖ్ జీత భత్యాలపై మాజీ సి.ఎఫ్.ఓ. బాలకృష్ణన్ వ్యాఖ్య

బెంగళూరు: ఇన్ఫోసిస్ సహ-స్థాపకుడు నందన్ నీలేకని కంపెనీ బోర్డు ఇంతకుముందు చేసిన 'పొరపాట్లను' చక్కదిద్దుతున్నారని ఇన్ఫోసిస్ మాజీ ఛీఫ్ ఫైనాన్షియల్ అధికారి వి. బాలకృష్ణన్ ప్రశంసించారు. కంపెనీ ప్రస్తుత సి.ఇ.ఓ.కు సహేతుకమైన రీతిలో జీతభత్యాలు నిర్ణయించారని ఆయన వ్యాఖ్యానించారు. ''నందన్ నేతృత్వంలో బోర్డు సరైన పని చేసిందని భావిస్తున్నా. ఇంతకుముందు చేసిన పొరపాటు పనులను చక్కదిద్దుకుంటోంది..ప్రస్తుత ప్రధాన కార్యనిర్వహణాధికారి సలీల్ పరేఖ్‌కు నిర్ణయించిన ప్యాకేజీ రూపురేఖలు సమంజసమైనవిగా కనిపిస్తున్నాయి. ఎక్కువ భాగాన్ని, మార్పుచేర్పులుండే జీతం కోవలో చేర్చారు. దీర్ఘకాలం వ్యక్తిని నిలబెట్టుకోవడంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించారు'' అని బాలకృష్ణన్ అన్నారు. సీనియర్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నవారికి మార్పుచేర్పులుండే జీతభత్యాలు ప్రకటించేటప్పుడు బోర్డు పనితీరుకు సంబంధించిన కొలమానాలను కూడా స్పష్టంగా తెలియజేయడం ముఖ్యమని బాలకృష్ణన్ అన్నారు. ''సర్వోన్నత వృద్ధిని సాధించడం ద్వారా వాటాదార్ల విలువను పెంచడంపై కొలమానాలు స్పష్టంగా దృష్టిపెట్టాలి. బోర్డు ఏవైనా విచక్షణాధికారాలను వినియోగించుకోవాలనుకుంటే, దానికి సరైన కారణాలు వివరిస్తూ, వాటాదార్లకు వివరించాలి'' అని ఆయన అన్నారు. పరేఖ్ జీతాన్ని ఇన్ఫోసిస్ రూ. 6.5 కోట్లుగా నిర్ణయించింది. ఆయన 2018-2019 ఆర్థిక సంవత్సరం చివరలో పరివర్తనశీలమైన రూ. 9.75 కోట్లను పొందడానికి కూడా అర్హులని ప్రకటించింది.




ఇన్ఫోసిస్‌లో ఇంతకుముందు బోర్డు చేసిన 'తప్పిదాలను బాలకృష్ణన్ వివరించారు. ''ఇన్ఫోసిస్ దాని స్థాపకుల సారథ్యంలో అనుసరించే సంస్కృతి, విలువల వ్యవస్థలను దురదృష్టవశాత్తు, అది ఎన్నడూ స్పష్టంగా అర్థం చేసుకోలేకపోయింది. ఇది సీనియర్ మేనేజ్‌మెంట్‌లోనివారి అపరిమిత జీత భత్యాలకు దారితీసింది. సంస్థలోని మిగిలినవారితో సంబంధంలో భారీ అగాధం ఏర్పడింది'' అని ఆయన వ్యాఖ్యానించారు. సి.ఇ.ఓ.కి జీతం పెంచడానికి 2020 నాటికి పెట్టుకున్న 20 బిలియన్ అమెరికన్ డాలర్ల (వ్యాపార) లక్ష్యాన్ని పదేపదే ఉపయోగించుకుంటూ వచ్చారని బాలకృష్ణన్ ఆరోపించారు. కానీ, దానిలో పస లేదని పేర్కొన్నారు. మితిమీరిన క్యాపిటలిజం, సమాజంలోని అత్యధిక వర్గాలు క్యాపిటలిజాన్ని ఆమోదించడాన్ని కష్టంగా మారుస్తుందని ఎన్.ఆర్. నారాయణ మూర్తి వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ''సి.ఇ.ఓ.కు నిర్ణయించే పారితోషికం ఉన్నత ప్రతిభావంతుడిని ఆకర్షించడానికి సరిపోయినంతగా ఉంటే చాలు. అదే సమయంలో, అది ఈ రంగంలోని సహచర కంపెనీలలోని వారు పొందుతున్న దానితో సారూప్యమైనదిగా ఉండాలి'' అని కంపెనీ మాజీ సి.ఎఫ్.ఓ. అన్నారు. ''సంస్థ లోపల వాస్తవికతలను కూడా అది ప్రతిబింబించేదిగా ఉండాలి. లేకపోతే సంస్థ లోపలివారికి నచ్చజెప్పడం కష్టమవుతుంది'' అని కూడా ఆయన అన్నారు. స్థాపకులు కంపెనీని నడిపినప్పుడు, సీనియర్ మేనేజ్‌మెంట్‌లోని వారి జీతభత్యాలు సబబుగా, ఉన్నత ప్రతిభావంతుల ను ఆకర్షించడానికి సరిపోయేవిగా ఉండేవని, అవి మితిమీరినవిగా ఉన్నాయనే భావన ఎన్నడూ కలగలేదని బాలకృష్ణన్ చెప్పారు. అలాగే, గడ్డు రోజుల్లో నాయకత్వం కష్టాన్ని సంస్థలోని ఇతరులకు బదలీ చేసే ముందు తాను భరించేదని ఆయన అన్నారు. ''కంపెనీ వాటాదారుగా నేను, మాజీ సహ-చైర్మన్ (రవి వేంకటేశన్), ఆడిట్ కమిటీ చైర్మన్ (రూపా కడ్వా) వంటి ఒకప్పటి సభ్యులలో కొందరితో కంపెనీ బోర్డును త్వరగా పునర్నిర్మించాలని కోరుకుంటున్నా'' అని బాలకృష్ణన్ చెప్పారు.

NACL Industries Limited
(formerly known as 'Nagarjuna Agrichem Limited')
ISO 9001:2015, ISO 14001:2015, OHSAS 18001:2007 Certified Company

నిధుల సేకరణలో ఎన్.ఏ.సి.ఎల్

న్యూఢిల్లీ: ఎన్.ఏ.సి.ఎల్. ఇండస్ట్రీస్ రూ. 3,000 కోట్లు సమీకరించడానికి బోర్డు ఆమోదం తెలిపినట్లు కంపెనీ శనివారంనాడు వెల్లడించింది. పంట సంరక్షణ వ్యాపారంలో ఉన్న ఈ కంపెనీ ఈ నిధులను వృద్ధి ప్రణాళికలకు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఈ సంస్థ ఇంతకుముందు నాగార్జున ఆగ్రోకెమ్ లిమిటెడ్‌గా సుపరిచితం. కొత్త ఉత్పత్తుల శ్రేణిని అభివృద్ధిపరచడం ద్వారా ఎగుమతులను, దేశీయ వ్యాపారాన్ని పెంచుకునేందుకు కంపెనీ ఒక ప్రణాళికను రూపొందించుకుంది. నడుమంతర, బయో-ప్రాడక్టుల ఉత్పత్తిని విస్తరించుకోవాలని కూడా కంపెనీ భావిస్తోంది. ఈ నిధుల సేకరణ ప్రతిపాదనకు వాటాదార్ల ఆమోదం పొందేందుకు ఫిబ్రవరి 3న అదనపు సర్వసభ్య సమావేశాన్ని కంపెనీ ఏర్పాటు చేసింది.

ఫలితమిస్తున్న సంస్కరణలు



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరానికి ముందస్తు జి.డి.పి. వృద్ధి అంచనా 6.5 శాతంగా ఉండడం, ప్రభుత్వం తీసుకున్న సంస్కరణ చర్యలు ఫలితాలు ఇస్తున్నాయని సూచిస్తోందని, 2018-19 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7 శాతం పైగా ఉండగలదని ప్రధాన మంత్రి ఆర్థిక సలహామండలి చైర్మన్ వివేక్ దేవరాయ్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడవ, నాల్గవ త్రైమాసికాలలో ఆర్థిక వృద్ధి మొదటి ఆరు నెలల్లోకన్నా మెరుగ్గా ఉండగలదని ఆయన చెప్పారు. ''మొత్తం ఏడాదికి 6.5 శాతం అంటే, మూడవ త్రైమాసికంలో అది 6.5 శాతంకన్నా ఎక్కువగా ఉండాలి. నాల్గవ క్వార్టరులో దాదాపు 7 శాతంగా ఉండాలి'' అని దేవరాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధి సంఖ్యలు, పరోక్ష పన్ను వసూళ్ళపై ఆధారపడి ఉంటాయని ఆయన చెప్పారు. అది పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పి.ఎం.ఐ), 8 కోర్ రంగ పరిశ్రమలలో హెచ్చు వృద్ధి, లేదా కార్ల అమ్మకాలపై డాటా ఏదైనా కానివ్వండి ఇప్పటికే పలు సూచీలు మెరుగుదల సంకేతాలు ఇవ్వడం ప్రారంభించాయని ఆయన అన్నారు. ''ప్రభుత్వం చేపట్టిన సంస్కరణ చర్యలు (ఆర్థిక వ్యవస్థను) ఉద్దీపింపజేసి 2018-19లో వృద్ధిని 7 శాతంపైగా తీసుకెళ్ళగలవు'' అని దేవరాయ్ చెప్పారు. ప్రైవేటు పెట్టుబడులు, ఎగుమతులు కూడా త్వరలో పుంజుకోగలవనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తపరచారు. దేశ ఆర్థిక వృద్ధి గత నాలుగేళ్ళలో లేనంత కనిష్ఠ స్థాయిలో 2017-18లో 6.5 శాతంగా ఉండగలదని, వ్యవసాయ, వస్తూత్పత్తి రంగాల పనితీరు పేలవంగా ఉండడమే దానికి ప్రధాన కారణమని శుక్రవారం విడుదలైన కేంద్ర గణాంకాల కార్యాలయ (సి.ఎస్.ఓ) డాటా వెల్లడించింది. జి.డి.పి.లో వృద్ధి 2016-17లో 7.1 శాతంగా ఉంది.





ఫార్మా ఆదాయం అంతంత మాత్రమే

- డిసెంబరు త్రైమాసికానికి 'ఇడెల్‌వెయిస్' అంచనా

న్యూఢిల్లీ: భారతీయ ఔషధాల తయారీ రంగ రాబడులు ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఇప్పుడున్న స్థితిలోనే కొనసాగవచ్చని ఇడెల్‌వెయిస్ సెక్యూరిటీస్ నివేదిక వెల్లడించింది. అమెరికా నుంచి ఉన్న వ్యాపారాలు తగ్గడం, డాలరుతో రూపాయి మారకం విలువ హఠాత్తుగా పెరగడంతో ఫార్మా కంపెనీల లాభాలు తగ్గవచ్చని ఆ నివేదిక సూచించింది. అక్టోబరు-డిసెంబరు క్వార్టర్ ''యాక్షన్ ప్యాక్డ్''గానే ఉన్నా ఆదాయాలు పెరగకపోవచ్చని ఆ నివేదిక పేర్కొంది. ఆదాయాలు 15 శాతం, లాభాలు 19 శాతం తగ్గుదలను చూడవచ్చని తెలిపింది. అమెరికా డాలరుతోనే కాకుండా బ్రెజిలియన్ రియాల్, జపనీస్ యెన్, దక్షిణాఫ్రికా ర్యాండ్‌లతో కూడా రూపాయి మారకం విలువ పెరిగిందని తెలిపింది. అమెరికా నుంచి వ్యాపారం తగ్గడం, రూపాయి బలపడడం వల్ల భారతీయ ఫార్మా కంపెనీల ఆదాయాలు అంతంత మాత్రంగానే ఉండవచ్చని వెల్లడించింది. అయితే, గత ఆర్థిక సంవత్సరంలోని అదే కాలంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో ఫార్మా కంపెనీలకు దేశీయ అమ్మకాలు 12 శాతం వృద్ధి చెందవచ్చని అంచనా వేసింది. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ అక్టోబరు-డిసెంబరు కాలంలో ఇండియా ఫార్మా కంపెనీల 246 మందులకు ఆమోదం తెలిపింది. ఒకే క్వార్టరులో ఇంత పెద్ద సంఖ్యలో అవి ఇంతకు ముందెన్నడూ ఆమోదం పొందలేదు. కానీ, ఆమోదాలలో కనిపించిన వేగం పోటీ పెరగడానికి, ధరలు తగ్గించవలసిరావడానికి కారణమైందని, మొత్తంమీద ఫార్మా రంగ ఆదాయాలు అణగాయని ఇడెల్‌వెయిస్ తెలిపింది.

పెట్టుబడులపై ఆశలు

కోల్‌కతా: ఉత్తర ప్రదేశ్‌లో ఫిబ్రవరి 21-22 తేదీలలో నిర్వహించనున్న పెట్టుబడుల శిఖరాగ్ర సదస్సును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఆ సందర్భంగా లక్ష కోట్ల పెట్టుబడులకు అవగాహనా పత్రాలపై సంతకాలు జరుగగలవని భావిస్తున్నట్లు ఉత్తర ప్రదేశ్ మౌలిక వసతుల, పారిశ్రామిక అభివృద్ధి కమిషనర్ అనుప్ చంద్ర పాండే చెప్పారు. ఆ శిఖరాగ్ర సదస్సుకు ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు శనివారం ఇక్కడ ఒక రోడ్‌షో నిర్వహించారు. దీనిలో ఉత్తర ప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి మంత్రి సతీశ్ మహానా కూడా పాల్గొన్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లో ఏక గవాక్ష పద్ధతిని ప్రవేశపెట్టి, నెల దాటకుండా అనుమతులిస్తామని ఆయన తెలిపారు. పరిశ్రమలకు పది వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందని చెప్పారు.

లక్ష పైబడితే డిపాజిట్టే

IndusInd Bank

న్యూఢిల్లీ: కస్టమరు బ్యాలెన్సు లక్ష రూపాయలకు మించి ఉన్నప్పుడు, 1 లక్షకు పైబడిన మొత్తాన్ని ఆటోమేటిక్‌గా ఫిక్సెడ్ డిపాజిట్‌గా మార్చే సదుపాయాన్ని ప్రవేశపెట్టేందుకు ఇండస్‌ఇండ్ బ్యాంక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ శనివారంనాడు ప్రకటించింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదార్లు ఎలాంటి ముందస్తు మూసివేత లేదా అమాంబాపతు చార్జీలు చెల్లించనవసరం లేకుండా తమ డిపాజిట్లను ఏ సమయంలోనైనా తక్షణం వెనక్కి తీసుకోవచ్చు. అలాంటి డిపాజిట్ మొత్తాలపై 6.85 శాతం వార్షిక వడ్డీ చెల్లిస్తారు. అదనంగా మరో సౌకర్యం కల్పించారు. మెచ్యూరిటీ పీరియడ్‌కన్నా ముందే ఖాతాదారు సీనియర్ పౌరునిగా పరిణమిస్తే, సీనియర్ సిటిజన్ పథకం కింద ఆ ఖాతా ఆటోమేటిక్‌గా రెన్యూ అవుతుంది. ఫలితంగా, అధిక వడ్డీ సంపాదించవచ్చు. ''భారతీయుల్లో అత్యధికులు అధిక రాబడి సామర్థ్యం ఉన్న, సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలకు ప్రాధాన్యం ఇస్తారు. మేం కల్పిస్తున్న అవకాశంలో, నేటి కాలమాన పరిస్థితులకు ఎంతో ఉపయుక్తమైన రీతిలో కాగితాలతో పని లేదు. తలచుకున్న క్షణంలో డిపాజిట్‌ను నగదుగా మార్చుకోవచ్చు. ఫారాలు నింపనవసరం లేదు. చార్జీలు చెల్లించనక్కర లేదు. ఇది భారతదేశపు అత్యంత ప్రాధాన్యతాయుతమైన మదుపు పద్ధతులలో ఒకటి అవుతుంది'' అని పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సి.ఇ.ఓ. రేణు సత్తి చెప్పారు.



కార్గో నిర్వహణలో వృద్ధి

న్యూఢిల్లీ: దేశంలో 12 ప్రధాన నౌకాశ్రయాలు 2017 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో 3.64 శాతం వృద్ధిని కనబరుస్తూ, 499.41 మిలియన్ టన్నుల కార్గోతో వ్యవహరించాయి. ఎనిమిది పెద్ద (హల్దియాతో సహా కోల్‌కతా, పారదీప్, విశాఖపట్నం, చెన్నై, కొచ్చిన్, న్యూ మంగళూరు, జె.ఎన్.పి.టి., కాండ్లా) పోర్టులు ఈ కాలంలో ట్రాఫిక్‌లో సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. ''దేశంలో మేజర్ పోర్టులు 2017 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 499.41 మిలియన్ టన్నుల కార్గోతో వ్యవహరించాయి. అవి 2016లో అదే కాలంలో, 481.87 మిలియన్ టన్నుల కార్గోతో మాత్రమే వ్యవహరించాయి'' అని నౌకాయాన మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. కొచ్చిన్ పోర్టు అత్యధికంగా 17.27 శాతం వృద్ధిని నమోదు చేసింది. తర్వాత స్థానాలలో పారదీప్ (14.59 శాతం), కోల్‌కతా (12.45 శాతం), న్యూ మంగళూరు (6.60 శాతం), జె.ఎన్.పి.టి. (5.94 శాతం) నిలిచాయి. కొచ్చిన్ పోర్టు వృద్ధికి పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్లు (24.10 శాతం), కంటైనర్ల (10.79 శాతం) ట్రాఫిక్ పెరగడం ప్రధాన కారణం. కోల్‌కతా పోర్టులో మొత్తంమీద వృద్ధి 12.45 శాతంగా ఉంది. 2017 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో ట్రాఫిక్‌లో అత్యధిక పరిమాణం 81.12 మిలియన్ టన్నులతో కాండ్లా పోర్టు వ్యవహరించింది. తర్వాత స్థానాలలో పారదీప్ (74.40 మిలియన్ టన్నులు), జె.ఎన్.పి.టి.(48.89 మిలియన్ టన్నులు), ముంబయి (47.53 మిలియన్ టన్నులు), విశాఖపట్నం (46.56 మిలియన్ టన్నులు) నిలిచాయి. ప్రధాన పోర్టుల ట్రాఫిక్‌లో దాదాపు 60 శాతం భాగంతో ఈ ఐదు పోర్టులే వ్యవహరించాయి. దేశంలో 12 మేజర్ (కాండ్లా, ముంబయి, జె.ఎన్.పి.టి, మార్మగోవా, న్యూ మంగళూరు, కొచ్చిన్, చెన్నై, ఎన్నూరు, వి.ఓ. చిదంబరనార్, విశాఖపట్నం, పారదీప్, కోల్‌కతా (హల్దియాతో కలుపుకొని) పోర్టులున్నాయి. దేశానికి చెందిన మొత్తం కార్గో ట్రాఫిక్‌లో సుమారు 61 శాతం భాగాన్ని ఇవే నిర్వహిస్తాయి.



ఐ.సి.ఏ.ఐ కొత్త కోర్సులు


కోయంబత్తూరు: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐ.సి.ఏ.ఐ) వచ్చే నెల నుంచి వృత్తి నిపుణులకు నాలుగు కొత్త కోర్సులు ప్రారంభిస్తోంది. సంస్థ సభ్యులు, సభ్యులుకానివారు కూడా ఈ కోర్సులు చదువుకోవచ్చని ఐ.సి.ఏ.ఐ. ఉపాధ్యక్షుడు హెచ్. పద్మనాభన్ శనివారంనాడిక్కడ మీడియా ప్రతినిధులకు చెప్పారు. అవి, ఎగ్జిక్యూటివ్ డిప్లొమా ఇన్ బిజినెస్ వాల్యుయేషన్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఆర్బిట్రేషన్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ జి.ఎ స్.టి., కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ ఎకౌంటింగ్ ఫర్ ఇంజనీర్స్‌కు ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ డిప్లొమా. మూల్యాంకనం, ముఖ్యంగా ఫైనాన్షియల్ మూల్యాంకనం ముఖ్యమైన వృత్తిగా ఆవిర్భవిస్తోందని, ఆర్బిట్రేషన్ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానమని, కోర్టు బయట వివాదాల పరిష్కారానికి అనుసరించదగిన మార్గమని పద్మనాభన్ చెప్పారు. జి.ఎస్.టి. ప్రధానమైన పన్ను సంస్కరణ. మార్పు తీసుకొచ్చిన అంశం. వృత్తినిపుణులైనవారు ప్రతి ఒక్కరూ దానిని అర్థం చేసుకోవడం, కొత్త పన్నుల విధానానికి అలవాటుపడడం అవసరమని ఆయన అన్నారు. దానికి అనుగుణంగా పాటించవలసినవి కొన్ని కొత్తవి వచ్చాయి. వ్యాపార ప్రక్రియలలో మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన చెప్పారు. మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛ భారత్ అభియాన్, జి.ఎస్.టి. ఒక దేశం ఒక పన్నుకు మద్దతు ఇవ్వడం ద్వారా దేశ నిర్మాణ కార్యకలాపాలకు ఊతమివ్వడంలో ఇన్‌స్టిట్యూట్ ఇటీవలి కాలంలో క్రియాశీల పాత్ర వహిస్తోందని పద్మనాభన్ చెప్పారు. కాస్ట్, ప్రైసింగ్‌పై రైల్వేలకు ఒక ఎకౌంటింగ్ పద్ధతిని రూపొందించిన తమ సంస్థ రక్షణ, విమానయాన మంత్రిత్వ శాఖలకు కూడా అలాంటి పని చేపట్టనున్నదని ఆయన చెప్పారు.

దివాలా కంపెనీలకు ఊరట

న్యూఢిల్లీ: కార్పొరేట్ దివాలా ప్రొసీడింగులను ఎదుర్కొంటున్న కంపెనీలపై విధించే కనీస ప్రత్యామ్నాయ పన్ను (ఎం.ఏ.టి)కి సంబంధించిన నిబంధనలను ఆదాయ పన్ను శాఖ శనివారంనాడు సడలించింది. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 115జెబి ప్రకారం ఈ పన్నుని విధిస్తారు. బ్రాట్ ఫార్వర్డ్ చేసిన నష్టాన్ని లేదా స్వీకరించని తరుగుదలను మినహాయించి బుక్ ప్రాఫిట్‌పై ఎం.ఏ.టి.ని విధిస్తారు. పన్ను లెక్కగట్టేటప్పుడు ఆ రెండు మొత్తాల్లో ఏది తక్కువైతే దాన్ని మినహాయిస్తారు. సవరించిన నిబంధనల ప్రకారం, ఇకపై ఆ రెండు మొత్తాలను కూడా బుక్ ప్రాఫిట్ నుంచి మినహాయించి మిగిలిన మొత్తంపైన మాత్రమే ఎం.ఏ.టి.ని లెక్కగడతారు. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న కంపెనీలు దీన్ని ఉపయోగించుకోవచ్చు. 2018-19 (ఎఫ్.వై 2017-18) అసెస్‌మెంట్ ఏడాది నుంచి ఇది అమలులోకి వచ్చినట్లు లెక్క. అటువంటి కంపెనీలు నిజంగా ఎదుర్కొంటున్న కష్టాలను తగ్గించేందుకు నిబంధనలు సడలించినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సి.బి.డి.టి) తెలిపింది.

మసాలా దినుసులకు మహా గిరాకీ

న్యూఢిల్లీ: మసాలా దినుసులు పండించేవారికి 2018 సంవత్సరం సంతోషాలను పంచిపెట్టే అవకాశం ఉంది. అయితే, అది ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. గత ఏడాది, చట్టబద్ధంగా, చట్టవిరుద్ధంగా సాగిన దిగుమతులు మిరియాలు, పోకచెక్కలు వంటి వస్తువుల ధరలను మందగింపజేశాయి. చట్టవిరుద్ధ దిగుమతులను అరికడితే ఈ ఏడాది దేశీయ వర్తకులకు పరిస్థితులు మెరుగుపడవచ్చు.




మిరియాలు: మిరియాలు పండించేవారికి 2018లో పరిస్థితులలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. ఈ ఏడాది మిరియాల దిగుబడి 80,000 టన్నుల మేరకు ఉండవచ్చని ఎం.ఎన్.సి. ఆపరేటర్లలో ఒక వర్గం అంచనా వేస్తోంది. ఒక టన్ను 1000 కిలోలకు సమానం. అధికారిక అంచనా 64,000 టన్నుల మేరకు ఉండవచ్చని సూచిస్తోంది. కర్ణాటక, కేరళలలో మిరియాలు పండించేవారు దిగుబడి దాదాపు 58,000 టన్నుల మేరకు ఉండవచ్చని భావిస్తున్నారు. మిరియాలకు దేశీయ డిమాండ్ 60,000 టన్నులకు, ఎగుమతుల డిమాండ్ 21,000 టన్నులకు ఉండగలదని అంచనా. అంతర్జాతీయంగా మిరియాలు 2018లో 5,48,896 టన్నులు అందుబాటులో ఉండగలవని అంచనా. ప్రపంచ మిరియం వర్తకులు 5,47,183 టన్నులు అందుబాటులో ఉండగలవని భావిస్తున్నారు. ఇతర ప్రాంతాలలో తక్కువ రేట్లకి మిరియాలు ఎక్కువగా అందుబాటులోకి రావడం, దేశంలో దిగుబడి పెరగడానికి అవకాశం ఉండడం మిరియాల ధరలలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. శ్రీలంక, వియత్నాంల నుంచి మిరియాల రాకను అరికట్టేందుకు వాణిజ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించిన కనీస దిగుమతి ధరను కట్టుదిట్టంగా అమలుజరుపవలసి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చిన్నసైజు ఏలకులు: ఏలకుల ధరలు 2016 స్థాయిల నుంచి దిగివచ్చినప్పటికీ, 2017 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో ఏలకులు కిలో దాదాపు రూ. 950 చొప్పున పలుకుతూ వచ్చాయి. ఏలకులు పండించినవారికి ఫరవాలేదు. గిట్టుబాటు ధర లభించిందనే భావన నెలకొంది. లోపలి ప్రాంతాలలోని మార్కెట్లలో ఉన్న అమ్ముడుపోని నిల్వలు తగ్గాయి. డిమాండ్ కూడా పెరిగింది. ప్రస్తుతం ఏలకుల ధరలు ఓ మోస్తరుగా ఉండడానికి అవే కారణాలని భావిస్తున్నారు. సరఫరాకన్నా డిమాండ్ ఎక్కువగా ఉండవచ్చని భావిస్తున్నందు వల్ల 2018లో కూడా ఏలకుల ధరలు హెచ్చు స్థాయిల్లోనే ఉండవచ్చు. ప్రస్తుత సీజన్‌లో (2017 ఆగస్టు 1 నుంచి 2018 జూలై 31 వరకు) మొత్తం ఏలకుల దిగుబడి 20,000 టన్నుల నుంచి 25,000 టన్నుల మధ్య ఉండవచ్చని అంచనా.



లవంగాలు: లవంగాలు 2016లో కిలో రూ. 750 దాకా పలికాయి. గత ఏడాది అవి రూ. 500 స్థాయికి క్షీణించాయి. పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి., లవంగాలు ఎక్కువగా అందుబాటులో ఉండడం వాటి ధరలు తగ్గడానికి కారణంగా పరిగణించారు. కానీ, ఈ ఏడాది పరిస్థితిలో మార్పు ఉండవచ్చు. దేశంలో లవంగాల వచ్చే పంట, 2017లో లభించిన దిగుబడికన్నా 20-30 శాతం తక్కువగా ఉండవచ్చని అంచనా. నైరుతి రుతుపవనాలు సరైన రీతిలో లేకపోవడం వల్ల లవంగాల పంట తగ్గుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లవంగాలను ప్రధానంగా సరఫరా చేసే దేశాల్లో 2018లో పంట తక్కువగా ఉందని చెబుతున్నారు. దేశంలో ఈ ఏడాది లవంగాల దిగుబడి గత ఏడాది దిగుబడిలో సగం మేరకే ఉండవచ్చని భావిస్తున్నారు. దేశంలో ఏటా లవంగాలకు 20,000 టన్నులకు డిమాండ్ ఉంది. దాంతో భారత్ లవంగాలను దిగుమతి చేసుకుంటోంది. భారత్ 2016-17లో రూ. 869.70 కోట్ల విలువైన, 17,095 టన్నుల లవంగాలు దిగుమతి చేసుకుంది. కనుక, మసాలా దినుసుల ధరలు మరింత పెరగవచ్చు.





పిల్లల్లో వీటిని గమనించండి

- ఆటిజం ఉన్న పిల్లల్లో కొన్ని అసాధారణ లక్షణాలు ఉంటాయి. పిల్లల తీరును పరిశీలించడం ద్వారా వాటిని గమనించవచ్చు.
- పిల్లలకు ఆర్నెల్ల వయసు వచ్చినా నవ్వు వంటి భావాన్ని చూపకపోవడం
- తొమ్మిది నెలల నాటికి ధ్వనులను, ముఖంలోని భావాలను గుర్తించలేకపోవడం
- 12 నెలలు వచ్చినా పిలుపునకు స్పందించకపోవడం, శబ్దాలు చేయకపోవడం
- 14 నెలల నాటికి కూడా సైగలు చేయలేకపోవడం (ఏదైనా కావాలని చూపించడం, ఎత్తుకోవాలంటూ చేతులు చాచడం వంటివి)
- 16 నుంచి 18 నెలల వయసు వచ్చే సరికి ఒక్కో మాటను ఉచ్చరించలేకపోవడం
- ఏ వయస్సులో అయినా ముందు నుంచే నేర్చుకున్న మాటలు, చేష్టలు ఆగిపోవడం.
- ఎప్పుడూ ఒంటరిగా కూర్చోవడం, ఒంటరిగా ఆడుకోవడం
- కళ్లలోకి కళ్లు పెట్టి చూడకపోవడం, ఓ రకమైన గొంతుతో మాట్లాడడం.
- అర్థమేమిటో తెలియకున్నా కొన్ని పదాలను పదే పదే అంటూ ఉండడం
- చిన్న చిన్న ప్రశ్నలను, సూచనలను కూడా అర్థం చేసుకోలేకపోవడం
- దురుసుగా ప్రవర్తించడం, తల బాదుకోవడం, దేనినీ అనుకరించలేకపోవడం

అందరిదీ ఒకే ఆలోచన!

ఆటిజానికి ఇది కచ్చితమైన కారణమని, కచ్చితంగా ఇవి ఆటిజం లక్షణాలని నిర్ధారించే అంశాలేమీ లేవు. బుద్ధి మాంద్యం అని దీనిని పేర్కొంటున్నా, చురుకుదనం ఉండదని చెబుతున్నా... వాస్తవానికి ఈ పిల్లలు అందరూ ఒకేలా ఉండరు. వాస్తవంగా చెప్పాలంటే ఆటిజం ఉన్న పిల్లలను అర్థం చేసుకోవడం కష్టం. ఇలాంటి పిల్లల్లో కొందరు అసలేం మాట్లాడరు. కానీ బొమ్మలతో, చిన్న చిన్న పజిల్లతో ఆడుకోవడం వస్తుంది. మరికొందరు మాట్లాడుతారు. కానీ బొమ్మలతో ఆడుకోవడం రాదు. ఊహించే శక్తి ఉండదు. వాస్తవంగా చెప్పాలంటే ఆటిజం అనేది కొద్దిగా శ్రద్ధ పెడితే సులువుగానే బయటపడగలిగిన సమస్య. దీని గురించి ఎక్కువ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అలాగని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దు.

కొందరు పిల్లలు ఎప్పుడూ ముభావంగా ఉంటారు.. పిలిచినా పెద్దగా స్పందించరు.. ఎవరితోనూ మాట్లాడరు.. ఎలాంటి భావాన్నీ వ్యక్తీకరించరు. చదువులోనూ వెనుకబడుతుంటారు.. ఇవన్నీ ఆటిజం (బుద్ధి మాంద్యం) లక్షణాలు. పిల్లల్లో నాడీ వ్యవస్థ సరిగ్గా అభివృద్ధి చెందకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. దీని బారిన పడినవారిలో మానసిక ఎదుగుదల లోపిస్తుంది. ఇది ఎక్కువగా మగ పిల్లల్లోనే కనిపిస్తుంది. ఇది పుట్టుకతో వచ్చే సమస్య. అయినా కూడా రెండు మూడేళ్ల వయసు వచ్చేదాకా గుర్తించుకుంటారు...? లేదో..? ఇప్పుడు తెలుసుకుందాం...



పిల్లల్లో ముభావమా?

మానసిక సమస్యలెన్నో..!



ఆటిజం బారినపడినవారు నలుగురితో కలవలేరు. ముభావంగా ఉంటారు. నేరుగా కళ్లలోకి చూసి మాట్లాడలేరు. భావోద్వేగాలను వ్యక్తం చేయలేరు. వయసుకు తగిన పరిణతి లేకపోవడం, ఒకే మాటను పదే పదే చెబుతుండడం, ఒకే రకమైన ఆహారం, దుస్తులు కావాలనడం, చేతులు, కాళ్లు విచిత్రంగా కదపడం వంటి లక్షణాలూ కనిపిస్తుంటాయి. ఆడి, పాడే వయసులో పిల్లలు ముభావంగా, అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారంటే వారిలో కచ్చితంగా ఆటిజం ఉండవచ్చు.

వ్యాధికి కారణమేమిటి?



ఆటిజం సాధారణంగా జన్యు సంబంధిత లోపాల వల్ల ఏర్పడే వ్యాధి. మెదడు ఎదుగుదలకు తోడ్పడే కొన్ని జన్యువులు, క్రోమోజోముల్లో లోపం వల్ల ఈ వ్యాధి వస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు రుబెల్లా, సైటోమెగాలో వైరస్ ఇన్ఫెక్షన్లు వచ్చినా.. డ్రగ్స్, ఆల్కాహాల్ అలవాటు, థైరాయిడ్, మధుమేహం వంటి సమస్యలున్న వారి పిల్లలకు బుద్ధి మాంద్యం వచ్చే అవకాశం ఉంది. కాన్పు సమయంలో బిడ్డ మెదడుకు తగినంత ఆక్సిజన్ అందక దెబ్బతినడం వంటి కారణంగా, మహిళలు లేటు వయసులో పిల్లలను కనడం ద్వారా కూడా బుద్ధి మాంద్యం తలెత్తే అవకాశం ఉంది. బాల్యంలో విపరీతమైన మానసిక సంఘర్షణకు గురైన పిల్లల్లో ఆటిజం తలెత్తే అవకాశం ఉంది.

సరిగా గమనిస్తే ముందుగానే గుర్తించవచ్చు!

ఏడాది, ఏడాదిన్నర వయసులోనే పిల్లల ప్రవర్తన తీరును సరిగ్గా గమనిస్తే 'ఆటిజం'ను గుర్తించవచ్చు. దాంతో వీలైనంత త్వరగానే సరిదిద్దే అవకాశం ఉంటుంది. అకారణంగా నిరంతరాయంగా ఏడవడం, గంటల తరబడి మౌనంగా ఉండిపోవడం, తల్లిదండ్రులు దగ్గరకు తీసుకుంటున్నా పెద్దగా స్పందించకపోవడం, పరిచిత వ్యక్తులను చూడగానే నవ్వకపోవడం వంటివి బుద్ధి మాంద్యం కారణంగా వచ్చే లక్షణాలు. దీనిని తొలి దశలోనే గుర్తించి, చికిత్స చేయడానికి అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. ఆటిజంతో బాధపడుతున్న పిల్లల్లో హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏ పనైనా వేగంగా చేయడం, కాళ్లు, చేతులు కదుపుతూనే ఉండడం, ఉద్వేగం లక్షణాలు ఉండే రుగ్మత), స జనాత్మకత లోపం, మూరే వ్యాధి, మానసిక కుంగుబాటు వంటివి కూడా కమ్ముకుంటాయి. సాధారణంగా పిల్లల వైద్యులు కొన్ని రకాల ప్రశ్నలతో ఓ సర్వే వంటిది చేసి పిల్లల మానసిక స్థితిని అంచనా వేస్తారు. అలా పరిశీలించాక ఆటిజం లక్షణాలేవైనా కనిపిస్తే.. ప్రత్యేక నిపుణులను కలవాల్సిందిగా సిఫారసు చేస్తారు. నిపుణులు ఆ పిల్లలను పరిశీలించి.. అది సాధారణ ఎదుగుదల లోపమా? లేక బుద్ధి మాంద్యమా అన్నది నిర్ధారిస్తారు.

కావాల్సింది ప్రేమ, ఆప్యాయత, శద్ధ!

'ఆటిజం'కు కచ్చితమైన చికిత్స అంటూ ఏదీ లేదు. ఇప్పటివరకూ శాస్త్రవేత్తలు ఎలాంటి ఔషధాలనూ తయారు చేయలేకపోయారు. దీనితో బాధపడుతున్న పిల్లలకు కొన్ని రకాల ప్రవర్తనా, విద్యా సంబంధిత థెరపీలను అనుసరించడం ద్వారా వ్యాధి లక్షణాలను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా వీలైనంత ముందుగానే గుర్తించి.. చర్యలు తీసుకుంటే ఫలితం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా 'ఆటిజం' సమస్య నుంచి పిల్లలు బయటపడడంలో అత్యంత ప్రధానమైన పాత్ర తల్లిదండ్రులు, తోడబుట్టినవారు, వారితో ఎక్కువగా గడిపేవారి చేతుల్లోనే ఉంటుంది. ముఖ్యంగా పిల్లల చుట్టూ ఉన్న కుటుంబ వాతావరణం, పరిస్థితులు, తనతో ఉన్నవారు వ్యవహరించే తీరును బట్టి మెదడు జీవ ప్రక్రియల్లో మార్పులు జరుగుతాయని.. దాంతో పిల్లలు ఆటిజం సమస్యను అధిగమించగలరని శాస్త్రవేత్త మయడా ఎల్సాబాగ్ చెప్పారు. అయితే ఆటిజం పిల్లల్లో హైపర్ యాక్టివిటీ, చికాకు, డిప్రెషన్ వంటి సమస్యలను మాత్రం కొన్ని రకాల మందులతో తగ్గించవచ్చని తెలిపారు.

ప్రత్యేక విధానాలూ ఉన్నాయి!

ఆటిజంతో బాధపడుతున్నవారి కోసం కొన్ని ప్రత్యేకమైన ప్రక్రియలు, విధానాలు ఉన్నాయి. స్పెషల్ ఎడ్యుకేషన్, ఆక్యుపేషనల్ థెరపీ, ఎర్లీ ఇంటర్వెన్షన్ ట్రయినింగ్, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ, సైకలాజికల్ కౌన్సెలింగ్ వంటివి అవలంబిస్తారు. మరోవైపు బుద్ధి మాంద్యం ఉన్న పిల్లలతో ఎలా వ్యవహరించాలన్న దానిపై తల్లిదండ్రులకు, వారితో కలసి నివసించేవారికి ప్రత్యేక శిక్షణ, కౌన్సెలింగ్ ఇస్తారు.


డిస్ లెక్సియా బుద్ధి మాంద్యం కాదు

మనకు తెలియని కొత్త విషయాలను నేర్చుకునే శక్తి పుట్టుకతోనే వస్తుంది. కానీ కొందరు చిన్నారుల్లో ఈ నేర్చుకునే శక్తిలో లోపం ఏర్పడుతుంది. అంటే



ప్రోత్సాహాన్ని ఇవ్వాలి

బుద్ధి మాంద్యంతోగానీ, డిస్ లెక్సియాతోగానీ బాధపడుతున్న పిల్లల పరిస్థితిని మెరుగుపర్చాలంటే.. వారిలో చురుకుదనం తేవాలి. ఏ పనికైనా వారిలో కావాల్సిన ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. వారిలో ఉన్న అదుతే మేధోశక్తిని వెలికి తీయడానికి ప్రయత్నించాలి. కేవలం పుస్తకాలు, చదువు సంధ్యలు రానంత మాత్రాన ఆందోళన చెందవద్దు. వారు విభిన్న అంశాల్లో ఎంతో సృజనాత్మకత చూపగలుగుతారు. ఆటిజం లక్షణాలకు దూరంగా ఉండేలా ఏదైనా మంచి పని చేసినప్పుడు పిల్లలకు వారికి నచ్చే బహుమతులు ఇవ్వాలి. సృజనాత్మకత పెంచే పనులు చేసేలా, తోటివారితో కలసి ఆటలు ఆడేలా ప్రోత్సాహం కల్పించాలి.



మాట్లాడడం, అక్షరాలు, అంకెలు రాయడం, వాటిని గుర్తించడంలో గందరగోళం ఉంటుంది. కొద్దిపాటి తేడాలున్న అంకెలు, అక్షరాలను ఒకదానిని మరొకటిగా పొరపడుతుంటారు. సమయ పాలనను అనుసరించలేరు. చదివినదానిని గుర్తుపెట్టుకోలేరు. ఈ లోపాన్నే 'డిస్ లెక్సియా' అంటారు. దీనిని ఆటిజం (బుద్ధి మాంద్యం)గా భావించవద్దు. ఆటిజం పూర్తిస్థాయి సమస్యకాగా.. డిస్ లెక్సియా అందులో ఓ చిన్న లక్షణం మాత్రమే. దీని నుంచి చిన్నారులు చాలా సులువుగా బయటపడొచ్చు. డిస్ లెక్సియా ఉన్న వారి మెదడు భాషను, పదాలను, అక్షరాలను సరిగా విశ్లేషించలేదు. సాధారణంగా దీనిని చిన్న వయసులోనే గుర్తించి, తగిన శిక్షణ ఇవ్వడం ద్వారా అధిగమించేలా చేయవచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం 'డిస్ లెక్సియా' జీవితాంతం కొనసాగుతుంది. మెదడు నిర్మాణంలోని లోపాల కారణంగా ఏర్పడే ఈ వ్యాధి వంశ పారంపర్యంగా వచ్చే అవకాశం ఎక్కువ.

అధిగమించి మేధావులైనవారెందరో..


చిన్న వయసులో డిస్ లెక్సియా బారిన పడినా... దానిని అధిగమించి చరిత్రలో తమదైన ముద్ర వేసిన ప్రముఖులెందరో ఉన్నారు.

జీవితంలో వెనుకబాటు

ఆటిజం, డిస్ లెక్సియాల బారిన పడినవారిలో చాలా మంది సరైన చికిత్స తీసుకోకుంటే.. పెద్దయ్యాక సాధారణ జీవితం గడపలేరు. జీవితంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారు. చదువులో వెనుకబడడంతో మంచి ఉద్యోగం సాధించలేరు.

స్వతంత్రంగా వ్యవహరించలేరు, ఎవరో ఒకరిపై ఆధారపడి ఉండాల్సి వస్తుంది. అందువల్ల అలాంటి పిల్లలపై చిన్న వయసులోనే మరింత శ్రద్ధ పెడితే.. పెద్దయ్యాక సాధారణ జీవితం గడపగలుగుతారు.


చుక్కలు కలపండి



రంగులు వేయండి




పిల్లలకు శిక్షణ ముఖ్యం



మీ పిల్లల కోరికలు, అవసరాలు తీర్చటం ప్రధానమే, కాని మీరు వాటన్నింటినీ తీర్చేస్తారని వారు భావించరాదు. చుట్టూ ఉన్న వారినిచూసి పిల్లలు నేటి రోజులలో చాలా త్వరగా అనేక విషయాలు తెలుసుకుంటున్నారు. నేర్చుకుంటున్నారు. ఇతర పిల్లలు చెడు చేసినా అదికూడా ఆచరిస్తున్నారు. మీరు మీ పిల్లాడికి మొదటి గురువు. కనుక అతనికి ఏది సరి అయినది, ఏది కాదు అనేది తెలియజెప్పాలి. మరి ఈ పిల్లలకు శిక్షణ నివ్వటానికి కొన్ని చిట్కాలు చూడండి. జీవితంలో క్రమశిక్షణగా ఉండటం ఎంత ప్రాముఖ్యమనేది మీ పిల్లలకు వివరించండి. ఇక్కడ క్రమశిక్షణ అంటే పిల్లాడికి సంబంధించి మాత్రమే. అతనికిగల హద్దులు వివరించాలి. చెడు ప్రవర్తన సరిచేసుకోవాలి. వారికి హద్దులు పెట్టండి. చిన్నారుల మైండ్‌కు శిక్షణగా కొన్ని ఉదాహరణలు చూపండి. పిల్లలకు నిజాయితీగా ఉండటమనేది నేర్పించటం తేలిక పని కాదు. చాలాసహనం ఉండాలి, భాధ్యత ఉండాలి. పిల్లలు వారి తోటివారితో కలిస్తే ఎంత నిజాయతీగా వుంటారనేది కూడా గమనించాలి. కాని, నిజాయతీని పిల్లవాడిని నేర్పించటం మీ భాధ్యత. తనకు తాను నిజాయతీగా ఉండటం, ఇతరులకు తాను నిజాయతీగా ఉండటం నేర్పించాలి. వారిని అలా తయారు చేయాలంటే ముందు మీరు వారికి నిజాయతీగా కనపడాలి. మీ బిడ్డ వద్ద అబద్ధం చెప్పకండి అతను చెప్పినా సమర్ధించకండి. పిల్లలు ఎల్లపుడూ తమ వంతు సహకారం ఇవ్వడానికే చూస్తారు. ముందు తల్లితండ్రులకు సహకరిస్తారు. తండ్రికి షూస్ తెచ్చి ఇవ్వడం, తల్లికి కిచెన్‌లో సహకరించటం వంటివి. మీరు వారిని ప్రోత్సహించాలి. అతను సరిగా ఆపని చేయలేకపోయినా, మీరు నిరుత్సాహ పరచ వద్దు. నిరుత్సాహ పరిస్తే వారు భాధ్యతలేక తయారవుతారు. కనుక వారిని జోక్యం చేసుకోనివ్వండి. నేర్చుకునేలా చేయండి.

దారి కనుక్కోండి



12 SPORTS హైదరాబాద్
మనం స్పోర్ట్స్
ఆదివారం, 7 జనవరి, 2018
www.manamnews.com

వీర పాండ్య

టీమిండియాకు జీవం పోసిన హార్దిక్

- తృటిలో సెంచరీ కోల్పోయిన ఆల్ రౌండర్
- తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 209 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 65/2
- ఆధిక్యం 142
- ఫ్రీడం సిరీస్ తొలి టెస్టు

17వ శతాబ్దంలో బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీని ఎదిరించి పోరాడిన వీర పాండ్య కట్ట బొమ్మన గురించి విన్నాం. ఇప్పుడు అదే ప్రతికూల పరిస్థితుల్లో విదేశీ గడ్డపై పోరాడిన టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య బ్యాటింగ్‌ను చూశాం. ఒక్కొక్కటిగా భారతదేశంలోని ప్రాంతాలన్నింటినీ తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నించిన ఈస్టిండియా కంపెనీని ఎదిరించిన ధీశాలి ఆ పాండ్య అయితే.. వరుస విరామ సమయాల్లో వికెట్లు కోల్పోతూ పీకల్లోతు కష్టాల్లో ఉన్న టీమిండియాకు తన బ్యాటింగ్‌తో జీవం పోసిన ధీరుడు ఈ పాండ్య.

పాండ్యాకు 2 వికెట్లు

తర్వాత రెండో ఇన్నింగ్స్‌కు దిగిన సౌతాఫ్రికాను పాండ్య దెబ్బ తీశాడు. ఆరంభంలో ఓపెనర్లు మార్‌క్రమ్, ఎల్గార్ ధీటుగా, దూకుడుగా ఆడారు. కానీ పాండ్య వేసిన 15వ ఓవర్లో చివరి బంతికి మార్‌క్రమ్, 16వ ఓవర్లో నాలుగో బంతికి ఎల్గార్ అవుటయ్యారు. 59 పరుగులకే సౌతాఫ్రికా 2 వికెట్లు కోల్పోయింది. దీంతో టీమిండియా శిబిరంలో ఉత్సాహం నిండింది. ఆత్మవిశ్వాసం రెట్టింపయింది. తర్వాత వచ్చిన కగిసో రబాడ (2), హషీం ఆమ్లా (4) నాటౌట్‌గా నిలవడంతో రెండో రోజు ఆట ముగిసింది.



కేప్‌టౌన్: 92 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన టీమిండియాను హార్దిక్ పాండ్య 200 పరుగుల మార్క్‌ను దాటించాడు. 95 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్సర్‌తో 93 పరుగులు చేసి అవుటయ్యాడు. పాండ్య సెంచరీ చేసివుంటే చరిత్ర పుటల్లో నిలిచిపోయేవాడు. అయినప్పటికీ తన ఆట తీరుతో కోట్లాది మంది భారత్ అభిమానుల హృదయాలను దోచుకున్నాడు. రెండో రోజు శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కోహ్లీ సేన 209 పరుగులకు ఆలౌటైంది.

రోహిత్ అవుట్

3 వికెట్ల నష్టానికి 28 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా ఆటగాళ్లు చెటేశ్వర్ పుజారా, రోహిత్ శర్మ క్రీజు వద్ద నిలదొక్కుకున్నట్టు కనిపించింది. వికెట్ కోసం ఫిలాండర్, డేల్ స్టెయిన్ తీవ్రంగా కృషి చేశారు. భారత బ్యాట్స్‌మెన్ కూడా అంతే స్థాయిలో ప్రతిఘటించారు. కానీ కగిసో రబాడ వేసిన బంతిని ఆడలేక రోహిత్ తన ప్యాడ్‌కు తగిలించుకున్నాడు. ఫీల్డర్లు అపీల్ చేయగానే అంపైర్ ఎల్‌బిడబ్ల్యూ అవుటచ్చారు. కానీ అంపైర్ నిర్ణయంపై అనుమానం వచ్చిన రోహిత్ రివ్యూ కోరాడు. బంతి వికెట్ల మీదికి వెళుతున్నట్టు రివ్యూలోనూ స్పష్టంగా తేలడంతో రోహిత్ పెవిలియన్‌కు వెళ్లకతప్పలేదు. తర్వాత వచ్చిన రవిచంద్రన్ అశ్విన్ మరో ఎండ్‌లో ఉన్న పుజారాతో జత కలిశాడు.

రెండో రోజు ఆటలో రోహిత్ 18 బంతుల తర్వాత రన్స్ నమోదు చేశాడు. మరో ఎండ్‌లో ఉన్న పుజారా.. స్టెయిన్ బౌలింగ్‌లో ఒక ఫోర్ కొట్టాడు. దీంతో మోర్నే మోర్కెల్‌ను కెప్టెన్ డు ప్లెసిస్ బౌలింగ్‌కు దించాడు. పుజారా, రోహిత్ ఎంతో ఓపికగా ఆతిథ్య జట్టు బౌలర్లను ఎదుర్కొన్నారు.

మోర్కెల్ బౌలింగ్‌లోనూ పుజారా ఒక బౌండరీ కొట్టాడు. అయితే రగిసా రబాడ బౌలింగ్‌కు దిగిన తర్వాత కాస్త టెన్షన్ పెరిగింది. రోహిత్ బ్యాట్ అంచును తాకిన బంతి ఫోర్‌కు వెళ్లింది. కానీ రెండుసార్లు సౌతాఫ్రికా ఫీల్డర్లు కాట్ బిహైండ్‌కు అప్పీల్ చేశారు. రబాడ రాకెట్ వేగంతో బంతులు వేశాడు.

అందులో ఒకదానికి రోహిత్ సరైన సమయంలో బ్యాట్‌ను తేలేకపోయాడు. దీంతో రోహిత్ వికెట్ల ముందు దొరికిపోయాడు. రోహిత్ రివ్యూ కోరినా ఫలితం దక్కలేదు. తర్వాత వచ్చిన అశ్విన్‌కు రబాడ బౌన్సర్‌తో స్వాగతం పలికాడు. బంతి అశ్విన్ గ్లోవ్‌కు తగలడంతో భారత్ ఫిజియో వచ్చి పరిశీలించాడు. తర్వాత బంతి కూడా అశ్విన్ గ్లోవ్‌కు తగిలి ఫోర్‌కు వెళ్లింది.

కానీ తర్వాత మోర్కెల్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టడంతో అశ్విన్ విశ్వాసం మరింత బలపడింది.

పాండ్యా వీర విహారం

భోజన విరామం తర్వాత జరిగిన రెండో సెషన్‌లో మరో మూడు కీలకమైన వికెట్లను టీమిండియా కోల్పోయింది. తొలి బంతికే పుజారా అవుటయ్యాడు. బయటికి వెళుతున్న బంతిని ముట్టుకుని పెవిలియన్ దారిపట్టాడు. దీంతో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ అవుటైనట్టయింది. పుజారా అవుటయ్యే సమయానికి టీమిండియా 76 పరుగులకు 7 వికెట్లు కోల్పోయింది. ఇక లోయర్ ఆర్డర్‌లో అంతా బౌలర్లే. భారత శిబిరంలో ఆశలు సన్నగిల్లాయి. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా కనీసం 100 పరుగుల మార్క్‌ను దాటుతుందా అనే అనుమానం కలిగింది. తర్వాత హార్దిక్ పాండ్య బ్యాటింగ్‌కు దిగాడు. 81 పరుగుల వద్ద అశ్విన్ అవుటయ్యాడు. తర్వాత వచ్చిన వృద్ధిమాన్ సాహా పరుగుల ఖాతా ప్రారంభించకుండానే వెనుదిరిగాడు. ఇక అంతా అయిపోయిందనుకుంటున్న సమయంలో క్రీజులోకి వచ్చిన భువనేశ్వర్ కుమార్, పాండ్య కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. క్రీజులోకి వచ్చింది మొదలు పాండ్య దూకుడుగా ఆడాడు. ఇది వన్డే కాదు.. టెస్టు మ్యాచ్.. అందులోనూ ఇటువంటి పరిస్థితుల్లో వికెట్ నిలబెట్టుకోవాలి కానీ అంత దూకుడెందుకు అని అభిమానులు ఆందోళన చెందారు. కానీ తర్వాత తెలిసింది పాండ్య దూకుడు కరెక్టేనని. దూకుడుగా ఆడే క్రమంలో ఒకట్రెండుసార్లు పాండ్యకు లైఫ్‌లు లభించాయి. కానీ సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలింగ్ త్రయం ఫిలాండర్, స్టెయిన్, మోర్కెల్‌లను పాండ్య ధీటుగా అడ్డుకున్నాడు. మరో వికెట్ పడకుండా భువనేశ్వర్ అండగా నిలవడంతో పేసర్ల బౌలింగ్‌లోనూ ఫోర్లు బాదుతూ స్కోరు బోర్డును ధైర్యంగా ముందుకు నడిపించాడు. భారీ భాగస్వామ్యం దిశగా వీరి జోడీ పయనించడం ప్రొటీస్ కెప్టెన్ ప్లెసిస్‌కు ప్రమాద హెచ్చరికలు చేసింది. దీంతో ఈ జోడీని విడగొట్టేందుకు స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను కూడా దించారు.

స్కోరుబోర్డు

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286 ఆలౌట్

ఇండియా తొలి ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు: 28/3): పుజారా (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 26, రోహిత్ శర్మ ఎల్‌బిడబ్ల్యూ (బి) రబాడ 11, అశ్విన్ (సి) డి కాక్ (బి) ఫిలాండర్ 12, హార్దిక్ పాండ్య (సి) డి కాక్ (బి) రబాడ 93, సాహా ఎల్‌బిడబ్ల్యూ (బి) స్టెయిన్ 0, భువనేశ్వర్ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 25, మహ్మద్ షమీ నాటౌట్ 4, బుమ్రా (సి) ఎల్గార్ (బి) రబాడ 2; ఎక్స్‌ట్రాలు: 14; **మొత్తం 73.4 ఓవర్లలో 209 ఆలౌట్;** వికెట్ల పతనం: 4–57, 5–76, 6–81, 7–92, 8–191, 9–199, 10–209; బౌలింగ్: ఫిలాండర్: 14.3–8–33–3, స్టెయిన్: 17.3–6–51–2, మోర్కెల్: 19–6–57–2, రబాడ: 16.4–4–34–3, మహరాజ్: 6–0–20–0.

సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్య 34, ఎల్గార్ (సి) సాహా (బి) పాండ్య 25; **మొత్తం 20 ఓవర్లలో 65/2;** వికెట్ల పతనం: 1–52, 2–59; బౌలింగ్: భువనేశ్వర్: 6–3–16–0, బుమ్రా: 4–0–14–0, షమీ: 5–1–15–0, పాండ్య: 4–0–17–2, అశ్విన్: 1–0–3–0.

హార్దిక్ సెంచరీ మిస్

టీ బ్రేక్ తర్వాత కూడా పాండ్య వీర విహారం కొనసాగింది. పాండ్య ధీటైన బ్యాటింగ్‌ను చూసి సౌతాఫ్రికా బౌలర్లు రెచ్చిపోయారు. వరుసబెట్టి బౌన్సర్లు వేశారు. కానీ ప్రొటీస్ బౌన్సర్లకు పాండ్య ఏమాత్రం భయపడలేదు. వాళ్లు బౌన్సర్లు వేసే కొద్దీ పాండ్య మరింత రెచ్చిపోయాడు. బౌన్స్‌తో పాటు వైడ్స్ వేసిన రబాడ బౌలింగ్‌లో పాండ్య అంతే ఆవేశంతో భారీ షాట్లు కొట్టేందుకు ప్రయత్నించాడు. క్రీజులోకి వచ్చింది మొదలు అవుటయ్యే వరకు పాండ్య ముఖంపై చిరునవ్వు చెదరలేదు. ఏ సందర్భంలోనూ అతను టెన్షన్‌కు గురికాలేదు. కానీ టీ విరామం అప్పటి వరకు పాండ్యకు అండగా నిలిచిన భువనేశ్వర్ 67వ ఓవర్లో మోర్కెల్ వేసిన బంతికి అవుటయ్యాడు.

దీంతో పాండ్య, భువీ కలిసి ఎనిమిదో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని అందించినట్టయింది. తర్వాత పాండ్య ఆ దూకుడు తగ్గింది. టీ బ్రేక్ నుంచి తిరిగి వచ్చిన పాండ్య సెంచరీ దిశగా వెళుతున్న సమయంలో 70వ ఓవర్లో రబాడ వేసిన తొలి బంతికి పాండ్య కీపర్ డి కాక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 93 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అవుట్ కావడంతో సెంచరీ పూర్తి చేయకుండానే పాండ్య పెవిలియన్ దారిపట్టాడు. తర్వాత వచ్చిన వృద్ధిమాన్ సాహా (0), జస్‌ప్రీత్ బుమ్రా (2) అవుట్ కావడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్ ముగిసింది.



కెప్టెన్‌గా, బ్యాట్స్‌మన్‌గా కోహ్లీ

కీలకపాత్ర పోషిస్తాడు

మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ

న్యూఢిల్లీ: ప్రపంచ టెస్టు ర్యాంకింగ్స్‌లో 2వ స్థానంలో ఉన్న సౌతా ఫ్రికాతో ఎదురవుతున్న కఠినమైన సవాళ్లను సమ ర్థవంతంగా ఎదుర్కొనేం దుకు విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా, బ్యాట్స్‌మన్‌గా కీలకపాత్ర పోషిస్తాడని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇండియా, సౌతాఫ్రికా మధ్య శుక్రవారం కేప్‌టౌన్‌లో తొలి టెస్టు ప్రారంభమైన సంగతి తెలిసిందే. కెప్టెన్‌గా, బ్యాట్స్‌మన్‌గా సమతుల్యత సాధించడం చాలా అవసరమని గంగూలీ అన్నారు. 'ఇది విరాట్ కోహ్లీకి తొలి విదేశీ పర్యటన. అందులోనూ చాలా కఠినమైన సౌతాఫ్రికాతో. విరాట్ ఫామ్‌లో ఉండటం జట్టుకు చాలా అవసరం. తొలిసారి కెప్టెన్‌గా కోహ్లీ సౌతాఫ్రికాకు వెళ్లాడు. కెప్టెన్‌గా, బ్యాట్స్‌మన్‌గా బ్యాలెన్స్ చేసుకోవడం చాలా అవసరం. గత రెండు సందర్భాల్లో అంటే అడిలైడ్, సిడ్నీలలో కెప్టెన్‌గా కోహ్లీ నిరూపించుకున్నాడు. ఆ ఘటనలు కోహ్లీ ఇంకా గుర్తుండివుంటాయని.. అవి ఇక్కడ ఉపయోగపడతాయని భావిస్తున్నాను' అని గంగూలీ అన్నారు. సౌతాఫ్రికాలో కోహ్లీ రెండు టెస్టులు ఆడి 119, 96 పరుగులు చేశాడు. అందులో ఒక టెస్టు డ్రా అయింది. 2017 జోరును విభిన్నమైన సౌతాఫ్రికాలోనూ కొనసాగించడం కీలకంగా మారనుందని గంగూలీ అన్నారు. '2017లో టీమిండియా అసాధరణ ప్రతిభ కనబ రిచింది. అదే జోరును కొనసాగించాలని భావి స్తోంది. కానీ అందరూ ఇక్కడో విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇక్కడి పరిస్థితులు భారత్‌లో పరి స్థితులకు పూర్తి భిన్నంగా ఉంటాయి. అయినప్పటికీ చరిత్రను తిరగరాసే సామర్థ్యం ప్రస్తుత టీమిండియాకు ఉంది' అని గంగూలీ చెప్పారు.

భారత జట్టులో ఆనంద్

చెస్ ఒలింపియాడ్‌పై ఆసక్తి



చెన్నై: చెస్ ఒలింపి యాడ్‌లో భారత్ జట్టుకు ఆడేందుకు గ్రాండ్ మాస్ట ర్ విశ్వ నాథన్ ఆనంద్ ఆసక్తి కన బరిచాడు. ఈ టోర్నీ ఈ ఏడాది చివర్లో జార్జియాలో జరగనుంది. ఇటీవల వరల్డ్ ర్యాపిడ్ టైటిల్ గెలిచిన సందర్భంగా ఆనం ద్‌ను తమిళనాడు చెస్ అసోసియేషన్ సన్మానిం చింది. అదే టోర్నీలో బ్లిట్జ్ ఈవెంట్‌లో ఆనంద్ కాంస్యం గెలిచాడు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. మరోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచినందుకు చాలా ఆనందంగా ఉందన్నాడు. ప్రపంచ చాంపియన్ అన్న ప్రజల పిలుపుకు కొద్ది కాలం దూరమయ్యా నన్నాడు. గత రెండు సంద ర్భాల్లో మిశ్రమ ఫలితాలొచ్చాయని చెప్పాడు. 'ప్రతి భావంతులైన యువకులు సత్తా చాటుతుండడంతో చాలా ఇబ్బంది పడ్డాను. గత రెండు ర్యాపిడ్ ఈవెం ట్లలో నేను అంతగా రాణించలేదు. పోడియంకు చేరుకునేందుకు ఎదురు చూసేవాడిని. కానీ ఈసారి ఊహించలేదు' అని ఆనంద్ తెలిపాడు.



టాటా ఓపెన్ విజేత గైల్స్

పుణె: టాటా ఓపెన్ మహరాష్ట్ర ట్రోఫీ టెన్నిస్ టోర్నీలో ఫ్రెంచ్ ప్లేయర్ గైల్స్ సైమన్ విజేతగా నిలిచాడు. శనివారమిక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో 89వ ర్యాంక్ కలిగిన అన్‌సీడెడ్ ఫ్రెంచ్ ప్లేయర్ 7–6 (4), 6–2తో రెండో సీడ్ ఆటగాడు కెవిన్ ఆండర్సన్‌ను చిత్తు చేశాడు. కెరీర్‌లో ఒకనొకప్పుడు 6వ ర్యాంక్‌కు చేరుకున్న సైమన్ డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ రాబర్టో బాటిస్టా ఆగట్, టాప్ సీడ్, ప్రపంచ 6వ ర్యాంక్ ఆటగాడు మారిన్ సిలిక్‌లను ఓడించి ఫైనల్‌కు చేరుకున్నాడు. 2015 ఫిబ్రవరిలో మార్సెల్లీలో గైటిల్ గెలిచిన తర్వాత సైమన్‌కు ఇదే తొలి టైటిల్. ప్రత్యర్థి సర్వీస్‌లను, రిటర్న్ షాట్స్‌ను అందుకునేందుకు సరైన పొజిషన్‌లో గైల్స్ నిలిచి అదరగొట్టాడు. కోర్టు అంతా కలియ తిరుగుతూ శక్తివంచన లేకుండా ఆడాడు. దీంతో ఆండర్సన్ లాంగ్ ర్యాలీస్‌ను అందుకోలేకపోయాడు. ఇది ఈ ఫ్రెంచ్ ఆటగాడికి కలిసొచ్చింది. 2017 యూఎస్ ఓపెన్ రన్నరప్ ఆండర్సన్ తన సర్వీస్‌ను కొనసాగించడంలో ఇబ్బంది పడ్డాడు. ఆండర్సన్ పేలవమైన రిటర్న్ షాట్స్, అనవసర తప్పిదాలు సైమన్‌కు బాగా కలిసొచ్చాయి.

విజేతలు కాజల్, గుఫ్రన్

ఫెడరేషన్ కప్ ఆలిండియా క్యారమ్ చాంపియన్‌షిప్



ముంబై: ఫెడరేషన్ కప్ ఆలిండియా క్యారమ్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో కాజల్ కుమారి, పురుషుల విభాగంలో మహ్మద్ గుఫ్రన్ విజేతలుగా నిలిచారు. వీరిద్దరూ పెట్రోలియం స్పోర్ట్స్ ప్రామోషన్ బోర్డ్ (పీఎస్‌పీబీ)కి చెందిన ప్లేయర్స్ కావడం విశేషం. మహిళల ఫైనల్లో కాజల్ బోర్డును పూర్తిగా తన ఆధీనంలో ఉంచుకుని 25–13, 25–12తో జైన్ ఇరిగేషన్‌కు చెందిన ఐషా మహ్మద్‌ను చిత్తు చేసింది. మరోవైపు గుఫ్రన్ ఆరంభంలో బాగా ఆడినప్పటికీ రెండో గేమ్‌ను కోల్పోయాడు. కానీ ఉత్కంఠ భరితంగా సాగిన పురుషుల ఫైనల్లో చివరికి గుఫ్రన్ 25–13, 12–25, 22–19తో రిజర్వ్ బ్యాంక్ ఆటగాడు, ప్రపంచ చాంపియన్ ప్రశాంత్ మోరెపై పోరాడి గెలిచాడు. కాగా మహిళల విభాగంలో పీఎస్‌పీబీకే చెందిన రష్మీ కుమారి 25–7, 17–25, 25–11తో సహచరురాలు ఎం. ప్రమీలా దేవిని ఓడించి మూడో స్థానం కైవసం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో ఎయిరిండియాకు చెందిన రియాజ్ అక్బరలీ 25–8, 25–10తో జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీం ఖాన్‌పై గెలిచి మూడో స్థానం సంపాదించాడు.

కర్రల సాయంతో నడుస్తున్న జయసూర్య



కొలంబో: శ్రీలంక క్రికెట్ దిగ్గజ బ్యాట్స్‌మన్ సనత్ జయసూర్య అరోగ్యం బాగోలేనట్టు తెలు స్తోంది. ఊతం లేకుండా కనీసం నడవలేక పోతున్నాడు. క్రికెట్ ఆడే రోజుల్లో విధ్వంసకర బ్యాట్స్‌మన్‌గా జయసూర్యకు పేరుంది. 1996లో జరిగిన వరల్డ్ కప్‌లో తొలిసారి శ్రీలంక ప్రపంచ చాంపియన్‌గా నిలిచేందుకు జయసూర్య కీలకపాత్ర పోషించారు. 48 ఏళ్ల జయసూర్య కొద్ది రోజులుగా మోకాలి గాయంతో బాధపడు తున్నారు. ప్రస్తుతం ఆయన చేతి కర్రల సాయంతో నడుస్తున్నారు. అయితే త్వరలోనే శస్త్ర చికిత్స కోసం ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ వెళ్లను న్నట్టు తెలుస్తోంది. శస్త్ర చికిత్స తర్వాత కోలు కునేందుకు నెల రోజుల సమయం పట్టే అవకాశ ముంది. అప్పటి వరకు ఈ దిగ్గజాన్ని అబ్జర్వేషన్‌లో పెడతారు. జయసూర్య తన క్రికెట్ కెరీర్‌లో టెస్టుల్లో 6973 పరుగులు చేసి 98 వికెట్లు తీసుకున్నారు. వన్డేల్లో 13,430 పరుగులు చేసి 323 వికెట్లు, టీ20ల్లో 629 పరుగులు చేసి 19 వికెట్లు పడగొట్టారు. అంతేకాకుండా శ్రీలంక క్రికెట్ బోర్డులో సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా రెండుసార్లు సేవలందించారు. సౌతాఫ్రికా పర్యటనలో, సొంత గడ్డపై టీమిండియా చేతిలో శ్రీలంక ఘోర పరాజయంపాలు కావడంతో జయసూర్య నేతృత్వంలోని సెలెక్షన్ ప్యానెల్ రాజీనామా చేయాల్సి వచ్చింది.

పాలివ్వలేదు.. కాలితో తన్నాయి

ప్రభుత్వానికి గోవులను తిరిగిచ్చిన బాక్సర్లు

హరియాణా: గతేడాది హరియాణా ప్రభుత్వం సరికొత్త ఆలోచనను ఆచరణలో పెట్టింది. నవంబర్‌లో జరిగిన మహిళల వరల్డ్ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన ఆరుగురు బాక్సర్లు జ్యోగి, నీతు, సాక్షి, శశి, అనుపమ, నేహాలకు ప్రభుత్వం గోవులను బహుమతిగా ఇచ్చింది. ఆ సమయంలో ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ ధంకర్ మాట్లాడుతూ.. 'బర్రె పాలల్లో కంటే ఆవు పాలల్లో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది కనుక ఇవి బాక్సర్లకు ఎంతో మంచిది. అంతేకాకుండా ఆవు చాలా చురుగ్గ ఉంటుంది. కానీ బర్రె ఎక్కువ శాతం నిద్రలో గడుపుతుంది. హరియాణాలో ఒక సామెత ఉంది.. శక్తి కావాలంటే బర్రెపాలు తాగాలి.. అందం, తెలివి కావాలంటే ఆవు పాలు తాగాలి అని అంటారు. ఈ బాక్సర్లు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గర్వ కారణంగా నిలిచారు.

వీరు మరిన్ని పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. గోవులను తీసుకునే సమయంలో ఈ సరికొత్త ఆలోచనా విధానానికి బాక్సర్లు కూడా చాలా సంతోష పడ్డారు. గోవును దేవతగా పూజిస్తారు కాబట్టి.. బాక్సర్లు ఆ దేవతామూర్తి స్వయంగా తమ ఇంటికి వచ్చినట్టు సంబరపడ్డారు. అయితే గోవులను పెంచడం ఓ కళ. అవి అంత సులువుగా మచ్చిక కావు. మచ్చిక చేసుకోకపోతే పాలు ఇవ్వవు. ఈ విషయం తెలియక తీసుకున్న ఆ బాక్సర్లు తర్వాత నానా ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆ ఆరుగురు బాక్సర్లలో ముగ్గురు బాక్సర్లు జ్యోతి, నీతు, సాక్షి తమ గోవులను హరియాణా ప్రభుత్వానికి తిరిగిచ్చేశారు. పాలు తాగడం మాట అటుంచితే.. పాలు పితికేందుకు వెళ్లిన బాక్సర్ తల్లి గాయపడింది. 'మా అమ్మ ఐదు రోజులు గోవుకు తిండి పెట్టింది. పాలివ్వడం పక్కన పెడితే మా అమ్మను మూడుసార్లు కాలితో తన్నింది. దీంతో స్నాయువు నొప్పితో బాధపడింది. వెంటనే ఈ గోవును తిరిగిచ్చేశాం. మాకున్న బర్రెలతోనే మేమిప్పుడు సంతోషంగా ఉన్నాం' అని రోహతక్‌కు చెందిన జ్యోతి చెప్పింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.